
'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

మోదీతో ఫైనల్స్

అసెంబ్లీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ మాత్రమే: సీఎం రేవంత్‌రెడ్డి

- ఇప్పుడు పాకిస్తాన్ జట్టు లాంటి మోదీతో కొట్లాడాలి... బీజేపీ నేతలు తెలంగాణపై ముప్పేట దాడి చేస్తున్నారు
- మతం పేరుతో రాజకీయం చేస్తున్నారు.. ప్రభుత్వాన్ని కూల్చాలని చూస్తున్నారు
- సోషల్ మీడియా కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలి
- బిడ్డకు బెయిల్ కోసం బీజేపీతో కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్/ మెదక్ జోన్: 'రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ మాత్రమే. ఇప్పుడు ఫైనల్స్ ఆడుతున్నాం. సెమీస్‌లో బంగ్లాదేశ్ జట్టు లాంటి కేసీఆర్‌ను ఓడించాం. ఇప్పుడు పాకిస్తాన్ జట్టు లాంటి మోదీతో కొట్లాడాలి. బీజేపీ నేతలు అమిత్‌షా, జేపీ నడ్డా సహా ముఖ్య నేతలు తెలంగాణపై ముప్పేట దాడి చేస్తున్నారు. ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగిస్తున్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. కష్టపడి తెచ్చిన ప్రభుత్వాన్ని కూల్చేయాలని చూస్తున్నారు. సోషల్ మీడియా కార్యకర్తల రెక్కల కష్టంతో ఏర్పడిన

మిగతా 2వ పేజీలో ▶


మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట జనజాతర సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హరీశ్.. రాజీనామా లేఖ రెడీ పెట్టుకో..

హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించా. ఆగస్టు 15లోపు రుణ మాఫీ చేస్తానని చెప్పా. ఆ తేదీ తర్వాత సిద్దిపేటకు ఆయన శని వదిలిపోతుంది. రైతు రుణమాఫీతో పాటు మిగతా అంశాలను పేర్కొంటూ తన మామ చెప్పిన సీస పద్యమంతా రాజీనామా లేఖలో రాసుకొచ్చారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా చెల్లుతుందా? మళ్లీ చెప్తున్నా.. ఆగస్టు 15 లోపు రుణ మాఫీ చేస్తా. హరీశ్‌రావు రాజీనామా లేఖను రెడీగా పెట్టుకోవాలి.


అమరవీరుల స్తూపం వద్ద హరీశ్‌రావు, తలసాని, కేపీ వివేకానంద

ఇదిగో నా రాజీనామా

- లేఖతో గన్‌పార్కు అమరవీరుల స్తూపం వద్దకు హరీశ్‌రావు
- సీఎం రేవంత్‌కు నిజాయతీ ఉంటే రాజీనామా చేయాలి
- జర్నలిస్టులకు రాజీనామా లేఖను ఇచ్చిన సిద్దిపేట ఎమ్మెల్యే

- వివరాలు 2లో

గడువులోపు రేవంత్ హామీలు అమలు చేస్తే నేను సిద్దిపేట ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఉపఎన్నికకు కూడా దూరంగా ఉంటా.

- హరీశ్‌రావు

3 రోజులు మరింత భగభగలు

9 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ..

వివిధ ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

సగటుకన్నా సుమారు 4 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వెల్లడి

అత్యవసరమైతే తప్ప ప్రజలు పగలు బయటకు రావొద్దంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిలో నమోదవుతున్నాయి. ప్రస్తుతం నమోదు కావాల్సిన సాధారణ సగటు కంటే 4.2 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న మూడు రోజులు కూడా ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతాయని హెచ్చరించింది. పలుచోట్ల వడగాడ్పులు కూడా వీచే అవకాశం ఉందని తెలిపింది. నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లోని పలుప్రాంతాల్లో వడగాడ్పులు తీవ్ర స్థాయిలో వీస్తాయని అధికారులు హెచ్చరించారు.

మండుతున్న భద్రాద్రి..


రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే భద్రాచలంలో 43.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మంలో సాధారణం కంటే ఏకంగా 4.2 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదవగా భద్రాచలంలో 3.4 డిగ్రీల సెల్సియస్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్లగొండలో 3 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జమ్మికుంటలో 45.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత

వాతావరణ శాఖ వెల్లడించిన ప్రధాన నగరాలే కాకుండా రాష్ట్ర ప్రణాళిక శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధికంగానే నమోదయ్యాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో గరిష్ట ఉష్ణోగ్రత ఏకంగా 45.6 డిగ్రీల సెల్సియస్ మేర నమోదైంది. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం. ఇక పెద్దపల్లి జిల్లా మంథనిలో 45.3 డిగ్రీలు, నల్లగొండ జిల్లా నిడమనూరులో 45.2 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో తేమ శాతం పెరగడంతో ఉక్కపోత భారీగా ఉంది. నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఉక్కపోత ప్రభావంతో 2 నుంచి 3 డిగ్రీల మేర ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న అనుభూతి కలుగుతోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఉ. 11– మ. 4 దాకా డేంజర్ టైం..

రాష్ట్రంలో రానున్న మూడు రోజులు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఉండే ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పెద్దలు, పిల్లలు, దీర్ఘకాలిక సమస్యలున్న వారు అత్యవసర పనులుంటే తప్ప బయటకు వెళ్లరాదని నిపుణులు సూచిస్తున్నారు.



వడదెబ్బతో ఇద్దరు మృతి



నకిరేకల్/ వేములవాడరూరల్: రాష్ట్రంలో తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బ తగిలి ఇద్దరు మృతిచెందారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అడ్లూరుకు చెందిన బోడ అశ్రిత (35) నకిరేకల్ పట్టణంలో నివాసం ఉంటూ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. గురువారం అశ్రిత ఓ శుభకార్యానికి వెళ్లి అస్వస్థతకు గురైంది. వెంటనే ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అశ్రిత వడదెబ్బకు గురైందని, ఆమె గొంతు సంబంధిత సమస్యతో కూడా బాధపడుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. మరో ఘటనలో సిరిసిల్ల జిల్లాలో బిహార్‌కు చెందిన వలస కూలీ ఎండ తీవ్రతకు మృతిచెందాడు. వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన శంకర్ సదా (33) శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. తోటి కూలీలు అతని పరిస్థితి గమనించి వెంటనే సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అందజేశారు. శంకర్ మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మారుతి తెలిపారు.



మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరి తాలూకా కమలాపూర్‌లోని ఏనుగుల పార్కులో ఓ ఏనుగు తన గార్డును అనుకరిస్తున్న వీడియో ఆసక్తి గొలుపుతోంది. పార్కులోని చేతిపంపును ఏనుగు తొండంతో కొడుతుండగా.. గార్డు సుదీప్ తాగి దాహం తీర్చుకున్న వీడియో వైరల్ అవుతోంది. అక్కడి ఏనుగుల పార్కులో ప్రస్తుతం 9 వరకు చిన్న, పెద్ద ఏనుగులు ఉన్నాయి. ఈ పార్కు కాళేశ్వరానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. పర్యాటకుల సందర్శనకు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు మాత్రమే అటవీశాఖ అనుమతులున్నాయి. ఏనుగుల పార్కు అక్కడి మహారాష్ట్ర అటవీశాఖ సంరక్షణలో ఉంది.

– కాళేశ్వరం

శ్రీవారి సేవలో ఉప రాష్ట్రపతి

తిరుమల: భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఉప రాష్ట్రపతికి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి సాదరంగా ఆహ్వానించగా, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికఫాల్ స్వాగతం పలికింది. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం ఉప రాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఉప రాష్ట్రపతికి వేదాశీర్వచనం చేశారు. ఈవో శ్రీవారి శేషవస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల



ఉప రాష్ట్రపతి మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్టు తెలిపారు. తిరుమల క్షేత్రం ప్రాచీన భారతీయ సంస్కృతి, నాగరికతలో మహోన్నతమైనదని అన్నారు.

యూసీసీ అమలే బీజేపీ వాగ్దానం

మోదీ గ్యారెంటీ కూడా ఇదే: అమిత్ షా



గుణ: మతపరమైన పర్సనల్ లాలను తిరిగి తేవడమే కాంగ్రెస్ వాగ్దానమైతే, దేశమంతటా ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అమలుచేయడమే మోదీ వాగ్దానమని బీజేపీ అగ్రనేత అమిత్ షా ప్రకటించారు. ఎలాగైనాసరే దేశవ్యాప్తంగా యూసీసీని అమలుచేసి తీరతామని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా పోటీ చేస్తున్న గుణ పార్లమెంట్ నియోజకవర్గంలో శుక్రవారం అమిత్‌షా ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. ''కాంగ్రెస్ మేనిఫెస్టోను క్షుణ్ణంగా చదివితే ముస్లిం పర్సనల్ లాను మళ్లీ ప్రవేశపెట్టబోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. అంటే ట్రిపుల్ తలాఖ్‌ను మళ్లీ తెస్తారన్నమాట. దేశం షరియా(ఇస్లామిక్ చట్టం)పై నడుస్తుందా? కాంగ్రెస్ అభిప్రాయం ప్రకారం దేశ వనరులపై తొలి హక్కులు ముస్లింలకే దక్కుతాయి. బీజేపీ మాత్రం పేదలు, దళితులు, ఇతరవెనకబడిన వర్గాలు, దళితులకే ఈ తొలి హక్కులు చెందాలంటుంది'' అని షా అన్నారు. ''రాహుల్ బాబా.. బుజ్జగింపు రాజకీయాలు ఎంతైనా చేసుకోండి. బీజేపీ ఉన్నంతవరకు ఎలాంటి పర్సనల్ లాలను దేశంలో అమలుకానివ్వం. ఈ దేశంలో ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం ద్వారానే పాలన సాగుతుంది. ఇదే మా రాజ్యాంగ స్ఫూర్తి. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో యూసీసీ అమలుచేశాం కూడా. ఇదే మా వాగ్దానం. దేశమంతా యూసీసీ అమలే మోదీజీ గ్యారెంటీ. ఒక్క దెబ్బతో ఆర్టికల్ 370 రద్దుచేశాం. రద్దుతో కశ్మీర్‌లో రక్తం వరదలై పారుతుందని రాహుల్ బాబా భయపెట్టారు. ఇది మీ ప్రభుత్వం కాదు. మోదీ సర్కార్. రక్తం సంగతి దేవుడెరుగు, ఒక్క రాళ్లు రువ్వే ఘటన కూడా ఐదేళ్లలో కనిపించకుండా చేశాం'' అని షా వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదం, నక్సలిజం లేకుండా చేశాం

''దేశంలో ఉగ్రవాదం, నక్సలిజాన్ని మోదీ సర్కార్ అణచివేసింది. మధ్యప్రదేశ్‌లోనూ రాష్ట్ర బీజేపీ సర్కార్ నక్సలిజాన్ని మట్టుబెట్టింది. ఆనాడు రిజర్వేషన్లు కల్పించాలంటూ సిఫార్సుచేసిన మండల్ కమిషన్‌ను నాటి కాంగ్రెస్ సర్కార్ తొక్కిపట్టింది. రామమందిర నిర్మాణానికి కాంగ్రెస్ 70 ఏళ్లు అవరోధాలు సృష్టించింది. మోదీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలోనే ఆలయానికి శంకుస్థాపన చేసింది. ఇప్పుడు ఆలయ ప్రాణప్రతిష్ఠ కూడా బ్రహ్మాండంగా జరిగింది. ఆహ్వానం అందినా, సమయం కుదిరినా సోనియా, రాహుల్ ఉద్దేశపూర్వకంగా రాలేదు'' అని షా ఆరోపించారు.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 35

శనివారం 27-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సాక్షి ఎలక్షన్ 2024

జాతీయం.. 11లో

గిర్ సఫారీలో మళ్లీ వార్ వన్‌సైడే..

తెలంగాణ 10లో

మెదక్ మొనగాడెవరు?

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ
- బలమైన అభ్యర్థులను రంగంలో దింపిన మూడు పార్టీలు

ఆంధ్రప్రదేశ్ 12లో

ఖూనీకోరులు, నేరస్తులు...

- హంతకులు, కరడుగట్టిన నేరస్తులకు టికెట్లు కట్టబెట్టిన చంద్రబాబు
- బాబు దృష్టిలో వీరంతా నచ్చీలురు



ఇక వేదికపై కన్నీళ్లు పెడతాడేమో

కపట నాటకాలతో ప్రచార వేదికను కన్నీటితో తడిపేస్తాడేమో అంటూ ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శల వర్షం కురిపించారు.

- వివరాలు 6లో



మాది లోకల్.. మీది ఇటలీ పార్టీ

ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ పక్కా లోకల్ పార్టీ అన్నారు.

- వివరాలు 10లో





మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

చూస్తూ ఊరుకోను.. యుద్ధమే

మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్

- కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను నాశనం చేస్తున్నారు
- ప్రజలు నా యుద్ధానికి బలం ఇవ్వాలి
- పదేళ్లు పాలించిన బీజేపీ పేదలకు ఏం చేసింది?
- ప్రజలు నమ్మడం లేదనే దేవుడిపై సీఎం ఒట్లు

2లో

"ఇప్పుడున్న సీఎం చోటే భాయి.. మోదీ బడే భాయి.. ఇద్దరూ ఒక్కటే.

271 నామినేషన్ల తిరస్కరణ

- పత్రాలపై కొన్నిచోట్ల సంతకాలు చేయని కొందరు..
- కాలమ్స్ అసంపూర్తిగా వదిలేసిన ఇంకొందరు..
- 622 మంది అభ్యర్థుల నామినేషన్లు ఓకే
- ముగిసిన పరిశీలన.. ఉపసంహరణకు 29 గడువు

బీఫాం ఇవ్వకపోవడంతో మందా జగన్నాథం నామినేషన్ తిరస్కరణ

10లో

63.5 శాతం..

13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు ముగిసిన రెండోదశ పోలింగ్

6లో

ట్యాంపరింగ్ అసాధ్యం



- ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కాలేదు: సుప్రీంకోర్టు ధర్మాసనం
- మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానం అంటే ఎన్నికల సంస్కరణలు రద్దయినట్లే
- దాఖలైన అన్ని పిటిషన్లు కొట్టివేత

6లో

సుప్రీం తీర్పు ప్రతిపక్షాలకు చెంపదెబ్బ

ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: మోదీ డిమాండ్

6లో

హైకోర్టు శాశ్వత జడ్జీలుగా జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు



జస్టిస్ శ్రీనివాస్‌రావు



జస్టిస్ రాజేశ్వర్‌రావు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- ఉత్తర్వులు జారీ.. వచ్చే వారం బాధ్యతలు స్వీకరించనున్న న్యాయమూర్తులు

3లో

క్లుప్తంగా...

తెలంగాణ అస్తిత్వ పార్టీ బీఆర్ఎస్: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల స్వరాష్ట్ర పోరాటాలను గమ్యానికి చేర్చిన తెలంగాణ అస్తిత్వ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి (నాటి తెలంగాణ రాష్ట్ర సమితి) అని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు(కేసీఆర్) పేర్కొన్నారు. పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు, రాష్ట్ర ప్రజలకు, శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల పునాదుల మీద పుట్టిన పార్టీ ప్రత్యేక రాష్ట్ర సాధన గమ్యాన్ని ముద్దాడి, పదేళ్ల పాలనలో ప్రజలకు అద్భుతమైన ప్రగతి ఫలాలు అందించడంలో కీలక భూమిక పోషించిందని తెలిపారు. తద్వారా తెలంగాణ దేశం గర్వించే రాష్ట్రంగా నిలిచిందన్నారు. ప్రపంచ రాజకీయ పార్టీల చరిత్రలోనే బీఆర్ఎస్‌ది ప్రత్యేక స్థానమని పేర్కొన్న కేసీఆర్ పార్టీకి బలమైన పునాదులు వేసింది కార్యకర్తలేనని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దన్నుగా నిలుస్తూ వారి ఆదరణ మరింతగా పొందేందుకు నాయకులు,కార్యకర్తలు ఈ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రతిన బూనాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

- జిల్లా కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలకు కేటీఆర్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల కోడ్ దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎటువంటి ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు అన్ని జిల్లా కార్యాలయాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని శుక్రవారం పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కార్యక్రమాలతో పార్టీ యావత్తు పూర్తిగా నిమగ్నమైన నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను జిల్లా కార్యాలయ కేంద్రంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా పార్టీ కార్యవర్గంతో పాటు, పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ భవన్‌లో కేటీ రామారావు పార్టీ జెండాను శనివారం ఉదయం 9 గంటలకు ఆవిష్కరించనున్నారు.

ట్యాపింగ్ కేసులో బెయిల్ పిటిషన్ల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురు నిందితులకు శుక్రవారం నాంపల్లి కోర్టు బెయిల్‌ను నిరాకరించింది. ఈ కేసులో నిందితులు భుజంగరావు, ప్రణీత్‌రావు, తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది. కేసు కీలక దశలో ఉందని, ఇప్పుడు బెయిల్ ఇవ్వొద్దన్న పోలీసుల వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు తిరస్కరించింది. కాగా, మరో నిందితుడు రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

రుణమాఫీ అమలు తథ్యం

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 15 కల్లా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ అమలు చేసి తీరుతారని, హరీశ్‌రావు చౌకబారు రాజకీయాలు మానుకొని అభివృద్ధిలో భాగస్వామి కావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ హితవు పలికారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్.. బద్నాం చేయాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే రెఫరెండం అని సీఎం రేవంత్‌రెడ్డి ధైర్యంగా చెప్పారని, బీఆర్ఎస్ గెలవకపోతే మీ పార్టీని రద్దు చేసుకుంటారా? అని నిలదీశారు. అమరుల త్యాగాల పునాదుల మీద రాజ్యమేలి రాక్షసానందం పొందిన హరీశ్‌కు.. అమరవీరుల స్తూపం వద్ద రాజీనామా డ్రామాలాడే నైతిక హక్కు లేదని సుధాకర్‌రావు స్పష్టం చేశారు.

ఇదంజగత్



వాళ్లయనకు ఓటేయమని అడగటానికి రాలేదు! తనకే వేయమని అడుగుతోంది!

చూస్తూ ఊరుకోను.. యుద్ధమే

మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్

- కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను నాశనం చేస్తున్నారు
- ప్రజలు నా యుద్ధానికి బలం ఇవ్వాలి
- పదేళ్లు పాలించిన బీజేపీ పేదలకు ఏం చేసింది?
- డీకే అరుణ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు?
- చోటే భాయి, బడే భాయి ఇద్దరూ ఒక్కటే
- ప్రజలు నమ్మడం లేదనే సీఎం దేవుడిపై ఒట్లు పెడుతున్నారు

షాద్‌నగర్‌లో బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ప్రాణాలకు తెగించి చచ్చినా పర్వాలేదు అనుకుని ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ కోసం పోరాడా. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను నా కళ్లముందే నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోను. యుద్ధమే..యుద్ధం చేసేందుకు మీరు నాకు బలం ఇవ్వాలి..'అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. దేశాన్ని పదేళ్లుగా పాలించిన బీజేపీ పేదలకు ఏం చేసిందని ప్రశ్నించారు. అచ్చే దిన్ వచ్చిందా? సచ్చే దిన్ వచ్చిందా? అని మండిపడ్డారు. బీఆర్ఎస్ బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం మూడోరోజు మహబూబ్‌నగర్ పట్టణంలో కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. క్లాక్‌టవర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

బీజేపీ ఒక్క నినాదమైనా నిజం చేసిందా?

'బేటీ పడావో, మేక్ ఇన్ ఇండియా, సబ్‌కా సాత్, డిజిటల్ ఇండియా వంటి వంద నినాదాలు ఇచ్చిన బీజేపీ ఒక్కటైనా నిజం చేసిందా? ఆత్మనిర్భర్ భారత్ ఎక్కడుంది? నేను గెలిస్తే రూ.15 లక్షలు వస్తయి అని నరేంద్ర మోదీ పదేళ్ల కింద చెప్పిండు. వచ్చాయా ఎవరికైనా? దేశంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. భర్తీ చేయకపోతే నిరుద్యోగం ఎట్ల పోవాలి? నల్లచట్టాలు తెచ్చినందుకు ఢిల్లీ దగ్గర రైతులు ధర్నా చేశారు. దాదాపు 750 మంది రైతులు చనిపోయారు. పోలీసు కంచెలు పెట్టి వారిని కొట్టారు తప్ప రానియ్యలే. నేను మన రాష్ట్రం తరపున పంజాబ్‌కు పోయి చండీగఢ్‌లో 750 మంది రైతులకు సాయం చేశా..'అని కేసీఆర్ చెప్పారు.

పని చేయని వాళ్లకు ఓటేస్తే ఇబ్బందులే..

'వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని మోదీ నాకు చెప్పాడు. లేకపోతే ఏటా రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.5 వేల కోట్లు బంద్ చేస్తానని అన్నడు. నా ప్రాణం పోయినా, తలకాయ తెగినా నేను మీటర్లు పెట్టేది లేదని చెప్పినా. ఇప్పుడు మోదీకి ఓటు వేస్తే మీటర్లు పెడతా అంటడు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి చోటే భాయి.. నరేంద్ర మోదీ బడే భాయి.. ఇద్దరూ ఒక్కటే. చోటే భాయ్‌కు ఓటేసినా పెద్దన్న పెట్టమంటడు. మీటర్లు పెట్టించుకోవడానికి బీజేపీకి, కాంగ్రెస్‌కు ఓటేయాలా? మోదీ తెలంగాణలోని 7 మండలాలు ఆంధ్రకు ఇచ్చిండు. 400 మెగావాట్ల సీలేరు ప్లాంటును ఆంధ్రకు ఎందుకిచ్చాడు? తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి నీళ్లు ఆంధ్రకు కాల్వ ద్వారా తీసుకుపోతుంటే రఘువీరారెడ్డికి డీకే అరుణ మంగళహారతులు పట్టారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం వంద ఉత్తరాలు రాసినా ఇవ్వలేదు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణ జాతీయ హోదా ఎందుకు తేలేదు? ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? డీకే అరుణకు ఓటు వేయడం అంటే.. అక్కరకు రాని చుట్టం.. మొక్కినా వరమివ్వని వేల్పు అన్నట్టు ఉంటది. మన కంటిని మనమే పొడుచుకుందామా? మనకు విషమిస్తే తాగుదామా? ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. పనిచేయని వాళ్లకు వేస్తే ఇబ్బందులు పడతాం. మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తేనే పాలమూరుకు న్యాయం జరుగుతది..'అని చెప్పారు.

రైతుబంధుకు గ్యారంటీ లేదు

'కాంగ్రెస్ వచ్చి ఐదు నెలలు అయ్యింది. ఓటేస్తే నిమిషాల్లో చేస్తానని చెప్పి ఇప్పటివరకు ఏ పని చేయలే. రైతుబంధు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు రూ.500 బోనస్ గోవిందా. మహబూబ్‌నగర్ జిల్లాలో 25 నుంచి 30 ఎకరాలు ఉన్న రైతు కూడా హైదరాబాద్ వచ్చి ఆటో నడిపేది. వాళ్లను ఆదుకోవాలనే రైతుబంధు అందరికీ ఇచ్చాం. ఇప్పుడు 5 ఎకరాలకే ఇస్తాం అంటున్నరు. రైతులు తెలంగాణ బిడ్డలు కాదా? ఆరు ఎకరాలు ఉంటే కోటీశ్వరులా? నాకు తెలిసి ఇకముందు రైతుబంధుకు గ్యారంటీ ఉండదు.

స్కూటీలు రాలే..లూటీలు వస్తున్నయి

రెసిడెన్షియల్ స్కూళ్లలో విషాహారం తిని విద్యార్థులు చనిపోతున్నా.. చూసే దిక్కు లేదు. ఇప్పటికే నలుగురైదుగురు చనిపోయారు. ఆడబిడ్డలకు స్కూటీలు రాలే కానీ లూటీలు వస్తున్నాయి. కల్యాణలక్ష్మి రూ.లక్ష, తులం బంగారం, మహిళలకు రూ.2,500, ఆసరా పెన్షన్ రూ. 4 వేలు ఏమయ్యాయి? ముస్లిం సోదరులకు ప్రతి రంజాన్ పండుగకు తోఫా ఇచ్చాం. ఈసారి తోఫా ఎందుకు రాలేదు? ప్రజలు నమ్మడం లేదనే ముఖ్యమంత్రి దేవుని పేరుమీద ఒట్లు పెట్టి ఓట్లు అడుతున్నాడు..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇక్కడ కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలుస్తుంది

'మహబూబ్‌నగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంది. ఈ స్థానంలో కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం. ఇక్కడ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీ గెలుస్తుంది. బీజేపీ గెలిస్తే ఇబ్బంది అవుతుంది. బీఆర్ఎస్, బీజేపీకి బీటీం అని కాంగ్రెసోడు అంటడు. మొన్న భువనగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి. బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌ను తీసేసి, కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్‌ను, బీజేపీ వైస్ చైర్మన్‌ను పంచుకున్నయి. ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసి ప్రాబల్యం పెంచుకునేందుకు రెండు జాతీయ పార్టీలు ఒక్కటయ్యాయి..'అని బీఆర్ఎస్ అధినేత విమర్శించారు.

ఎర్రవల్లి నుంచి బయలుదేరి..

బస్సు యాత్రలో భాగంగా కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లి నుంచి బయలు దేరారు. షాద్‌నగర్, జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని అప్పనపల్లికి చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ వాహన శ్రేణితో నిర్వహించిన రోడ్ షో మెట్టుగడ్డ, న్యూటౌన్ చౌరస్తా, బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా మీదుగా సాగింది. క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రజనుద్దేశించి మాట్లాడారు. రాత్రి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాం హౌస్‌లో బస చేశారు.

నేడు నాగర్‌కర్నూల్‌కు

శనివారం ఉదయం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశం కానున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సి వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు.

ఇదిగో నా రాజీనామా

లేఖతో గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్దకు హరీశ్‌రావు

- సీఎం రేవంత్‌కు నిజాయతీ ఉంటే రాజీనామా చేయాలి
- పంద్రాగస్టులోపు హామీలు నెరవేర్చకుంటే తప్పుకో
- ప్రజలకు మేలు చేసేందుకు ఎమ్మెల్యే పదవి వదిలేస్తా
- జర్నలిస్టులకు రాజీనామా లేఖను ఇచ్చిన సిద్దిపేట ఎమ్మెల్యే

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఆగస్టు 15లోపు అమలు చేయకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఒకవేళ సీఎం రేవంత్ చెప్పిన గడువులోపు హామీలు అమలు చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం సాక్షిగా తన రాజీనామా పత్రాన్ని హరీశ్‌రావు జర్నలిస్టులకు అందజేశారు. ఆగస్టు 15లోపు రేవంత్ ప్రభుత్వం హామీలు అమలు చేస్తే తన రాజీనామా పత్రాన్ని స్పీకర్‌కు పంపాలని ఆయన కోరారు. అమరవీరుల స్తూపం వద్దకు రావడం రేవంత్‌కు కుదరకపోతే ఎవరైనా ప్రతినిధి ద్వారా రాజీనామా లేఖ పంపాలని సవాల్ చేశారు.

అమరుల స్తూపం వద్దకు హరీశ్‌రావు

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలు, 13 హామీలు ఆగస్టు 15లోపు అమలు చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని మూడు రోజుల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ చేశారు. హామీలు అమలు చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అసెంబ్లీ ఎదురుగా ఉన్న అమరవీరుల స్తూపం వద్దకు 26వ తేదీ ఉదయం 10 గంటలకు రాజీనామా పత్రంతో రావాలని హరీశ్‌రావు సవాల్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం హరీశ్‌రావు కోకాపేటలోని తన నివాసం నుంచి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ నేతలు లక్ష్మారెడ్డి, ఒంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి గన్‌పార్కు వద్దకు బయలుదేరారు.



అమరవీరుల స్తూపం వద్ద మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గన్‌పార్కు వద్ద పోలీసుల ఆంక్షలు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తోపాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని పుష్పాంజలి ఘటించారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి రాసిన లేఖను జర్నలిస్టులకు అందజేశారు. గన్‌పార్క్‌కు హరీశ్ రాక నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున చేరుకున్నాయి.

మోసాలకు దేవుళ్లను కూడా వాడుకుంటున్నారు

దేవుళ్ల మీద ప్రమాణాలతో ప్రజలు, రైతులను మోసం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోకాపేటలోని తన నివాసంతో పాటు గన్‌పార్కులోని అమరుల స్తూపం వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మోసం చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోమారు మోసం చేసేందుకు ప్రయత్నిస్తోంది. వంద రోజుల్లో హామీలు నెరవేస్తామని బాండ్ పేపర్లు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు తొలి సంతకం చేస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని సోనియా చేత లేఖ కూడా రాయించారు. ప్రజలను మోసం చేసేందుకు ప్రస్తుతం దేవుళ్లను కూడా వాడుకుంటున్నారు.'అని హరీశ్ అన్నారు.

హామీల అమలు నాకు ముఖ్యం

'బాండ్ పేపర్లకు కాలం చెల్లడంతో ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలపై ప్రమాణాలు చేస్తున్నారు. గడువులోపు హామీలు అమలు చేస్తే నేను సిద్దిపేట ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ఉపఎన్నికకు కూడా దూరంగా ఉంటా. సీఎం రేవంత్ కూడా రాజీనామా పత్రం ఇస్తేనే ప్రజలకు నమ్మకం కలుగుతుంది. కొడంగల్‌లో ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించిన రేవంత్ ఆ తర్వాత మాట తప్పాడు. కానీ నాకు మాత్రం ఐదేళ్ల పదవి కంటే ప్రజలు ఇచ్చిన హామీలు నెరవేర్చడం ముఖ్యం. రాష్ట్ర ప్రజలకు మేలు కలగడంలోనే నాకు ఆనందం ఉంది. ప్రతిపక్ష పార్టీగా హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత నాపై ఉంది'అని హరీశ్ వ్యాఖ్యానించారు.

హరీశ్.. పేజీన్నర లేఖ రాసి రాజీనామా నా?



రాజీనామా చేస్తే స్పీకర్ ఫార్మాట్‌లో ఉండాలి

- ఆర్థిక మంత్రిగా ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు ఇవ్వని వ్యక్తి హరీశ్
- మాజీ మంత్రిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాల్లో హరీశ్ రావు ఓ జోకర్‌లా మారారని, ఆయన అన్నీ హౌలా(ఫూలిష్) పనులు చేస్తున్నారని అందుకే ఆయన్ను హౌలేష్‌రావు అంటారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేయడానికి సిద్ధపడితే.. ఆయన స్పీకర్ ఫార్మాట్‌లో లేఖ ఇవ్వాలే తప్ప.. సుదీర్ఘంగా పేజీన్నర లేఖ రాసి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం ఏమిటని మంత్రి కోమటిరెడ్డి నిలదీశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తే..ఆ ఒక్క హామీ కాదు.. మొత్తం 13 హామీలు నెరవేర్చాలని.. లేదంటే రాజీనామాకు సిద్ధం కావాలని హరీశ్ సవాల్ చేస్తూ.. ఓ డూప్లికేట్ రాజీనామా పట్టుకుని అమరవీరుల స్తూపం వద్ద రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే మెదక్‌లో బీఆర్ఎస్ అభ్యర్థికి డిపాజిట్ తెచ్చుకోవాలని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు.

హరీశ్‌కు మతిభ్రమించింది

అధికారం పోయాక హరీశ్‌కు మతిభ్రమించిందని మంత్రి విమర్శించారు. ఆర్థిక మంత్రిగా ఉండి ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు ఇవ్వడం చేతకాని ఈ దద్దమ్మ, ఇవ్వాళ తాము ఒకటో తారీఖు జీతాలు ఇస్తుంటే ఓర్వలేకపోతున్నాడని నిందించారు. ఆయన, ఆయన మామ చేసిన రూ.లక్షల కోట్ల అప్పులకు ప్రతినెలా రూ.26 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

జూన్ 3 తరువాత బీఆర్ఎస్ మూతే...

పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా మూతపడుతుందని మంత్రి జోస్యం చెప్పారు. మీ మామ చేసిన పలు హామీలు అమలు చేయనప్పుడు ఆ రాజీనామా లేఖ తీసుకుని అమరవీరుల స్తూపం వద్దకు వచ్చి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రుణమాఫీ కాంగ్రెస్ బ్రాండ్ అనీ.. అప్పటికే రుణం చెల్లించిన వారికి కూడా అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు ప్రోత్సాహం ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలని సూచించారు.

నష్టమని తెలిసినా.. తెలంగాణ ఇచ్చారు

కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా.. తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నేరవేర్చిన దేవత సోనియాగాంధీ అని మంత్రి కోమటిరెడ్డి కొనియాడారు. తెలంగాణ వస్తే దళితున్ని సీఎం చేస్తానని ఆ తరువాత తానే సీఎం అయిన కేసీఆర్ మోసగాడని నిందించారు.

మోదీతో ఫైనల్స్

▶ మొదటి పేజీ తరువాయి


ప్రభుత్వమిది. దీన్ని మీరే కాపాడుకోవాలి. ప్రతి నిమిషం అలర్ట్‌గా ఉండాలి. 14 ఎంపీ సీట్లలో విజయమే లక్ష్యంగా పనిచేయాలి. రేవంత్ లేకపోతే చాలు.. ఎవరైనా ఫర్వాలేదు అనే పరిస్థితికి బీఆర్ఎస్ నేతలు వచ్చారు. బిడ్డ కవిత బెయిల్ కోసం బీజేపీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారు..' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో, ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జరిగిన జనజాతర సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ

'పదేళ్ల పాలనలో మోదీ, కేసీఆర్ దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకున్నారు. దేశంలో రిజర్వేషన్లను రద్దు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారు.ఈ ఎన్నికలు దేశానికి అత్యంత కీలకం. రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఉద్దేశంతోనే 400 సీట్ల నినాదాన్ని బీజేపీ చేస్తోంది. రిజర్వేషన్లు రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మేసే కుట్ర జరుగుతోంది. బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ కాదు. బ్రిటిష్ జనతా పార్టీగా మారింది. బ్రిటిష్ వాళ్ల మాదిరిగానే మోదీ దేశాన్ని దోచుకొనేందుకు రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారు. ఏళ్ల తరబడి కులగణన జరగడం లేదు. దీంతో బీసీలకు జనాభా లెక్కల ప్రకారం దక్కాల్సిన లబ్ధి దక్కడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కులగణన జరిగితేనే రిజర్వేషన్ కల్పించడం సాధ్యమవుతుంది..' అని రేవంత్ అన్నారు.

జహీరాబాద్ స్థానం బీజేపీకి తాకట్టు

'లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లలో గెలిపిస్తే ఏడాదిలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ అంటున్నారు. అదెలా సాధ్యం? ఇక్కడ అల్లాటప్పాగా కూర్చున్నామా? తండ్రి పేరు చెప్పుకొని కుర్చీలోకి వచ్చామా? బిడ్డ కవిత బెయిల్ కోసం బీజేపీతో కేసీఆర్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారు. తన బిడ్డ కోసం జహీరాబాద్ స్థానాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారు. జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించే కుతంత్రంలో మెదక్‌లో గాలి అనిల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాల్సి ఉండగా జహీరాబాద్‌లో ఇచ్చి గాలికి వదిలేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించేందుకు 60 ఏళ్లుగా అనేక పోరాటాలు జరిగాయి. చివరకు సోనియమ్మ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది. కానీ రాష్ట్రంలో ఎవరికీ ఉద్యోగాలు రాకపోగా కేసీఆర్ కుటుంబానికి.. కొడుకు, కూతురు, అల్లుడుతో పాటు ఆయన బంధువులందరికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి పదవులు దక్కాయి. పదేళ్లుగా గడీల్లో తెలంగాణ తల్లిని బందీ చేశారు. గడీలను బద్దలు కొట్టి తెలంగాణ తల్లికి విముక్తి కల్పించాం..' అని సీఎం చెప్పారు.



సభకు హాజరైన జనం

వైఎస్సార్ హయాంలో సంక్షేమ పథకాలు

'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందాయి. అప్పట్లో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టడం జరిగింది. రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ ఇచ్చారు. పేదలకందరికీ ఉచిత వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టారు. కానీ కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని చెప్పి ఎవరికీ కట్టించిన పాపాన పోలేదు..' అని రేవంత్ విమర్శించారు. 'సోనియాగాంధీ అభీష్టం మేరకు ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తాం. ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం..' అని తెలిపారు.

ఆగస్టు 15 తర్వాత సిద్దిపేటకు శని వదిలిపోతుంది

'హరీశ్‌రావు మోసానికి ముసుగు అమరవీరుల స్తూపం. మోసం చేయాలనుకున్న ప్రతిసారీ ఆయనకు స్తూపం గుర్తొస్తుంది. హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించా. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానని చెప్పా. ఆ తేదీ తర్వాత సిద్దిపేటకు ఆయన శని వదిలిపోతుంది..' అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'హరీశ్‌రావు ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లారా? రైతు రుణమాఫీతో పాటు మిగతా అంశాలను పేర్కొంటూ తన మామ చెప్పిన సీస పద్యమంతా రాజీనామా లేఖలో రాసుకొచ్చారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా చెల్లుతుందా? మళ్లీ చెప్తున్నా.. ఆగస్టు 15 లోపు రుణ మాఫీ చేస్తా. హరీశ్‌రావు రాజీనామా లేఖను రెడీగా పెట్టుకోవాలి. రుణ మాఫీ చేయలేకపోతే మాకు అధికారమెందుకు? దానికి రూ.30 -రూ.40 వేల కోట్లు అవుతుంది. కాళేశ్వరంలో మీరు దోచుకున్న రూ.లక్ష కోట్ల కంటే అది ఎక్కువా? హైదరాబాద్ చుట్టూ ఆక్రమించుకున్న వేలాది ఎకరాల కంటే ఎక్కువా?..' అని సీఎం ఎద్దేవా చేశారు.

పాలమూరు.. ప్రతిష్టాత్మకం!

- సొంత నియోజకవర్గంలో గెలుపుకోసం సర్వశక్తులు ఒడ్డుతున్న సీఎం రేవంత్
- ఈ నెలలో ఇప్పటికే 5 సార్లు పర్యటన..
- స్థానిక ఎమ్మెల్యేలకు వరాలు.. కార్పొరేషన్ పదవులు ఇస్తానని హామీ?
- తనను రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తున్నారంటూ సానుభూతి పొందే యత్నం కూడా..



సాక్షి, హైదరాబాద్: పాలమూరు లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ గెలుపును టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్టు కనిపిస్తోంది. సొంత నియోజకవర్గంలో విజయం కోసం ఆయన సర్వశక్తులు ఒడ్డుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీతో పోటాపోటీ ఉండొచ్చన్న సర్వేల అంచనాలే దీనికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయన వరుస పర్యటనలు, అక్కడి నాయకులు, ప్రజలకు ఇస్తున్న హామీలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయని అంటున్నారు. ఇక్కడ గెలవడం ద్వారా రాష్ట్ర, జిల్లా రాజకీయాలపై పూర్తి ఆధిపత్యం సాధించవచ్చని భావిస్తున్నారని.. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కంటే ఎక్కువగా కష్టపడుతున్నారని కాంగ్రెస్ నేతలే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

వీలైనప్పుడల్లా పర్యటిస్తూ..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాపై రేవంత్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికతోపాటు లోక్‌సభ ఎన్నికపైనా దృష్టిపెట్టారు. అటు అధిష్టానానికి, ఇటు తనకు సన్నిహితుడైన వంశీచంద్‌రెడ్డికి లోక్‌సభ టికెట్ ఇప్పించారు. అధికారికంగా టికెట్ ప్రకటించకముందు, తర్వాత చాలాసార్లు వంశీతో భేటీ అయి ప్రచారం, ఇతర అంశాలపై వ్యూహాలను సిద్ధం చేశారు. అంతేకాదు వీలైనప్పుడల్లా మహబూబ్‌నగర్ పర్యటనలకు వెళ్తున్నారు. ఈ నెలలో ఇప్పటికే ఐదుసార్లు మహబూబ్‌నగర్‌కు వెళ్లిన రేవంత్.. రెండు సభల్లో పాల్గొన్నారు. రెండుసార్లు కొడంగల్ నేతలతో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్ ఎన్నికల ప్రచారానికి వెళ్లింది మూడే సార్లు కావడం గమనార్హం. తాజా సభల్లో, కార్యక్రమాల్లో రేవంత్ మాట్లాడుతున్న తీరు కూడా పాలమూరులో గెలుపే లక్ష్యంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని.. 70ఏళ్ల తర్వాత జిల్లాకు ముఖ్యమంత్రి పదవి వచ్చిందని.. పార్టీలకతీతంగా జిల్లాను అభివృద్ధి చేసుకుందామని రేవంత్ చెప్తున్నారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం మంజూరు, వాల్మీకి బోయ కులస్తులతో భేటీ అయి హామీలివ్వడం ద్వారా ఓటర్లను ఆకర్షించే వ్యూహాలను అమలు చేశారు.

ఎమ్మెల్యేలకు 'స్పెషల్'గా హామీలిస్తూ..

పాలమూరులో గెలుపే లక్ష్యంగా అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని.. ఇందుకోసం ఆ లోక్‌సభ పరిధిలోని ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా హామీలు ఇస్తున్నారని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. అందులోభాగంగానే మహబూబ్‌నగర్ సభ వేదికగా ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని ప్రకటించారని అంటున్నాయి. నియోజకవర్గాల వారీగా మంచి మెజార్టీ తీసుకురావాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు కేబినెట్ హోదాతో కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తానని ఆయన ఎమ్మెల్యేలకు చెప్తున్నట్టు సమాచారం.

ధాన్యం కాంటా వేయాలంటూ రైతుల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

భానుపురి (సూర్యాపేట): మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేయాలని డిమాండ్ చేస్తూ రైతన్న లు రోడ్డెక్కారు. శుక్రవా రం సూర్యాపేట వ్యవ సా య మార్కెట్ యార్డు కు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు కాంటాలు ఆల స్యం అవుతుండటంతో విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆం దోళన చేశారు. యార్డుకు 30 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా మధ్యాహ్నం లోగా ఖరీదుదారులు ఈ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే, హమాలీలు మె రుపు సమ్మెకు దిగడంతో కాంటాలు ఆలస్యం అయ్యాయి. కొద్ది రోజులుగా మా ర్కెట్‌లో ఖరీదుదారులు గన్నీ బ్యాగులు కాకుండా ప్లాస్టిక్ బస్తాల్లో ధాన్యాన్ని నిం పాలని చెబుతుండటంతో హమాలీలు ఇబ్బందిపడుతున్నారు. ఎండాకాలం కా వడంతో ప్లాస్టిక్ బస్తాలలో ధాన్యాన్ని తూకం వేయడం ఇబ్బందిగా ఉందని చెబు తున్నా వినకపోవడంతో శుక్రవారం సమ్మెకు దిగారు. మరోవైపు తమ ధాన్యాన్ని కాంటాలు వేయాలంటూ రైతులు మార్కెట్ రోడ్డు వద్ద గల జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కాంటాలు వేస్తామని మార్కెట్ అధికారులు సర్దిచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీను

తరిగొప్పుల: అప్పుల బాధతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనపై ఎస్‌ఐ అయ్యాల శ్వేత తెలిపిన వివరాలివి. సోలిపూర్ గ్రామానికి చెందిన ఉచ్చంతుల శ్రీను(47)కు 10 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇటీవల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నాలుగు బోర్లు వేయించినా నీరు పడలేదు. మరోవైపు నూతనంగా ఇల్లు కట్టడంతో సుమారు రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మన స్తాపానికి గురైన శ్రీను శుక్రవారం ఉదయం పొలం వద్ద ఉరి వేసుకున్నాడు.

హైకోర్టు శాశ్వత జడ్జీలుగా

జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- ఉత్తర్వులు జారీ.. వచ్చే వారం బాధ్యతలు స్వీకరించనున్న న్యాయమూర్తులు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టులోని అదనపు న్యాయమూర్తులు జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాస్‌రావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావును శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇద్దరు న్యాయమూర్తులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఫిబ్రవరి 13న హైకోర్టు కొలీజియం నిర్ణయించింది. ముఖ్యమంత్రి, గవర్నర్లు దీనికి సమ్మతి తెలియ జేశారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయిలతో కూడిన కొలీజియం సమావేశమై శాశ్వత న్యాయమూర్తులుగా నియామకానికి జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావుకు తగిన అర్హతలు ఉన్నాయని నిర్ణయించింది. వారిద్దరినీ శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని ఈ నెల 16న కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను ఆమోదించిన కేంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే వారం వారు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఓయూ నుంచి బీఏ, ఎల్‌ఎల్‌బీ..

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటలో 1969, ఆగస్టు 31న జగ్గన్నగారి శ్రీనివాస్‌రావు జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మీబాయి, మాణిక్యరావు. పాఠశాల విద్య లింగన్నపేటలో.. గంభీరావుపేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ నారాయణగూడలోని భవన్స్ న్యూ సైన్స్ కళాశాల నుంచి డిగ్రీ చేశారు. ఓయూ నుంచి బీఏ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1999 ఏప్రిల్ 29న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. తొలుత జి.కృష్ణమూర్తి వద్ద జూనియర్‌గా



పనిచేశారు. రిట్ సర్వీస్, నాన్ సర్వీస్ మ్యాటర్స్, సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి ట్రయల్ కోర్టులు, హైకోర్టులు, ట్రిబ్యునళ్లలో సమర్థంగా వాదనలు వినిపించారు. 2006 నుంచి స్వతంత్ర న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2015 నుంచి న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టే వరకు సింగరేణి కాలరీస్ లిమిటెడ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2022 ఆగస్టు 16న హైకోర్టు అదనపు జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. దాదాపు ఈ రెండేళ్లలో కొన్ని వేల కేసుల్లో తీర్పులు వెలువరించారు. ఆయనకు భార్య శ్రీలత ఇద్దరు పిల్లలు ప్రణీత్, ప్రక్షిప్త ఉన్నారు.

2001లో ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్

మహబూబాబాద్ జిల్లా సూదనపల్లిలో 1969 జూన్ 30న నామవరపు రాజేశ్వర్‌రావు జన్మించారు. తల్లిదండ్రులు గిరిజాకుమారి, సత్యనారాయణరావు. పాఠశాల విద్య వరంగల్‌లో.. హైస్కూల్, ఇంటర్ గోవిందరావుపేటలో.. డిగ్రీ మహబూబాబాద్‌లో పూర్తి చేశారు. ఓయూ నుంచి లా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించారు. 2001 ఫిబ్రవరి 22న న్యాయవాదిగా ఉమ్మడి ఏపీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తొలుత సీపీ రాములు కార్యాలయంలో న్యాయవాదిగా పనిచేశారు. 2015లో ఉమ్మడి హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై 2019 వరకు విధులు నిర్వర్తించారు. యూజీసీ న్యాయవాదిగానూ పనిచేశారు. 2016 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 2019 వరకు ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రిబ్యునల్ ప్యానల్‌గా విధులు నిర్వహించారు. 2019 నవంబర్ నుంచి అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా పనిచేస్తూ 2022 ఆగస్టు 16న అడిషనల్ జడ్జిగా పదోన్నతి పొందారు. దాదాపు ఈ రెండేళ్ల కాలంలో కొన్ని వేల కేసుల్లో తీర్పులు వెలువరించారు.

ఆన్‌లైన్ గేమ్‌లు వద్దన్నా.. వినకపోవడంతో

కొడుకును చంపేసిన తండ్రి

- నిద్రిస్తున్న కొడుకు తలపై రోకలి బండతో మోది.. కారం చల్లి
- కరీంనగర్ జిల్లా చింతకుంటలో దారుణం

కొత్తపల్లి(కరీంనగర్): ఆన్‌లైన్ గేమ్‌లు వద్దన్నా విననందుకు.. కన్న కొడుకునే తండ్రి కడతేర్చిన దారుణ ఘటన శుక్రవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో చోటుచేసుకుంది. చేతికొచ్చిన ఒక్కగానొక్క కొడుకును తండ్రే పొట్టన పెట్టుకోవడంపై గ్రామస్తులు విస్మయానికి లోనయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. చింతకుంటకు చెందిన పెరుమాండ్ల జ్యోతి–శ్రీనివాస్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. కూతురుకు పెళ్లి కాగా, కొడుకు పెరుమాండ్ల శివసాయి(21) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంట్లో శుభకార్యం కోసం బుధవారం స్వగ్రామానికి వచ్చాడు. కాగా, హైదరాబాద్ వెళ్లి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి డబ్బులు పోగొట్టొద్దని, ఇక్కడే ఉండాలంటూ తరచూ తండ్రీ కొడుకుల మధ్య వాదనలు చోటు చేసుకుంటున్నాయి. ఈక్రమంలో భూమి అమ్మాలని శివసాయి ఒత్తిడి తెస్తుండటంతో ఆగ్రహానికి గురైన తండ్రి శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రిస్తున్న కొడుకు తలపై రోకలి బండతో మోది కారం చల్లాడు. తీవ్రగాయాలతో శివసాయి మంచంపైనే మృతి చెందగా తండ్రి కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతుడి తల్లి ఉపాధి పనులకు వెళ్లగా ఈ దారుణం జరిగింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శివసాయి

వర్జీనియా.. ఆల్‌టైం రికార్డు ధర

కిలోకు అత్యధికంగా రూ.319 ● రైతుల్లో ఆనందం



(ఫైల్)

అశ్వారావుపేట రూరల్: వర్జీనియా పొగాకు ధర రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం చరిత్రలోనే రికార్డు స్థాయి ధర నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఐదు వేలకు పైగా ఎకరాల్లో సాగవుతున్న పొగాకును ప్రస్తుతం విక్రయిస్తున్నారు. ఇక్కడి రైతులు ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని వేలం కేంద్రం–2కు పొగాకు తరలిస్తారు. ఈ కేంద్రంలో గతేడాది అత్యధికంగా కిలో పొగాకుకు రూ.288 ధర రాగా, అదే రికార్డుగా నమోదైంది. అయితే, శుక్రవారం ఇదే కేంద్రంలో పొగాకు కిలోకు రికార్డు స్థాయిలో రూ.319 లభించడం విశేషం. అలాగే, ఏపీలోని దేవరపల్లి వేలం కేంద్రంలో కిలో ధర ఏకంగా రూ.322గా నమోదైందని చెబుతున్నారు.



"ఓ ప్రాణమా! వాక్కులో, కళ్లలో, చెవుల్లో, సమస్త ఇంద్రియాల్లో, మనస్సు మొదలైన అంతఃకరణాల్లో నీ రూపమేదైతే వ్యాపించివుందో దాన్ని మాకందరికీ కల్యాణమయంగానే ఉండనీ; అంతేగానీ మాపై కోపించి బయటకు వెళ్లిపోకు.

– ప్రశ్నోపనిషత్తు (హిందూ ధర్మం)

సాక్షి

శనివారం, 27 ఏప్రిల్ 2024

ఈవీఎం వివాదం చల్లారేనా!

సార్వత్రిక ఎన్నికల రెండో దశ కూడా పూర్తికావస్తుండగా శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానం ఈవీఎంల వినియోగంపై వచ్చిన వ్యాజ్యాలను తోసిపుచ్చింది. విపక్షాలను విమర్శించటానికీ, ఆరోపణలు సంధించటానికీ వచ్చే ఏ అవకాశాన్నీ వదులుకోని ప్రధాని నరేంద్ర మోదీ... ఇంకా అయిదు దశల పోలింగ్ జరగాల్సిన తరుణంలో మౌనంగా ఎందుకుంటారు? అందుకే కాంగ్రెస్ నాయకత్వంలోని విపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టన్నారు. ఈవీఎంలపై సందేహాలు రేకెత్తించిన పాపానికి క్షమాపణలు చెప్పాలని కూడా మోదీ డిమాండ్ చేశారు. దేన్నయినా సందేహించటం దానికదే పాపం కాదు. పాపమే అనుకుంటే బీజేపీ, కాంగ్రెస్ సహా దాదాపు అందరికందరూ ఆ పాపం చేసినవారే. ఒకటి రెండు పార్టీలు మినహాయిస్తే పరాజితుల ప్రథమ కోపం ఎప్పుడూ ఈవీఎంలపైనే. వరసగా 2004, 2009 ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు బీజేపీ ఈవీఎంలనే తప్పుబట్టింది. 2012 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు కాంగ్రెస్ కూడా ఆ పనే చేసింది. హ్యాకర్ల ద్వారా ఈవీఎంల సోర్స్ కోడ్ మార్చి అకాలీదళ్ తమ విజయాన్ని దొంగిలించిందని ఆరోపించింది. ఇక యూటర్న్‌ల సిద్ధహస్తుడైన తెలుగుదేశం అధినేత చంద్రబాబుకైతే ఇలాంటి ఆరోపణలు మంచినీళ్లప్రాయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పుడు ఈవీఎంలపైనే ఆయన ఆగ్రహం. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గినప్పుడు మాత్రం చప్పుడు చేయలేదు. మళ్లీ 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చాక ఈవీఎంలపై వీరంగం వేశారు. మధ్యలో ఈవీఎంలు దొంగిలించిన నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితో మీడియా సమావేశం ఏర్పాటు చేయించి వాటిని తారుమారు చేయొచ్చని చూపించే ప్రయత్నం చేసింది కూడా చంద్రబాబే. మళ్లీ ఎన్‌డీఏ పంచన చేరినందువల్ల ఈవీఎంల వివాదంపై ఇప్పుడాయన కిక్కురుమనటం లేదు.

ఇతరుల మాటెలావున్నా ప్రస్తుతం ఈవీఎంల వినియోగాన్ని సవాలు చేసిన సంస్థల్లో విశ్వసనీయతగల అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ కూడా వుంది. కనుక ఈవీఎంలను సందేహించటం స్వప్రయోజనాల కోసమేనని భావించలేం. అదో పెద్ద నేరంగా పరిగణించలేం. అలాగని పేపర్ బ్యాలెట్ విధానం సవ్యంగా సాగిందా? పోలింగ్ బూత్‌లు చేజిక్కించుకుని, బ్యాలెట్ పేపర్లు గుంజుకుని తమ గుర్తుపై ముద్రలు వేసుకుని పెత్తందారులు చెలరేగిపోలేదా? రిగ్గింగ్ ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఎన్నిసార్లు రీపోలింగ్ జరపక తప్పలేదు! ఈవీఎంల వల్ల ఈ జాడ్యం ఎంతో కొంత కట్టడి అయింది. నిమిషానికి కేవలం అయిదు ఓట్లు మాత్రమే వాటిల్లో నమోదయ్యే అవకాశం వుండటం వల్ల పోలింగ్ కేంద్రాలు ఆక్రమించిన దుండగులకు గతంలోని వెసులుబాటు పోయింది. వెనువెంటనే బలగాలు ఆ పోలింగ్ కేంద్రాన్ని చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే అవకాశం వుండటం వల్ల వారి ఆటలు సాగటం లేదు. 1982లో తొలిసారి ఈవీఎంలతో కేరళలో ఒక ఉప ఎన్నిక నిర్వహించారు. అయితే తగిన చట్టం లేకుండా ఈవీఎంల వినియోగం చెల్లదంటూ సుప్రీం కోర్టు ఆ ఎన్నికను రద్దు చేసింది. 1998లో ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కేవలం కొన్ని నియోజకవర్గాల్లో 45 ఈవీఎంలను ప్రయోగాత్మకంగా వినియోగించారు. ఈవీఎంలపై తరచు ఫిర్యాదులు వస్తున్నందువల్ల వాటికి ప్రింటర్లను అనుసంధానించాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించింది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో పరిమితంగా దాన్ని అమలు చేసినా... ఆ తర్వాత కాలంలో వీవీ ప్యాట్‌ల పూర్తిస్థాయి వినియోగం మొదలైంది. ఓటరు తనకు నచ్చిన గుర్తుకు ఓటేసిన వెంటనే ప్రింటర్‌పై ఆ పార్టీ పేరు, గుర్తు ఏడు సెకన్లపాటు కనబడే ఏర్పాటుచేశారు. ఆ వెంటనే ఒక స్లిప్‌పై అది ప్రింటయి దానికి అనుసంధానించిన బాక్స్‌లో పడుతుంది. పోలింగ్ సమయంలోనైనా, కౌంటింగ్ సమయంలోనైనా ఈవీఎంలను దేనితోనూ అనుసంధానించటం సాధ్యంకాదని... రిమోట్ కంట్రోల్, బ్లూటూత్, వైఫైలతో నియంత్రించటం కూడా అసాధ్యమని ఎన్నికల సంఘం పదే పదే చెబుతోంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బెంగళూరు బెల్, హైదరాబాద్ ఈసీఐఎల్ వీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. పోలింగ్‌కు ముందు ఈవీఎంల తనిఖీకి అభ్యర్థులకు అవకాశం ఇస్తున్నారు. చిత్రమేమంటే ఈ ప్రక్రియపై ఓటర్లనుంచి ఎప్పుడూ ఫిర్యాదులు లేవు.

ఇప్పుడు మళ్లీ బ్యాలెట్ పేపర్‌కు మళ్లాలన్న వినతిని తోసిపుచ్చటంతోపాటు వీవీ ప్యాట్ స్లిప్‌లను ఓటర్లే తీసుకునేలా, పరిశీలించుకున్నాక వారే బ్యాలెట్ బాక్స్‌లో వేసేలా చూడాలన్న కోరికను సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు. ఈవీఎంల ద్వారా వెల్లడయ్యే ఓట్ల సంఖ్యనూ, వీవీప్యాట్ స్లిప్‌లనూ లెక్కించి రెండూ సరిపోలినప్పుడే ఫలితం ప్రకటించాలన్న పిటిషనర్ల వినతిని కూడా తిరస్కరించింది. అయితే పార్టీల గుర్తులను కంప్యూటర్ ద్వారా ఈవీఎంలలో లోడ్ చేయటానికి ఉపయోగించే సింబల్ లోడింగ్ యూనిట్ (ఎస్ఎల్‌యూ)లను ఎన్నికల పిటిషన్లు పడిన సందర్భాల్లో పరిశీలించేందుకు అనువుగా 45 రోజులు భద్రపరచాలని ఆదేశించింది. అంటే ఇకపై ఈవీఎంలతోపాటు ఎస్ఎల్‌యూలు కూడా సీల్ చేసివుంచటం తప్పనిసరి. అలాగే రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఫిర్యాదుచేస్తే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ 5 శాతం ఈవీఎంలనూ, ఎస్ఎల్‌యూలనూ ఇంజనీర్ల, ఉత్పత్తిదారుల సమక్షంలో తనిఖీకి అనుమతించవచ్చు. అయితే ఫలితాలొచ్చిన ఏడు రోజుల్లో ఫిర్యాదులు చేయాలి. అలాగే వీవీ ప్యాట్ స్లిప్‌లు లెక్కించే యంత్రాలు సమకూర్చుకునే ఆలోచన చేయాలని ఈసీని కోరింది. ఏదేమైనా బాహాటంగా బయట పడిన సందర్భాలుంటే తప్ప ఈవీఎంలపై అనవసర రాద్ధాంతానికి ముగింపు పలకటం అవసరం. ఇందుకు బదులు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవటం ఎలా అన్న అంశంపై పార్టీలు దృష్టి సారించాలి.

పద్మవ్యూహంలో వీర అర్జునుడు

అభిప్రాయం



డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నది మరో మహాభారతం. వీరత్వంతో యుద్ధం చేస్తున్న బాలుడు అభిమన్యుడి మీద నాలుగు మూలల నుండి అస్త్ర పరంపరలు సంధించారు ఆనాడు. పేద ప్రజల సంక్షేమమే ఆశయంగా దుష్ట గ్రహాల్ని ఎదిరిస్తూ పాలన చేస్తున్న పిన్న వయస్కుడైన జగన్ మీద అన్ని వైపుల నుండి దాడి చేస్తున్నారు ఈనాడు. వీరి ప్రయత్నమంతా జగన్‌ను యుద్ధభూమి నుండి తప్పించాలని! అయితే జగన్ అభిమన్యుడు కాదు, అర్జునుడు. కనుకనే 'ఏనుంగు మీది కెగయు సింహ కిశోరంబు రీతి'గా దుష్టుల పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ ముందుకు సాగుతున్నారు. దుర్యోధన సైన్యంలా వారంతా రోజురోజుకు పెరిగిపోతుంటే ఇవతల జగన్ ప్రజాదరణ అంతకంతకు పెరిగిపోతూనే వుంది.

మహాభారత రాజకీయం అన్ని కాలాలకు వర్తిస్తుందనటానికి ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలే నిదర్శనం. ధర్మరాజును ప్రాణాలతో బంధించటానికి ఆనాడు ద్రోణుడు పద్మవ్యూహం పన్నాడు. అది చాలా ప్రమాదకరమైనది. శత్రువు లోపల ప్రవేశించడమంటే అతని మరణాన్ని కొనితెచ్చుకోవటమే. దానినే చక్రవ్యూహం అని కూడా అంటారు. ఇక్కడ ఆంధ్రాలో కూడా జగన్‌మోహన్‌రెడ్డి గారి చుట్టూ పద్మవ్యూహం అల్లబడింది. అతిరథ మహారథులందరూ ఒక్కడిని జయించడానికి లేదా మట్టుపెట్టడానికి అంచెలంచెలుగా వ్యూహాత్మకంగా కుట్రలు సాగిస్తున్నారు. అక్కడ తలపండిన ద్రోణుడు ఆ వ్యూహానికి కర్త అయితే, ఇక్కడ 87 ఏళ్ళ వృద్ధ రామోజీ ఇదంతా నడిపిస్తున్నాడు.

వీళ్ళ ఎత్తుగడలో భాగం మీడియా ద్వారా జగన్‌నూ, ఆయన పాలనను రోజూ దుమ్మెత్తిపోయడం. సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం. దానికి వైకాపా సోషల్ మీడియా ఎదురు దాడికి దిగటంతో ఆ ఆటలు సాగలేదు.

ఇక ఎన్డీయేతో రామోజీతో పాటు వెంకయ్య కూడా కష్టపడి పొత్తును కుదిర్చారు. దానితో ఈ మూడో అంచె వ్యూహాన్ని జగన్ అస్సలు దాటలేడని వాళ్ళు భ్రమపడ్డారు. కానీ ఈ అవకాశ పొత్తులు ప్రజలకే నచ్చక ఛీ కొట్టడంతో అదికూడా ఫెయిలయ్యింది. దాంతో 'చతుర్విధోపాయసాధ్యేతు రిపౌసాంత్వమప క్రియాన్'... అనగా సామ భేద దాన దండోపాయాల్లో, బలమైన శత్రువును ఎదుర్కోవాలంటే నాలుగవది అయిన దండోపాయమే సరయినదని ఈ కూటమి భావించి ఏకంగా ప్రాణాలు తియ్యటానికి తెగించింది. అందుకే విజయవాడలో సూటిగా బాణం వేయగలిగిన సైంధవుడి లాంటి సతీష్‌ను బోండా ఉమ డైరక్షన్లో ప్రవేశపెట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి అన్నట్టు, ఆ దైవమే ఆ సమయంలో కూడా ఆయనను కాపాడింది. ఏ కొంచెం స్థానం మారినా, పెను విషాదం చోటు చేసుకునేది.

వీరత్వంతో నిజాయితీగా యుద్ధం చేస్తున్న ఒక్క బాలుడి (అభిమన్యుడు) మీద నాలుగు మూలల నుండి అస్త్ర పరంపరలు సంధించారు ఆనాడు. పేద ప్రజల సంక్షేమమే ఆశయంగా పెట్టుకుని దుష్ట గ్రహాల్ని ఎదిరిస్తూ నిర్భయంగా పాలన చేస్తున్న ఈ పిన్న వయస్కుడైన ముఖ్యమంత్రి మీద అన్ని వైపుల నుండి దాడి చేస్తున్నారు ఈనాడు. ఆయన చేస్తున్న సంక్షేమాన్ని ఆపుచేయటానికి మేధావుల ముసుగులో ఒక ఫోరమ్ బయటకు వచ్చింది. ఇప్పటి వరకు వృద్ధులకు, అంగ వికలురకు నిరంతరం సేవలందిస్తున్న వలంటీరు వ్యవస్థను ఈ కుహనా మేధావులు ఆపించి ఏదో గొప్ప కార్యం సాధించినట్లు భుజాలెగరేస్తున్నారు.



ఈసారి ఈ దుష్టకూటమి ఎన్నారై వింగ్‌ను చివరి చక్రంలోకి ప్రవేశపెట్టింది. దానికి ప్రధాన నాయకుడు కోమటి జయరాం. 2020లో వైకాపా నుండి 23 మంది ఎమ్మెల్యేలను కొనటం దగ్గర నుండి మొన్న ఎమ్మెల్యే శ్రీదేవికి డబ్బు ఇచ్చి ఎమ్మెల్సీ ఓటు కొనుక్కునే వరకు కథంతా నడిపించింది ఈ ఎన్నారై మేధావే.

కోట్లాది రూపాయలతో ఓటరు 'వెధవలను' (వాళ్ళ భాషలో) కొనటానికి మరో అస్త్రం సిద్ధం చేశారు. అదృష్టవశాత్తూ అది కూడా బయటపడిపోయింది. కాలం సమీపించినపుడు పాపాత్ములు ఏ పని చేసినా అది వాళ్ళకు ఎదురీతగానే మారుతుందన్న సామెత నిజమైంది. భారతం కూడా అదే చెబుతుంది. 'పిరికితనము, నేరప్రవృత్తి, పదవి, ధనాశ లాంటి ప్రవృత్తి గలవానికి సిరి తనంతట తానే తొలగిపోతుంది' అనే మాట చంద్రబాబు పట్ల ఋజువు కాబోతున్నది.

ఇక జగన్ మీద తండ్రీకొడుకుల వాగ్బాణాలయితే చెప్పే పని లేదు. ఒక్కడిని చుట్టు ముట్టి బహిరంగ దూషణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. వీరి ప్రయత్నమంతా జగన్‌ను యుద్ధభూమి నుండి తప్పించాలని! ఆయన చేసిన పాపం ఏమిటి? ఆనాడు భారత యుద్ధంలో కూడా కపటోపాయంతో తండ్రిని దూరంగా పంపి అభిమన్యుడిని బలి చేశారు. ఈరోజు కూడా ఈ ఎన్నికల సమరంలో తండ్రి లేని జగన్‌ను ఇంతమందీ కలసి ముట్టడిస్తున్నారు. అయితే ఆయన అర్జునుడు కనుక 'ఏనుంగు మీది కెగయు సింహ కిశోరంబు రీతి'గా ఈ దుష్టుల పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పద్మవ్యూహాన్ని ఛేదించుకుంటూ ముందుకు సాగిపోతున్నారు. జగన్ అంటే ధైర్యం, జగన్ అంటే ధర్మం, జగన్ అంటే విశ్వసనీయత. అందుకే వీరి బరితెగింపు నీచరాజకీయాలను తన పదునయిన అస్త్రాలతో ఛిన్నాభిన్నం చేసుకుంటూ అశేష ప్రజల ఆశీస్సులందుకుంటూ ముందుకు దూసుకుపోతున్నారు.

ఇక కూటమి దురవస్థ కూడా కౌరవుల మధ్య పొసగని అభిప్రాయాల్లాగానే ఉంది. ఒకరిపై ఒకరికి నమ్మకం లేదు. ఎవరు ఎవరిని వెన్నుపోటు పొడుస్తారో అని అస్తమానం అదే భయంతో బతుకుతున్నారు. ఎందుకంటే ఈ మూడు పార్టీలకు సిద్ధాంత బలం లేదు. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ పరోక్షంగా కలుస్తాయి. కమ్యూనిస్టులు బీజేపీ కూటమికి మద్దతిస్తారు. ఒక విచిత్రమైన రాజకీయ విన్యాసం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే జరుగుతున్నది. కుల నాయకుడి కోసం ఐఏఎస్ పట్టాలను దాచిపెట్టి కుల రౌడీల్లా వీధుల్లోకొస్తారు కుహనా మేధావులు. తండ్రికి మరో వెన్నుపోటుదారు పురందేశ్వరి. వైయస్సార్ ఆశయాలకు తూట్లు పొడుస్తూ తిరుగుతున్న షర్మిల లాంటి వాళ్ళు కూడా ఈ విష కూటమితో కలిసి జగన్‌ను తిట్టి పోస్తారు. దుర్యోధన సైన్యంలా వీరంతా రోజురోజుకు పెరిగి పోతుంటే ఇవతల జగన్ ప్రజా దరణ అంతకంతకు పెరిగిపోతూనే వుంది. ఇంకా జగన్‌ను చంపడానికి ప్రయత్నించిన, హర్షవర్ధన చౌదరి, బోండా ఉమా లాంటి రౌడీలు కూడా ఈ వర్గంలో తక్కువేమీ కాదు. రాష్ట్రంలో ఈ అల్లరి మూకలు వైకాపా కార్యకర్తల మీద సాగిస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. నిన్న గాక మొన్న మంగళగిరిలో రాష్ట్రంలో రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తూ హింసావాదాన్ని రెచ్చగొడుతున్న లోకేష్ గూండాలు ఎదురుగా వెళ్ళి పార్టీ ప్రచారంలో ఉన్న వెంకటరెడ్డిని బైకులతో గుద్ది చంపేశారు. దానిని కూడా సమర్థించుకుంటూ వీరి ప్రచారం సాగిపోతూనే వుంది.

ఈ ఆంధ్రా కురుక్షేత్రంలో మే 13న జరిగే ఎన్నికలు అన్నింటికీ సమాధానం చెబుతాయి. ప్రళయం వస్తే మొత్తం ఊడ్చేసినట్లు రేపు ఈ ఓటరు సునామీ ఈ కౌరవ సైన్యాన్నంతా ఓడించి దూరంగా విసిరేస్తుందనే మాట ఖాయం. దేశమంతా మెచ్చుకుంటున్న జగన్ పాలన మళ్ళీ రావటం ఖాయం. కొద్దిరోజులు ఓపిక పడదాం. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలంటే ప్రతి ఓటు జగన్‌కు వేసి వీళ్ళ పద్మవ్యూహాన్ని ధ్వంసం చెయ్యాలి. వీర అర్జునుడికి విజయం అందించాలి.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ తెలుగు–సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్

సోషల్ మీడియా

సంక్షిప్త వాస్తవం



అమెరికా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు నా విన్నపం: మీకు మధ్యప్రాచ్యం అనేది అర్థం కాలేదు. అమెరికాతో యూకే, ఐర్లాండ్, జపాన్ లాంటి దేశాలు సాధించిన శాంతి, సాధారణ పరిస్థితులు మా ప్రాధమ్యాలు. దీనికిగానూ ఇజ్రాయిల్ అతివాదులతో సహా హమాస్, ముస్లిం బ్రదర్‌హుడ్‌ను వ్యతిరేకిస్తూ, పాలస్తీనియన్లకు, ఇజ్రాయిల్ ప్రజలకు మద్దతునిద్దాం. ఇజ్రాయెలీ బందీలు, గాజా ప్రజల స్వేచ్ఛ కోసం ప్రయత్నిద్దాం.

– అమ్జద్ తాహా, మధ్యప్రాచ్య విశ్లేషకుడు

నిరాకరించలేని సత్యం



ప్రపంచ వేదిక మీద 'క్రిక్' (సి.ఆర్.ఐ.కె.– చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా) కూటమి ఒక బలీయమైన శక్తిగా రూపొందిందన్న సత్యాన్ని మనం ఇక ఎంతోకాలం నిరాకరించలేము. (అమెరికా విదేశాంగ మాజీ మంత్రి) కిసింజర్ భయపడినట్టుగానే, పాశ్చాత్య దేశాలు రష్యాను చైనా వైపు నెట్టాయి. ప్రాణాంతకమైన భౌగోళిక–రాజకీయ తప్పు?

– రాజ్ శుక్లా, ఆర్మీ మాజీ కమాండర్

ఎన్నికల అంశమే!



జనాన్ని అనారోగ్యానికి గురిచేసేంత దారుణంగా ముంబయి గాలి నాణ్యత ఉంది. కొందరికి కాలుష్యం మీద అవగాహన ఉంది. కొందరు అమానవీయ లోకల్ రైళ్లలో ప్రయాణాలకు అలవాటుపడ్డట్టుగా దాన్ని భరిస్తున్నారు. తెలివైన రాజకీయ నాయకుడు దీన్ని ఒక ఎన్నికల అంశంగా మార్చితే, భారీ మెజారిటీతో గెలుస్తాడని నా నమ్మకం.

– వివేక్ రంజన్ అగ్నిహోత్రి, దర్శకుడు

ఓటే లైసెన్స్



ఎన్నికల్లో నా ఓటుహక్కును వినియోగించుకున్నాను. ఫిర్యాదు చేయడానికి నా లైసెన్స్‌ను మరో ఐదేళ్లపాటు రెన్యువల్ చేయించుకున్నాను.

– రమేశ్ శ్రీవత్స, వ్యంగ్య వ్యాఖ్యాత

చెప్పడం సుళువు



అమెరికా విశ్వవిద్యాలయాల వ్యాప్తంగా సరికొత్త అమెరికన్ ప్రజాస్వామ్యం ప్రదర్శితమవుతోంది. నిరసనలను సహించడం, భావస్వేచ్ఛను అనుమతించడం మీద ఇప్పటికీ గ్లోబల్ సౌత్‌కు అమెరికా ఉపన్యాసాలిస్తుందా?

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

మోసపోవద్దు!




ఒకప్పుడు ఒక గాడిద తనను అడవికి రాజుగా ఎన్నుకుంటే ఉన్న శాలువాలను ఉచితంగా పంచుతానని ప్రకటించింది. గొర్రెలు తప్ప ఏవీ దానికి ఓటు వేయలేదు. వివేకంతో ఓటు వేయండి.

– ఆరిఫ్ ఆజకియా, పాకిస్తాన్‌లో పుట్టిన ఇండియన్

వైజ్ఞానిక వేగుచుక్కలు

తొలి మహిళల ఆసుపత్రి

భారతదేశంలో బ్రిటిష్ ప్రభువులు తమ క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయడంలో ఒక సాధనంగా వైద్య రంగాన్ని ఎంచుకున్నారని చెప్తారు. దీన్నే 'క్లినికల్ క్రిస్టియానిటీ' అని కూడా అంటారు. ఇప్పటి ఉత్తరప్రదేశ్ లోని పశ్చిమ ప్రాంతంలో చారిత్రకంగా రోహిల్‌ఖండ్‌గా పిలవబడే చోట ఉన్న బరేల్లీలో మెథడిస్ట్ మిషన్ బాలికల అనాథ శరణాలయం బాధ్యులు మిస్సెస్ థామస్ అమెరికాలో ఉన్న తన మిత్రురాలూ, ఇదివరకటి సహచరీ అయిన జేటీ గ్రేసీకి 'ఎవరైనా ఒక మహిళ వచ్చి వైద్యపరంగా తమ ప్రాంతానికి సేవ చేస్తే బాగుంటుంద'ని ఉత్తరం రాసింది. ఈ ఉత్తరం కారణంగా క్లారా స్వైన్‌ను భారతదేశం వెళ్ళమని కోరారు. అలా 1870 జనవరి 20వ తేదీన క్లారా ఎ. స్వైన్ ఇండియా (బరేలీ) వచ్చారు. 1869లో పెన్సిల్వేనియా లోని ఉమెన్స్ మెడికల్ కళాశాలలో వైద్యశాస్త్రం పట్టా పొందారు క్లారా.



క్లారా ఎ. స్వైన్

బరేలీలో మిస్సెస్ థామస్ విద్యార్థినులైన 14 మందికి 1870 మార్చి ఒకటో తేదీ నుంచి వైద్యపరమైన శిక్షణను ఇవ్వడం ప్రారంభించింది క్లారా. ఈ విద్యార్థినులు అక్కడికి దగ్గర్లోనే అనారోగ్యానికి గురైన క్రిస్టియన్ విలేజ్‌లో ప్రయోగాత్మకమైన శిక్షణను కూడా పొందడం మొదలైంది. క్లారా రోజుకు రెండు మూడు గంటల పాటు ఈ విద్యార్థినులకు శరీర నిర్మాణ శాస్త్రం, మానవ శరీరం, మెటీరియా మెడికా వంటి అంశాలు బోధించడం ప్రారంభించి పరీక్షలకు సిద్ధం చేసింది. ఈ మొత్తం ప్రక్రియ ఇద్దరు సివిల్ సర్జన్స్, ఒక అమెరికన్ ఫిజీషియన్ పర్యవేక్షణలో జరిగింది. 1873 ఏప్రిల్ 10న పదమగ్గురు పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ముగ్గురిని 'బైబిల్ ఉమన్'గా క్లారా స్వైన్ స్వీకరించి ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న క్రైస్తవ మతపరమైన కార్యక్రమాలకు వినియోగించారు.

తొలుత పాశ్చాత్య వైద్యానికి క్రైస్తవ మతానికి స్థానికంగా వ్యతిరేకత ఎదురైనా ఆరోగ్యానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా రాంపూర్ నవాబ్ ఒక భవనాన్ని వైద్య సదుపాయాలు విస్తరింప చేయడానికి కానుకగా ఇచ్చారు. 1872 జనవరి ఒకటో తేదీన క్లారా స్వైన్ రాంపూర్ నవాబ్ ఇచ్చిన ప్రాంగణానికి తరలి వెళ్లారు. మరుసటి సంవత్సరం మే మాసంలో వైద్యం చేయడానికి ప్రత్యేక భవనం మొదలై 1874 జనవరి ఒకటో తేదీ నాటికి బయట నుంచి వచ్చి ఆరోగ్యపరమైన సేవలు, వైద్యం పొంది వెనక్కి వెళ్లిపోయే వెసులుబాటు కూడా మొదలైంది. అలా భారతదేశంలో తొలి మహిళల ఆసుపత్రి ప్రారంభమైంది. పొరుగు ప్రాంతాల వారే కాకుండా బర్మా నుంచి కూడా వచ్చి వైద్యం పొంది వెళ్లేవారు. చివరికి క్లారా స్వైన్ 1910 డిసెంబర్ 25న న్యూయార్క్‌లో కనుమూశారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

అట్టడుగు జనం అభివృద్ధి చెందేలా...

అభిప్రాయం



శ్యాంమోహన్

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలే కాదు, అభివృద్ధి పనులూ ఫలాలను ఇవ్వడం ప్రారంభించాయి. ఫలితంగా అట్టడుగు జనం జీవన ప్రమాణాలు పెరుగుతూ పోతున్నాయి. అభివృద్ధికి నిజమైన నిర్వచనం ఇదే కదా! పారిశ్రామిక పార్కులు, పోర్టుల నిర్మాణం – అభివృద్ధి, విమానాశ్రయాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో ఏపీలో ఉద్యోగ కల్పన వేగం పుంజుకొంది. ముఖ్యంగా గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాల్లో అధిక భాగం దక్కడం ఈ అభివృద్ధి నమూనా ప్రత్యేకతగా చెప్పుకోవాలి.

ఏపీ ప్రభుత్వం నెలకొల్పిన పారిశ్రామిక పార్కుల ప్రాంతాల్లో ఒకప్పుడు బతుకు తెరువు కోసం పట్నాలకు వలస పోయే పరిస్థితి ఉండేది. మిగిలిన వారు పెత్తందారుల చుట్టూ పని కోసం తిరిగే వారు. ప్రస్తుతం ఆ యా ప్రాంతాల్లో పరిశ్రమలు రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తిరుపతి జిల్లాలోని 'శ్రీసిటీ పారిశ్రామిక పార్క్' సమీపంలోని మల్లావారి పాలెం గ్రామస్థుడు సన్యాసయ్య చెప్పినట్లు 'బడుగు జీవుల పాలాలకు మంచి ధరలు వచ్చాయి. ఇంటికో ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు ఎవరి ముందు తలవంచక ఆత్మ విశ్వాసంతో' బతుకుతున్నారు.

''టెన్త్ మాత్రమే చదివిన నాకు ఎక్కడా పని దొరక లేదు. సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తూ... కాలం వృథా చేస్తున్న సమయంలో, సెల్‌ఫోన్ల తయారీ కంపెనీలో పని దొరికింది. ఇంటి నుండి కంపెనీకి వెళ్లి రావడానికి బస్‌సౌకర్యం, క్యాంటీన్, 24 గంటల హెల్త్ సెంటర్ ఉంది'– తిరుపతికి చెందిన మరో యువతి మనోగతం ఇది. వీరంతా ఆంధ్రప్రదేశ్ మారుమూల గ్రామాలకు చెందిన పేద మహిళలు.

ఇక్కడ ఉద్యోగాలు చేసే వారిలో 90 శాతం మహిళలే. టెన్త్ నుండి ఇంజనీరింగ్ వరకు చదివిన వారే. ఈ అవకాశం తైవాన్ బహుళజాతి సెల్‌ఫోన్ తయారీ సంస్థ 'ఫాక్స్‌కాన్' ద్వారా మహిళలకు దొరికింది. తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఈ కంపెనీ 30 ఎకరాల్లో ఏర్పాటయింది.

ఆంధ్రప్రదేశ్ – తమిళనాడు సరిహద్దుల్లో, నెల్లూరు జిల్లా తడ, తిరుపతి జిల్లా సత్యవేడు మధ్య ఏర్పాటయ్యింది శ్రీసిటీ పారిశ్రామిక పార్క్. 2006లో ఇక్కడ భూసేకరణ సమయంలో అనేక ఆందోళనలు జరిగాయి. అప్పటి దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి రైతులతో స్వయంగా సమావేశమై అప్పటి మార్కెట్ ధర కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ ఇచ్చి 14 గ్రామాల్లో భూములు



తీసుకున్నారు. ఇది 2008లో ప్రారంభమై 7,500 ఎకరాల్లో విస్తరించి ఉంది. జాతీయ రహదారి, రైల్వే, విమానాశ్రయం, ఓడరేవు అన్నీ దగ్గరగా ఉండడం ఈ పారిశ్రామిక పార్కుకి బాగా కలిసొచ్చింది. ఇందులో ఇప్పటి వరకు 220 కంపెనీలు ఏర్పాటై 62 వేల మందికి ఉపాధి కలిగింది. వారిలో సగం మంది మహిళలే.

గత 55 నెలల్లో, రాష్ట్రంలో 311కి పైగా ప్రధాన పరిశ్రమలు స్థాపించారు. 1.3 లక్షల ఉద్యోగావకాశాలు ఉన్నాయి. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో రూ. 13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 386 అవగాహనా ఒప్పందాలు జరిగాయి. దీనివల్ల మరో 6 లక్షల ఉద్యోగాలు వస్తాయని ఏపీ ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

సీ పోర్టుల ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఆరు పోర్టులకు తోడు కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణం చేపట్టి వాటిని అభివృద్ధి చేస్తోంది. దాదాపు రూ. 16,000 కోట్లతో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టులను నిర్మిస్తున్నారు. కొత్త పోర్టుల వల్ల 110 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం పెరుగుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఓడరేవుల ద్వారా 75 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు మత్స్యకారుల జీవనోపాధిని పెంచుతాయి. 3,793 కోట్ల వ్యయంతో పది ఫిషింగ్ హార్బర్‌లు, ఆరు ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ప్రతి 50 కిలోమీటర్ల తీరప్రాంతానికి ఓడరేవు లేదా ఫిషింగ్‌హార్బర్ ఉంటుంది.

భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం రూ. 4,592 కోట్ల ప్రాజెక్ట్. దీనివల్ల 10,000 మందికి ప్రత్యక్షంగా, 80,000 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కలుగబోతున్నాయి. గన్నవరం, కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కడప, కర్నూలు విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రామ్‌కో సిమెంట్, సెంచరీ ప్యానెల్స్, ఏటీసీ టైర్స్, ఆదిత్య బిర్లా గార్మెంట్స్, డిక్సన్ టెక్నాలజీస్, గ్రీన్‌లామ్ సౌత్, లారస్ ల్యాబ్స్, ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి భారీ, మెగా పరిశ్రమల నుండి భారీ పెట్టుబడులు రాబోతున్నాయి.

దేశంలోనే అత్యధిక జీఎస్‌డీపీ వృద్ధి రేటు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈడీబీ) ఇండెక్స్‌లో వరుసగా మూడేళ్లుగా భారత్‌లో నంబర్‌వన్‌గా నిలవడం ఈ సందర్భంగా గమనార్హం.

వ్యాసకర్త కార్టూనిస్ట్, జర్నలిస్ట్
మొబైల్: 94405 95858

దితి – అదితి

సృష్టి ఆరంభమైన తొలి రోజులలో, జగత్తులో ఉన్న అపారమైన వనరులను వినియోగంలోకి తెచ్చేందుకు సరిపడేటంత జనాభా ఉండేది కాదు. అందుకే బ్రహ్మ తన మానస పుత్రులుగా ప్రజాపతులనూ, మనువులనూ, మహర్షులనూ సృష్టించి, వాళ్ళకు భార్యలను కూడా సృష్టించి ఇచ్చాడని పురాణాలు చెప్తాయి. వివిధ జాతుల ప్రాణులకు పెద్ద సంఖ్యలో జన్మనిచ్చి, వాటి పరంపరల ద్వారా ఈ సృష్టి చక్రాన్ని విస్తరింపజేస్తూ వెళ్ళడం ప్రజాపతుల కర్తవ్యం. 'ప్రజ' అంటే సంతతి అని ఒక అర్థం.

మరీచి మహర్షికి కళ అనే భార్య ద్వారా కలిగిన కశ్యప ప్రజాపతి జగత్తులో ఎన్నో జాతులకు మూలపురుషుడు. దక్ష ప్రజాపతికి కలిగిన అరవై ముగ్గురు కూతుళ్ళలో పదముగ్గురిని కశ్యపుడు పెళ్ళాడాడు. వాళ్ళలో అదితి, దితి, కద్రువ, వినతా వంటి వాళ్ళు ఉన్నారు. సృష్టిలో తొట్టతొలి తరాలకు చెందిన కశ్యప మహర్షికి కూడా ఆయన భార్య దితితో భావజాల వైరుధ్యాలూ, అభిప్రాయ భేదాలూ తప్పలేదు. 'దితి' అనే మాటకు అర్థమే 'ఖండించేది' అని. భర్త మాటలను మంకుతనంతో ఖండిస్తూ ఉండేది. కనుక ఆమెకు ఆ పేరు వచ్చిందని పౌరాణిక ప్రతీతి. ఆమె సోదరీ, సవితీ అదితి ధర్మార్థ కామ సాధనలలో భర్తకు అనుకూలంగా, సహధర్మచారిణిగా ఉండేది కనుక 'అ–దితి'.



అదితి సంతతి ఆదిత్యులు. అంటే దేవతలు. సద్గుణవంతులు. ప్రధానంగా సత్వ గుణ సంపన్నులు. సూర్యుడూ, ఇంద్రుడూ ఇత్యాదులు. దితి సంతతి దైత్యులు. అంటే రాక్షసులు. వీళ్ళూ ఘనులే. కానీ వీరిది ప్రధానంగా తమోగుణం. మొండితనం, మూర్ఖత్వం, హింసాప్రవృత్తీ ఎక్కువ. హిరణ్యాక్షుడూ, హిరణ్యకశిపుడూ దితి పుత్రులు. సవతికి చక్కని సంతానం కలగటం చూసి, ఈసు చెంది, తనకూ అలాంటి సంతానం త్వరగా కలగాలన్న ఆరాటంతో, సత్సంతాన ప్రాప్తికి అనుకూల సమయం కాదని భర్త ఎంత వారించినా వినకుండా మంకుపట్టు పట్టడం వల్ల దితికి తమోగుణాధిక్యం గల సంతానం కలిగింది. తరువాత ఆమె తన తొందరపాటుకు పశ్చాత్తాప పడటం వల్ల, ప్రహ్లాదుడి లాంటి పరమ భాగవతుడు ఆమెకు మనుమడుగా పుట్టాడు.

దంపతులలో సయోధ్య కొరవడితే దాని ప్రభావం సంతానం మీద కూడా పడుతుందని దితి వృత్తాంతం ద్వారా భాగవత పురాణం సూచిస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.తదియ ఉ.6.38 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.2.54 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.8.09 నుండి 9.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.38 నుండి 7.16 వరకు, **అమృతఘడియలు:** సా.5.46 నుండి 7.24 వరకు ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.41, **సూర్యాస్తమయం:** 6.13.

ఇలాగైతే కష్టం.. గ్యారంటీగా గెలవం..

హామీలతో ముంచేద్దాం

అడ్డగోలు ప్రామిస్‌లతో మేనిఫెస్టోను రెడీ చేస్తున్న చంద్రబాబు

ప్రధాని మోదీ సమక్షంలో విడుదల చేసేలా పన్నాగం.. 'నో' అంటే ఆయన ఫొటోతో..

సిద్ధం సభలు, బస్సు యాత్ర సక్సెస్‌తో కూటమి వెన్నులో వణుకు

- సీఎం జగన్ బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిందంటున్న విశ్లేషకులు.. మళ్లీ "ఫ్యాన్" ప్రభంజనమేనని 20కిపైగా జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడి
- 2014 ఎన్నికల్లోనూ కూటమిగా ఏర్పడి నోటికొచ్చిన హామీలిచ్చిన బాబు
- రుణమాఫీ అంటూ రైతులకు, మహిళలకు టీడీపీ వెన్నుపోటు
- జనం నిలదీస్తారనే భయంతో వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో మాయం
- కాంగ్రెస్ హామీలకే సూపర్ సిక్స్ ముసుగేసి మినీ మేనిఫెస్టో ప్రకటన.. ఆ హామీలు కర్ణాటక, తెలంగాణలో నీరుగారిపోయిన వైనం.. బాబు మోసాలతో హామీలను పట్టించుకోని ప్రజలు
- జనసేన, బీజేపీతో జట్టు కట్టినా జనస్పందన లేక చంద్రబాబు ఆందోళన
- సీఎం జగన్‌ను తూలనాడే క్రమంలో పవన్‌పై నోరుజారడమే బాబు ఫ్రస్టేషన్‌కు నిదర్శనం
- తన దగ్గర పనిచేసే బడుగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ భువనేశ్వరి బూతు పురాణం



సాక్షి, అమరావతి: జనసేన, బీజేపీతో జట్టుకట్టినా ఘోర పరాజయం తప్పదని ఆందోళన చెందుతున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అలవికాని బోగస్ హామీలు గుప్పించేందుకు సన్నద్ధమయ్యారు. గతేడాది మే 28న రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడులో కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ ముసుగుతో మినీ మేనిఫెస్టో అంటూ ప్రకటించారు. ఆ హామీలు కర్ణాటక, తెలంగాణలలో నీరుగారిపోవడం.. చంద్రబాబు అంటేనే మోసాలకు మరోపేరు అని ప్రజలు గుర్తించడంతో 'సూపర్ సిక్స్'ను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు తరహాలో బోగస్ హామీలతో మేనిఫెస్టోను వదిలేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఆ మేనిఫెస్టోను తాను ప్రకటిస్తే జనం పొరపాటున కూడా నమ్మరని పసిగట్టిన చంద్రబాబు ప్రధాని నరేంద్ర మోదీతో దాన్ని విడుదల చేయించేందుకు ఎత్తులు వేస్తున్నారు.

ముఖచిత్రాన్ని మార్చేసిన సిద్ధం సభలు, బస్సు యాత్ర

సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం పోటెత్తడంతో ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు తాడేపల్లిగూడెంలో పవన్ కళ్యాణ్‌తో కలిసి నిర్వహించిన జెండా సభ, ప్రధాని మోదీని రప్పించి చిలకలూరిపేటలో నిర్వహించిన సభకు జనం మొహం చాటేయడంతో అట్టర్ ప్లాప్ అయ్యాయి. అవకాశవాద పొత్తును జనం ఛీకొట్టారనడానికి జెండా సభ, చిలకలూరిపేట సభ నిదర్శనంగా నిలిస్తే.. సీఎం జగన్‌పై ప్రజల విశ్వాసానికి ప్రతీకగా సిద్ధం సభలు నిలిచాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభలకు ఏ ప్రాంతంలోనూ జన స్పందన కనిపించడం లేదు. మరోవైపు ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27 నుంచి ఈనెల 24 వరకూ 23 జిల్లాల్లో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు.

మళ్లీ ఫ్యాన్ ప్రభంజనం ఖాయం..

రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని సీఎం జగన్ బస్సు యాత్ర సమూలంగా మార్చేసిందని.. పోటీ ఏకపక్షమేనని.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని పరిశీలకులు తేల్చి చెబుతున్నారు. నామినేషన్ల ఘట్టం తుది దశకు చేరుకుంది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థులు తేలాక జాతీయ మీడియా సంస్థలు, ప్రతిష్టాత్మక పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన 20 సర్వేల్లో "ఫ్యాన్" మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని తేల్చాయి. సీ–ఓటర్ సర్వే ఒక్కటి మాత్రమే కూటమి విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే సీ–ఓటర్ నిర్వహించే సర్వేలకు ఏమాత్రం విశ్వసనీయత ఉండదు. 2004, 2009లో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ గెలుస్తుందని సీ–ఓటర్ పేర్కొనగా ఆ రెండు సందర్భాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించడం గమనార్హం. 2019 ఎన్నికల్లోనూ టీడీపీ గెలుస్తుందని సీ–ఓటర్ ఢంకా భజాయిస్తే వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించింది.

తీవ్ర ఫ్రస్టేషన్‌తో ఊగిపోతున్న బాబు..

సీఎం జగన్ బస్సు యాత్ర సృష్టించిన ప్రకంపనలతోపాటు ఏకంగా 20కిపైగా జాతీయ మీడియా సంస్థలు, పొలిటికల్ కన్సల్టెన్సీలు నిర్వహించిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ఘనవిజయం సాధిస్తుందని తేల్చిచెప్పడంతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో నైరాశ్యం నెలకొంది. నామినేషన్ల ఘట్టంలోనే కాడి పారేస్తున్నాయి. తీవ్ర ఫ్రస్టేషన్ (నిరాశ, నిస్పృహ)తో సీఎం జగన్‌పై నోరు పారేసుకుంటున్నారు. ఇటీవల విజయనగరంలో ప్రజాగళం సభలో సీఎం జగన్‌ను తూలనాడే క్రమంలో.. నెత్తిపై రూపాయి పెడితే పైసాకు కొనుక్కోవడానికి కూడా పవన్ కళ్యాణ్ పనికి రారంటూ చంద్రబాబు తన మనసులో మాట బయట పెట్టడమే అందుకు నిదర్శనం. ఇక చంద్రబాబు భార్య భువనేశ్వరి తన వద్ద పనిచేసే బడుగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బూతుపురాణం వల్లించడం వారి ఫ్రస్టేషన్‌కు పరాకాష్ట. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు దిగాలంటూ టీడీపీ, జనసేన కార్యకర్తలను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రెచ్చగొడుతుండటం చూస్తే వారిలో ఫ్రస్టేషన్ ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

అప్పటిలాగే బోగస్ హామీలతో ఇప్పుడూ..



విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లోనూ జనసేన, బీజేపీలతో జట్టుకట్టిన చంద్రబాబు వ్యవసాయ రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా.. ఇంటికో ఉద్యోగం లేదా నెలకు రూ.2 వేల చొప్పున నిరుద్యోగ భృతిగా ఇస్తానంటూ నాడు 650కిపైగా అలవికాని హామీలిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్, తన ఫోటోలను ముద్రించిన పత్రంతో ముఖ్యమైన హామీలంటూ తన సంతకం చేసి మరీ ఇంటింటికీ పంపి ప్రచారం చేయించారు. అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేశారు. ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో ఎన్నికల మేనిఫెస్టోను ఏకంగా టీడీపీ వెబ్‌సైట్ నుంచి చంద్రబాబు మాయం చేయించారు. ఇప్పుడూ అదే కూటమిగా జట్టు కట్టిన చంద్రబాబు 2014 తరహాలోనూ బోగస్ హామీలతో మరోసారి ప్రజలను బురిడీ కొట్టించేందుకు ఎన్నికల మేనిఫెస్టోపై కసరత్తు చేస్తున్నారు. ఆ మేనిఫెస్టోను తాను ప్రకటిస్తే ప్రజలు ఛీకొడతారని గుర్తించడంతో ఈనెల 3వతేదీన రాష్ట్రంలో నిర్వహించే సభలో ప్రధాని మోదీతో విడుదల చేయించేందుకు సిద్ధమైనట్లు టీడీపీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

జాతీయ మీడియా సంస్థలు, ప్రతిష్టాత్మక పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేల్లో వెల్లడైంది ఇదీ..

సర్వే సంస్థ పేరు	పార్టీ గెలిచే శాసనసభ స్థానాలు		
	వైఎస్సార్‌సీపీ	టీడీపీ-జనసేన -బీజేపీ కూటమి	పోటాపోటీ
పోల్‌స్ట్రాటజీ గ్రూప్	120-130	45-55	0
న్యూస్‌ఎరినా ఇండియా	121	38	16
థర్డ్ విజన్(నాగన్న)	103	39	33
జన్‌ధర్ ఇండియా	125	50	0
డబ్ల్యూఆర్‌పీపీ స్ట్రాటజీస్	104-115	50-60	0
బి-ప్రాక్	118-138	13-37	
ఆత్మసాక్షి	97-118	54-62	0
రేస్	132-138	37-42	0
రేణుకా పోతినేని	134	41	0
జన్‌మత్ పోల్స్	122-125	44-46	0
పొలిటికల్ క్రిటిక్	122	53	0
పొలిటికల్ వ్యూస్	117-128	46-58	0
ఎస్‌ఎఫ్‌వో పొలిటికల్ సర్వే	122	53	0
డెక్కన్ 24/7	131	44	0
భారత్ పొలిటికల్ సర్వే	150-156	19-25	0
యాక్చువల్ ఇండియా	108-116	50-59	0
ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్	135	40	0

ఏపీలో లోక్‌సభ స్థానాలపై జాతీయ మీడియా, పొలిటికల్ కన్సల్టెన్సీల సర్వేలు తేల్చింది ఇదీ..:

సర్వే సంస్థ పేరు	గెలిచే స్థానాలు		
	వైఎస్సార్‌సీపీ	టీడీపీ-జనసేన -బీజేపీ కూటమి	పోటాపోటీ
టైమ్స్‌నౌ-ఈటీజీ రీసెర్చ్	19-20	4-5	0
న్యూస్‌ఎరినా ఇండియా	20	5	0
జన్మత్ పోల్స్	15-17	6-8	0
పోల్‌స్ట్రాటజీ గ్రూప్	19-21	4-6	0
థర్డ్ విజన్(నాగన్న)	20-21	4-5	0
టీవీ9భారత్ వర్ష్	13	12	0
ఆత్మసాక్షి	16	6	3
జన్‌ధర్ ఇండియా	17	8	0
జీన్యూస్-మ్యాట్రిజ్	19	6	0
టైమ్స్‌నౌ-మ్యాట్రిజ్	19	6	0
పొలిటికల్ క్రిటిక్	21	4	0
పొలిటికల్ వ్యూస్	17-19	6-8	0
ఎస్‌ఎఫ్‌వో పొలిటికల్ సర్వే	20	5	0
డెక్కన్ 24/7	19	6	0
భారత్ పొలిటికల్ సర్వే	21-23	2-4	0
ఎన్‌డీటీవీ	16	9	0
ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్	22	3	0
డబ్ల్యూఆర్‌పీపీ స్ట్రాటజీస్	20	4	1
ఇండియాటీవీ-సీఎన్‌ఎక్స్	15	10	0

మీ తండ్రి కోసం పోరాడిన నాకు

మీరిచ్చే గౌరవం ఇదా?

షర్మిలను సూటిగా ప్రశ్నించిన ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

- షర్మిల చెప్పేవన్నీ పచ్చిఅబద్ధాలే.. రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు
- ఎమ్మెల్యే శంకర్రావు వల్లే నాడు వైఎస్ఆర్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు
- వైఎస్ఆర్‌ను కేసుల్లో ఇరికిస్తుంటే అన్యాయమని భావించి కేసులు వేశాను
- నాతో ఎవరూ కేసులు వేయించలేదు.. అప్పటికి జగన్‌ను చూడనేలేదు
- నా కంప్లైంట్‌లో వైఎస్సార్ ముద్దాయి అని ఎక్కడాలేదు
- షర్మిల చెప్పినట్టు నేనే వైఎస్ఆర్ మీద కేసు వేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే
- నా నిజాయితీ, నిబద్ధత మీద షర్మిల దెబ్బకొట్టారు
- నేను ఇది కాదు అనుకుంటే చరిత్రలో హీనులుగా మిగిలిపోతారు
- చంద్రబాబు మాట్లాడిన మాటలు, భాషనే షర్మిల మాట్లాడారు



సాక్షి, అమరావతి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డిని వేధించిన వారికి ఎదురొడ్డి, పోరాటం చేసిన తనను అభినందించాల్సింది పోయి ఆరోపణలు చేస్తారా అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలను అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మీ తండ్రి కోసం పోరాడినందుకు నాకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే షర్మిల తనపై అసత్య ఆరోపణలు చేశారని, ఆమె చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగేలా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్రావు వల్లే ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారని గుర్తు చేశారు. వైఎస్‌పై ఆరోపణలు చేస్తూ శంకర్రావు హైకోర్టుకు లేఖ రాశారని, దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించిందని తెలిపారు. టీడీపీ నేత ఎర్రన్నాయుడు ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యారని చెప్పారు. 2011 ఆగస్టు 17న వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారని తెలిపారు. మహానుభావుడైన వైఎస్ మీద ఆరోపణలు చేయడం, ఆయన్ని కేసుల్లో ఇరికించారని, ఈ అన్యాయాన్ని భరించలేక తాను కేసులు వేశానని చెప్పారు. తనతో ఎవరూ కేసులు వేయించలేదన్నారు. 2011 డిసెంబరులో తాను కేసు వేసే నాటికి కనీసం వైఎస్ జగన్‌ని చూడనే లేదని చెప్పారు. ఈ వాస్తవాలను తెలుసుకొని షర్మిల మాట్లాడాలని అన్నారు. అప్పటి జీవోలకు, వైఎస్ జగన్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు.

అర్హుడిని కాబట్టే ఏఏజీ అయ్యాను

తన నాలెడ్జ్ మీద, నిజాయితీ, నిబద్ధత మీద షర్మిల దెబ్బకొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇది కాదు అనుకుంటే చరిత్రలో హీనులుగా మిగిలిపోతారని అన్నారు. న్యాయవాద వృత్తిలో తన ప్రతిభ ఏమిటో షర్మిల తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. తాను అర్హుడిని కాబట్టే అడిషనల్ అడ్వొకేట్ జనరల్ అయ్యానని స్పష్టం చేశారు. తన ప్రతిభేమిటో ఇటీవలి కాలంలో చూడలేదా అని ప్రశ్నించారు. షర్మిల మాటలు చాలా అన్యాయమని, దుర్మార్గమని అన్నారు.

నన్ను రాజకీయాలు ప్రభావం చేయవు, చేయలేవు

'నేను న్యాయవాదిని, నన్ను వ్యక్తులు, రాజకీయాలు ప్రభావం చేయవు, చేయలేవు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో షర్మిల మాటల్లో నిజం అంతే ఉంది. పూర్తిగా అవగాహన లేకుండా మాట్లాడుతుంది. వ్యక్తిగతంగా హననం చేశారు. షర్మిల చేసిన వ్యాఖ్యలకు కలత చెందాను.' అంటూ షర్మిల మాటల వీడియోను ప్రదర్శించారు. 'ఆమె రాజకీయలబ్ధి కోసం అబద్ధాలు మాట్లాడారు. అయినా నేను వ్యక్తిగత హోదాలోనే జవాబు చెబుతున్నాను. హాఫ్ నాలెడ్జ్‌తో నిరాధారమైన ఆరోపణలు చేశారు. ఇది చాలా ప్రమాదకరం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, సీబీఐ కలిసే వైఎస్ఆర్‌ను ఇరికించాయి

'వైఎస్ఆర్‌ను కాంగ్రెస్, సీబీఐ కలిసే కేసుల్లో ఇరికించాయి. ఇది నేను నిరూపించటానికి సిద్ధం. ఎఫ్ఐఆర్ 9వ పేరాలో వైఎస్ రాజశేఖర రెడ్డిని ముద్దాయిగా చేశారు. ఎఫ్ఐఆర్ చదువుకోండి. ఇంత దుర్మార్గమైన క్రీడ సీబీఐ ఆడుతుంటే చూడలేక ఓ న్యాయవాదిగా కేసు వేశాను. ఏ పాపం తెలియని వైఎస్ఆర్‌ను, వైఎస్ జగన్‌ను వెంటాడుతుంటే.. ఆ అన్యాయానికి వ్యతిరేకంగా నేను చేసిన చిరు ప్రయత్నమది. వైఎస్‌ను వేధించిన వారికి ఎదురొడ్డి పోరాటం చేశా. ఆయన మీద కేసు పెట్టటం అన్యాయమని వాదించాను. వేరే 14 మందిని బాధ్యులుగా చేయాలని మాత్రమే కేసు వేశాను. నేను వేసిన కంప్లైంట్‌లో వైఎస్సార్ ముద్దాయి అని ఎక్కడైనా ఉందా? ఆ కాపీలను పంపిస్తా. షర్మిల చదువుకుంటే వాస్తవాలు తెలుస్తాయి. వైఎస్ జగన్ చెబితే, జగన్ పోద్బలంతోనే వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చేర్చానని షర్మిల చెబుతున్నారు. ఎంత నిస్సిగ్గుగా ఈ మాట చెప్పారు! ఆమె చెప్పినట్టు నేనే వైఎస్ఆర్ మీద కేసు వేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే' అని పొన్నవోలు చెప్పారు.

షర్మిల మాట్లాడుతున్నవి చంద్రబాబు మాటలే!

'షర్మిల అలవోకగా అబద్ధాలు చెబుతున్నారు. గతంలో బాబు మాట్లాడిన మాటలు, భాషనే సేమ్ టు సేమ్ (మక్కికి మక్కి) షర్మిల మాట్లాడారు. మీరు మాట్లాడినట్లే చంద్రబాబు కూడా గతంలో నాపై మాట్లాడారు. మీ స్క్రిప్టు చంద్రబాబు పంపిందా లేక మీదా అని అడగడం లేదు. తండ్రి మీద షర్మిలకు ప్రేమ ఉంటే శంకర్రావు రాసిన లేఖ చదవాలి. ఈ దుర్మార్గపు క్రీడలో నన్ను లాగడం దారుణం. మీ రాజకీయ యుద్ధం కోసం నన్నెందుకు లాగుతారు? మీ రాజకీయాలు ఎలాగైనా చేసుకోండి. నా పేరు ప్రస్తావించొద్దు' అని స్పష్టం చేశారు.

లేచింది మహిళా లోకం..


త్రిపురలోని గోయెనంగ్ పారాలో బ్రు తెగ ఓటర్లు


అస్సాంలోని మోరిగావ్‌లో చిన్నారులతో తల్లులు..


యూపీలోని బులంద్ షహర్‌లో ఎడ్లబండిపై దోలక్ వాయిస్తూ..


రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో గిరిజనులు..


కర్ణాటక రాజధాని బెంగళూరులో ముస్లిం ఓటర్లు..


మహారాష్ట్రలోని అమరావతిలో బీజేపీ అభ్యర్థి నవనీత్ కౌర్


యూపీలోని మథురలో ఓటేసేందుకు వచ్చిన సన్యాసినులు


అస్సాంలోని బక్సాలో బోడో గిరిజన వృద్ధ మహిళలు..


యూపీలోని మథురలో యువ ఓటర్లు..


కేరళలో సెల్ఫీ తీసుకుంటూ..

పోలింగ్ 63.5%

- స్వల్ప ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా పోలింగ్
- 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు ముగిసిన ఓటింగ్
- వడదెబ్బతో ముగ్గురు ఓటర్ల దుర్మరణం

న్యూఢిల్లీ: స్వల్ప చెదురుమదురు ఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. 13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు అందిన సమాచారం ప్రకారం 63.5 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ సమయంలోపు పోలింగ్‌బూత్‌కు వచ్చిన ఓటర్లను ఓటింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం ఇంకాస్త పెరిగే అవకాశముందని ఈసీ పేర్కొంది. కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపు, బోగస్ ఓట్ల ఆరోపణలు, చిన్నపాటి ఘర్షణలు మినహా అన్ని చోట్లా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. వడగాలులు, ఎండవేడిమిని తట్టుకుని సైతం ఓటర్లు ఎన్నికల స్ఫూర్తిని చాటారు. వాస్తవానికి 89 స్థానాల్లో పోలింగ్ జరగాల్సి ఉంది. కానీ మధ్యప్రదేశ్‌లోని బైతూల్‌లో బీఎస్పీ అభ్యర్థి హఠాన్మరణంతో అక్కడ ఓటింగ్‌ను మే 7వ తేదీకి మార్చారు. శుక్రవారం కేరళలోని అన్ని 20 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరిగింది. కర్ణాటకలో 14, రాజస్థాన్‌లో 13, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్‌లో చెరో 8, మధ్యప్రదేశ్ 6, అస్సాం, బిహార్‌లలో చెరో ఐదు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్‌లలో చెరో 3, మణిపూర్, త్రిపుర, జమ్మూకశ్మీర్‌లలో ఒక్కొక్క స్థానంలో పోలింగ్ జరిగింది.


శశిథరూర్


డీకే శివకుమార్


సిద్ధరామయ్య


నిర్మలా సీతారామన్

స్వల్ప ఘర్షణలు, వడదెబ్బ మరణాలు

కేరళలో కొన్ని చోట్ల ఈవీఎంలు పనిచేయలేదు. వడదెబ్బ కారణంగా కేరళలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల వద్ద ముగ్గురు ఓటర్లు చనిపోయారు. కోజికోడ్‌లో ఒక పోలింగ్ ఏజెంట్ మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో పోలింగ్ డ్యూటీలో ఉన్న ఒక మధ్యప్రదేశ్ జవాను సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మణిపూర్‌లోని తంగ్‌ఖుల్ నాగా జిల్లాలో కాంగ్రెస్, ఎన్‌పీఎఫ్ మద్దతుదారులకు మధ్య జరిగిన గొడవల్లో ఈవీఎంలు ధ్వంసమయ్యాయి.

బెంగాల్ నుంచి ఈసీకి 300 ఫిర్యాదులు

మతం ప్రాతిపదికన ఓట్లేయాలంటూ సోషల్‌మీడియాలో వీడియో పోస్ట్‌చేశారంటూ బెంగళూరు సౌత్ బీజేపీ అభ్యర్థి తేజస్వీ సూర్యపై పోలీసులు కేసు నమోదుచేశారు. మరో బీజేపీ నేత సీటీ రవి మీదా కేసు నమోదైంది. పోలింగ్‌కు సంబంధించి పశ్చిమబెంగాల్ నుంచి ఈసీకి 300 ఫిర్యాదులొచ్చాయి. కాంగ్రెస్ నేత శశిథరూర్, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, 'టీవీ' రాముడు అరుణ్ గోవిల్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్(కాంగ్రెస్), కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి(జేడీఎస్)లు పోటీచేస్తున్న స్థానాల్లోనూ పోలింగ్ ముగిసింది. బీజేపీ నేతలు హేమా మాలిని, గజేంద్ర షెకావత్‌లు హ్యాట్రిక్ విజయం కోసం ఎదురుచూస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈ 88 స్థానాల్లో ఎన్‌డీఏ కూటమి 56 చోట్ల, యూపీఏ కూటమి 24 చోట్ల విజయం సాధించాయి.

రాష్ట్రం	పోలింగ్ శాతం
కేరళ	70.22
కర్ణాటక	69.23
రాజస్తాన్	64.60
మహారాష్ట్ర	57.83
ఉత్తరప్రదేశ్	54.85
మధ్యప్రదేశ్	57.88
అస్సాం	71.11
బిహార్	55.08
ఛత్తీస్‌గఢ్	73.05
పశ్చిమబెంగాల్	71.84
మణిపూర్	77.32
త్రిపుర	79.46
జమ్మూకశ్మీర్	71.91

సైడ్‌లైట్స్

- ఓటేసి వస్తే డిస్కౌంట్ ధరకే ఆహారపదార్థాలు అందిస్తామని బెంగళూరులో పలు హోటళ్లు, కెఫేలు, మిఠాయి దుకాణాలు ప్రకటించాయి. కొన్ని దుకాణాలు ఉచితంగానూ ఇచ్చాయి. దీంతో ఓటేసిన ఓటర్లు లడ్డూ, దోసె, కాఫీ, ఇతర ఆహార పదార్థాల కోసం ఆయా షాపుల వద్ద క్యూ కట్టారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని శివానీ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పెళ్లి మండపంలాగా తీర్చిదిద్దారు. వివాహ మంత్రోచ్చారణలను ప్లే చేశారు.
- దక్షిణ కన్నడ నియోజకవర్గ పరిధిలోని పవూర్ ఉలియా ద్వీపం నుంచి 150కిపైగా ఓటర్లు పోలింగ్ కేంద్రానికి పడవల్లో వచ్చి మరీ ఓటేసి వెళ్లారు
- కోటా–బూందీ నియోజకవర్గంలో 108 ఏళ్ల బామ్మ భూరీ భాయ్ వీల్‌చైర్‌లో వచ్చి ఓటేశారు.
- దక్షిణ కన్నడ జిల్లాలోని మారుమూల గిరిజన బంజరు మాలె గ్రామంలో ఉన్న మొత్తం 111 మంది ఓటేసి 100 శాతం పోలింగ్‌ను నమోదుచేశారు.
- ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, కాంకేర్ పరిధిలోని 45 గ్రామాల ప్రజలు తొలిసారిగా సొంతూళ్లలో ఓటేశారు.
- కనీస సదుపాయాలు లేవని, అభివృద్ధి జరగలేదని కొన్ని నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు.

పోలింగ్ ముగిసిన స్థానాలు

రాష్ట్రం	తొలి విడత	రెండో విడత
అరుణాచల్‌ప్రదేశ్ (2)	2	-
అసోం (14)	5	5
బిహార్ (40)	4	5
ఛత్తీస్‌గఢ్ (11)	1	3
కర్నాటక (28)	-	14
కేరళ (20)	-	20
మధ్యప్రదేశ్ (29)	6	6
మహారాష్ట్ర (48)	5	8
మణిపూర్ (2)	1	1
మేఘాలయ (2)	2	-
మిజోరం (1)	1	-
నాగాలాండ్ (1)	1	-
రాజస్తాన్ (25)	12	13
సిక్కిం (1)	1	-
తమిళనాడు (39)	39	-
త్రిపుర (2)	1	1
ఉత్తరప్రదేశ్ (80)	8	8
ఉత్తరాఖండ్ (5)	5	-
పశ్చిమబెంగాల్ (42)	3	3
అండమాన్ (1)	1	-
జమ్మూ కశ్మీర్ (5)	1	1
లక్షద్వీప్ (1)	1	-
పుదుచ్చేరి (1)	1	-

నోట్: రాష్ట్రాల పక్కన బ్రాకెట్లో ఉన్నది మొత్తం స్థానాలు

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం

తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు ధర్మాసనం

- ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ కాలేదు
- వంద శాతం వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు కుదరదు
- మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానం అంటే ఎన్నికల సంస్కరణలు రద్దయినట్లే
- దాఖలైన అన్ని పిటిషన్లు కొట్టివేత

సాక్షి, న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎం) ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పోలింగ్ బూత్‌ల ఆక్రమణ, దొంగ ఓట్లు వేయడం వంటి అక్రమాలను ఈ యంత్రాలతో అడ్డుకోవచ్చని, ఇవి పూర్తిగా భద్రతతో కూడినవని తేల్చిచెప్పింది. ఈవీఎంలలో అవకతవకలు జరిగినట్లు ఇప్పటిదాకా ఎక్కడా నిర్ధారణ కాలేదని పేర్కొంది. ఈవీఎంలపై అనుమానాలు నిరాధారమని తేల్చిచెప్పింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో వంద శాతం వీవీప్యాట్ స్లిప్పులను సరిపోల్చడం(క్రాస్–వెరిఫికేషన్) కుదరని వెల్లడించింది. ఈవీఎంలలో నమోదైన ఓట్లతో వంద శాతం వీవీప్యాట్ స్లిప్పులను క్రాస్–వెరిఫికేషన్ చేయాలని, వీవీప్యాట్ స్లిప్పులు బ్యాలెట్ బాక్సులో వేయాలని, ఎన్నికల్లో మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఒకే అభిప్రాయంతో రెండు తీర్పులు వెలువరించింది. ఈవీఎంలపై వస్తున్న అపోహలు, అనుమానాలకు సంబంధించి ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించి, వాటన్నింటినీ ధర్మాసనం నివృత్తి చేసుకుంది. అనంతరమే తీర్పు ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. అన్ని పిటిషన్లు కొట్టివేస్తున్నట్లు తెలియజేసింది.

సింబల్ లోడింగ్ యూనిట్లు భద్రపర్చాలి

జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పును వెలువరిస్తూ ఎన్నికల సంఘానికి కొన్ని సూచనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత సింబల్ లోడింగ్ యూనిట్లను(ఎస్ఎల్‌యూ) సీల్ చేసి, కంటైనర్‌లో భద్రపర్చి, ఈవీఎంలతోపాటు స్ట్రాంగ్‌రూమ్‌లో కనీసం 45 రోజులపాటు స్టోర్ చేయాలని చెప్పారు. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈవీఎంల తయారీ సంస్థకు చెందిన ఇంజినీర్లు ఆయా యంత్రాల మైక్రో కంట్రోలర్లను ధ్రువీకరించడానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫలితాలు ప్రకటించిన ఏడు రోజుల లోపు తగిన రుసుము చెల్లించి మైక్రో కంట్రోలర్ల ధ్రువీకరణను ఎన్నికల్లో రెండు, మూడో స్థానాల్లో నిల్చిన అభ్యర్థులు కోరవచ్చని, ఒకవేళ ఈవీఎం ట్యాంపరింగ్‌కు గురైనట్లు తేలితే ఆ సొమ్ము సదరు అభ్యర్థులకు తిరిగి చెల్లించాలని సూచించారు.

ఈవీఎంలతో లాభాలివే..

ఈవీఎంలను తారుమారు చేయొచ్చనే పిటిషనర్ల వాదనల్లో వాస్తవం లేదని ధర్మాసనం పేర్కొంది. ఈవీఎం, వీవీప్యాట్ ఉపయోగాలను వివరించింది. ''ఇది బ్యాటరీతో పనిచేస్తుంది. బటన్ నొక్కడం ద్వారా ఓటు నమోదవుతుంది. దీనివల్ల బ్యాలెట్ పేపర్‌తో ఎదురయ్యే చెల్లని ఓట్ల వంటి సమస్యలు ఉండవు. నిమిషానికి నాలుగు కంటే ఎక్కువ ఓట్లను ఈవీఎం అనుమతించదు. దీంతో పోలింగ్ బూత్‌ల ఆక్రమణకు అవకాశం ఉండదు. ఓట్ల లెక్కింపు వేగంగా పూర్తవుతుంది. ఈవీఎంలో బీప్ సౌండ్ ద్వారా తమ ఓటును ఓటర్లు తక్షణమే ధ్రువీకరించుకోవచ్చు. వీవీప్యాట్ స్లిప్పును ప్రత్యక్షంగా చూడొచ్చు'' అని తెలిపింది.

ఆ స్లిప్పులు ఇవ్వడం ఆచరణ సాధ్యం కాదు

ఓటర్లు వీవీప్యాట్ స్లిప్పులు తీసుకొని బ్యాలెట్ బాక్సులో వేయాలన్న అభ్యర్థన కూడా తిరస్కరిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తమ ఓటు కచ్చితంగా నమోదు అయిందని, లెక్కించడానికి వీలుగా ఉందని నిర్ధారించుకోవడం ఓటర్ల ప్రాథమిక హక్కు అని వివరించింది. అయితే వీవీప్యాట్ స్లిప్పులను వంద శాతం భౌతికంగా లెక్కించాలనడం ఆ హక్కుతో సమానం కాదని అభిప్రాయపడింది. ఓటర్ల హక్కులు ఇతర చర్యల ద్వారా కాపాడవచ్చని వెల్లడించింది. సుబ్రహ్మణ్య స్వామి వర్సెస్ కేంద్ర ఎన్నికల సంఘం కేసు తర్వాత వీవీప్యాట్‌లు ప్రవేశపెట్టారని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఒక అసెంబ్లీ సెగ్మెంట్ లేదా అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఐదు పోలింగ్ స్టేషన్లలోని వీవీప్యాట్‌ల లెక్కింపు ప్రారంభమైందని ధర్మాసనం గుర్తుచేసింది. ఓటర్లకు భౌతికంగా వీవీప్యాట్ స్లిప్పులు ఇవ్వడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఇలా స్లిప్పులు ఇచ్చే విధానం దుర్వినియోగం, వివాదాలకు దారి తీసే ఆకాశం ఉందని పేర్కొంది. 2019 ఎన్నికల్లో 20,687 వీవీప్యాట్‌ల స్లిప్పులను భౌతికంగా లెక్కించారని, ఒక్క దాంట్లోనూ మిస్‌మ్యాచ్ గుర్తించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నెంబర్ 63లో ఈవీఎంలో వ్యత్యాసం గుర్తించారని తెలిపింది. ఈవీఎంలో మాక్ పోలింగ్ డేటాను ప్రిసైడింగ్ అధికారి తొలగించకపోవడంతో ఆ వ్యత్యాసం వచ్చినట్లు తేలిందని పేర్కొంది.

మళ్లీ బ్యాలెట్ ఓటింగ్‌తో నష్టమే

బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ నిర్వహించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను జస్టిస్ సంజీవ్ ఖన్నా తన తీర్పులో తోసిపుచ్చారు. బ్యాలెట్ పేపర్ విధానంలో కొన్ని లోపాలు, నష్టాలు ఉన్నాయని తెలిపారు. ఆ పాత విధానానికి మళ్లీ వెళ్లడం అనేది ఎన్నికల సంస్కరణలు రద్దు చేయడమే అవుతుందని పేర్కొన్నారు. దేశంలో 97 కోట్ల మంది ఓటర్లు, పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య, పేపర్ బ్యాలెట్‌తో ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ విధానానికి వెళ్లాలని చెప్పలేమన్నారు. ఈ అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా స్పందిస్తూ.. పేపర్ బ్యాలెట్ వ్యవస్థకు మళ్లీ తీసుకురావడం అనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, ఈవీఎంలను మరింత అభివృద్ధి చేసి, మెరుగైన ఎన్నికల వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంలపై ఓటర్లలో సందేహాలు సృష్టించడం ద్వారా ఓటింగ్ ప్రక్రియను నిర్వీర్యం చేయడానికి పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారన్న ఎన్నికల సంఘం వాదనతో ఆయన ఏకీభవించారు.

ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ

- వీవీప్యాట్ స్లిప్పులపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: మోదీ
- ఈవీఎంలపై అనుమానాలు సృష్టించేందుకు కాంగ్రెస్ యత్నం
- ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి
- ప్రధాని మోదీ డిమాండ్
- బిహార్, పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం

అరారియా/ముంగేర్/మాల్డా: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్ స్లిప్పుల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ తీర్పు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమికి గట్టి చెంపదెబ్బ అని స్పష్టం చేశారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా ప్రజల్లో అనుమానాలు సృష్టించే పాపానికి పాల్పడినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని అన్నారు. శుక్రవారం బిహార్‌లోని అరారియా, ముంగేర్, పశ్చిమ బెంగాల్‌లోని మాల్డాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. అలాగే ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీలో రోడ్ షోలో పాల్గొన్నారు. 'కాంగ్రెస్ లూటీ.. జీవించి ఉన్నప్పుడు, మరణించిన తర్వాత కూడా' అనే కొత్త నినాదం వినిపించారు. వారసత్వ పన్ను ద్వారా ప్రజల ఆస్తులను కొట్టేయడానికి కాంగ్రెస్ కుట్రలు చేస్తుంటే 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు నోరుమెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు వాటికి ఇష్టమైన ముస్లిం ఓటు బ్యాంక్‌కు మేలు చేయడానికి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు, హక్కులను దోచేయడానికి కుట్రలు సాగిస్తున్నాయని మరోసారి మండిపడ్డారు. బహిరంగ సభల్లో నరేంద్ర మోదీ ఇంకా ఏం చెప్పారంటే..



ఆటలు సాగడం లేదనే ఈవీఎంలపై కుట్ర

''కాంగ్రెస్ సహా విపక్ష 'ఇండియా' కూటమి పార్టీలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో లెక్కలేనన్ని అక్రమాలకు పాల్పడేవి. పోలింగ్ బూత్‌లను ఆక్రమించేవి. దొంగ ఓట్లు వేయించేవి. వ్యతిరేకంగా ఓట్లు పడిన చోట బ్యాలెట్ బాక్సులను మాయం చేసేవి. అప్పట్లో బలవంతులదే రాజ్యం. పేదలు, దళితులు, గిరిజనులకు ఓటు వేసే అవకాశం ఉండేది కాదు. వారి ఓటును ఇంకెవరో వేసేవారు. ఈవీఎంలను ప్రవేశపెట్టిన తర్వాత విపక్షాల ఆటలు సాగడం లేదు. అందుకే ఈవీఎంలపై తప్పుడు ప్రచారానికి తెరతీశాయి. మళ్లీ బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టాయి. విపక్షాలకు చెంపపెట్టు లాంటి తీర్పును సుప్రీంకోర్టు ఇవాళ ప్రకటించింది.

వనరులపై మొదటి హక్కు పేదలకే..

నేను వెనుకబడిన కులంలో జన్మించా. వెనుకబడిన తరగతుల ప్రజల కష్టాలేమిటో నాకు తెలుసు. స్వయంగా అనుభవించా. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీలకు దక్కాల్సిన ప్రయోజనాలను ముస్లింలకు కట్టబెడుతోంది. సొంత లాభం కోసం ఓబీసీల రిజర్వేషన్లను దోచుకుంటోంది. చట్టవిరుద్ధంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశమంతటా ఓబీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు సైతం ఇదే గతి పడుతుంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఓటుబ్యాంకు రాజకీయాల కోసం పక్కదారి పట్టిస్తామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. ఇది మోదీ గ్యారంటీ''

రెండు దశల్లో ఎన్డీయేకు అనుకూల ఓటింగ్

సార్వత్రిక ఎన్నికల్లో తొలి రెండు దశల్లో ఎన్డీయేకు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోలింగ్ ముగిసిన అనంతరం 'ఎక్స్'లో పోస్టు చేశారు. రెండు దశల్లో తమ కూటమికి ప్రజల నుంచి లభించిన అసమానమైన మద్దతు విపక్ష 'ఇండియా' కూటమికి తీరని ఆవేదన మిగిల్చిందని తెలిపారు.

సీఏఏపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

''ఓటు బ్యాంక్‌ను సంతృప్తిపర్చడానికి పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. సీఏఏను వ్యతిరేకించడం దారుణం. ఇతర దేశాల్లో మతపరమైన వివక్షకు గురై భారత్‌కు శరణార్థులుగా వలసవచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులపై ఎందుకంత విద్వేషం? వారికి మన దేశ పౌరసత్వం ఇవ్వడాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? సీఏఏ అనేది బాధితులకు పౌరసత్వం ఇవ్వడానికే తప్ప పౌరసత్వం లాక్కోవడానికి కాదు''

ఇక వేదికపై కన్నీళ్లు పెడతాడేమో

మోదీపై రాహుల్ గాంధీ విసుర్లు



విజయపుర(కర్ణాటక): కపట నాటకాలతో ప్రచార వేదికను కన్నీటితో తడిపేస్తాడేమో అంటూ ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శల వర్షం కురిపించారు. కర్ణాటకలోని విజయపుర జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. '' ఇటీవలికాలంలో బీజేపీ ప్రచారవేదికలపై మోదీ ప్రసంగాలు వినే ఉంటారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుంది. ఈసారి వేదికపై ఆయన కన్నీళ్లు పెట్టుకుంటారేమో. ప్రజాసమస్యల నుంచి ఓటర్ల దృష్టిని ఏమార్చే ప్రయత్నంచేస్తారు. అందుకే ఆయన ఒకసారి చైనా గురించి మాట్లాడతారు. ఇంకోసారి పాకిస్తాన్ ఊసెత్తుతారు. మరోసారి ప్లేట్లు, గిన్నెలు కొట్టమంటారు. ఇంకోసారి మొబైల్‌ఫోన్ల టార్చ్‌లైట్ ఆన్ చేయమంటారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, పెరిగిన ధరలు ఇలా మూడు, నాలుగు అత్యంత ప్రధానమైన సమస్యలు తిష్టవేశాయి. వీటిని రూపుమాపే శక్తి ఒక్క కాంగ్రెస్‌కే ఉంది. మోదీ హయాంలో అమలవుతున్న పథకాలతో దళితులు, ఓబీసీ, గిరిజనులు, మైనారిటీలు, పేద జనరల్ కేటగిరీ ప్రజలకు ఎలాంటి మేలు జరగట్లేదు. బిలియనీర్లకు మోదీ ఇచ్చిన వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మేం అధికారంలోకి వస్తే పేదలకు పంచుతాం. అగ్నివీర్‌లుగా 18–21 ఏళ్ల యువత మూడేళ్లు సైన్యంలో పనిచేశాక వారి ఉద్యోగాలను మోదీ లాగేసుకుంటున్నారు. యువతను అవమానిస్తున్న ఇలాంటి అగ్నివీర్ పథకాన్ని రద్దుచేస్తాం. జనంపై మోదీ జీఎస్టీ పెనుభారం మోపారు. కర్ణాటక ప్రజలకు మోదీ అన్యాయం చేశారు. మేం అధికారంలోకి వచ్చాక జీఎస్టీ విధానంలో కాంగ్రెస్ మార్పులు తీసుకొస్తుంది. కర్ణాటక ప్రజలకు జరిగిన అన్యాయాన్ని రూపుమాపి న్యాయం చేస్తుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికలు గతంలోలాగా ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలు కావు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక వ్యక్తి(మోదీ), ఒక పార్టీ(బీజేపీ) దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో వచ్చిన ఎన్నికలు ఇవి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

బీర్భూమ్‌లో బీజేపీ అభ్యర్థి నామినేషన్ రద్దు

కోల్‌కతా: సాంకేతిక కారణాలతో పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి దేబాశిష్ ధార్ దాఖలుచేసిన నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి శుక్రవారం తిరస్కరించారు. అయితే బీజేపీ మరో నేత దేబ్తాను భట్టాచార్యతో బీజేపీ గురువారమే నామినేషన్ వేయించింది. ధార్ పోటీ నుంచి తప్పుకోవడంతో భట్టాచార్య బీజేపీ అభ్యర్థిగా ప్రచారం మొదలెట్టారు. భట్టాచార్యకు పోటీగా అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తరఫున శతాబ్ది రాయ్ బరిలో నిలిచారు.

అనంతనాగ్ పోలింగ్ వాయిదా వద్దు

ఈసీకి ఒమర్, మెహబూబా ముఫ్తీ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ –రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్‌ను వాయిదా వేయొద్దంటూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) నేత ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం మే 7న ఇక్కడ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగా దక్షిణ కశ్మీర్‌ను పూంచ్–రాజౌరీతో కలిపే కీలకమైన మొఘల్ రోడ్డును అధికారులు మూసివేసే అవకాశమున్నందున పోలింగ్‌ను వాయిదా వేయాలంటూ బీజేపీ, మరో ముగ్గురు అభ్యర్థులు ఈసీని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రోడ్డును తెరిచే ఉంచేలా స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించాలంటూ ఈసీని కోరారు.

మైనారిటీలకు బీఫ్ తినే హక్కు ఇవ్వాలనుకుంటోంది: కాంగ్రెస్‌పై యోగి ధ్వజం

లక్నో: యూపీ సీఎం యోగి కాంగ్రెస్ పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీఫ్ తినే హక్కు మైనారిటీలకు ఇవ్వాలని ఆ పార్టీ భావిస్తోందని, అది గోవధతో సమానమవుతుందని అన్నారు. 'తమకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛను మైనారిటీలకు కల్పించాలని కాంగ్రెస్ అనుకుంటోంది. అంటే, గోవధను అనుమతించడమే అవుతుంది. కాంగ్రెస్ వాళ్లు మాత్రం గోవులను వధించే వారి చేతుల్లో పెట్టాలనుకున్నారు. భారత్ ఇందుకు అంగీకరిస్తుందా?'అని మొరాబాద్ జిల్లాలో జరిగిన ర్యాలీలో సీఎం యోగి ప్రజలను ప్రశ్నించినట్లు యూపీ బీజేపీ తెలిపింది.

నేటి నుంచి సునీతా కేజ్రీవాల్ ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ శనివారం నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆమ్ ఆద్మీ పార్టీ తెలిపింది. శుక్రవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆప్‌కు చెందిన మంత్రి ఆతిశీ విలేకరులతో మాట్లాడారు. శనివారం సునీత రోడ్ షోలో పాల్గొంటారని, ఆదివారం పశ్చిమ ఢిల్లీలో ప్రచారం చేస్తారని చెప్పారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో సీఎం కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా 'జైల్ కా జవాబ్ ఓట్ సే'పేరుతో ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పంజాబ్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో సునీత ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు.

పోలీసు కాల్పుల్లో భారత సంతతి వ్యక్తి మృతి

న్యూయార్క్: మహిళపై దాడి కేసులో అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులను వాహనంతో గుద్దిన భారత సంతతికి చెందిన వ్యక్తి ఒకరు పోలీసు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో ఏప్రిల్ 21వ తేదీన ఘటన చోటుచేసుకుంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ సాహూ(42) తన రూంమేట్ అయిన ఓ మహిళ(51)ను వాహనంతో ఢీకొట్టాడు. దీంతో, ఆమె తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తనను పట్టుకునేందుకు వచ్చిన పోలీసులపైకి సాహూ బీఎండబ్ల్యూను నడిపాడు. ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. మరో పోలీసు జరిపిన కాల్పుల్లో సాహూ ప్రాణాలు కోల్పోయాడు. 'కొంతకాలంగా సాహూ మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు'అని మాజీ భార్య లియా గోల్డ్‌స్టీన్ పేర్కొంది.

ఇకపై ఏటా రెండుసార్లు సీబీఎస్ఈ పరీక్షలు!

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) బోర్డు పరీక్షలను ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించడానికి రంగం సిద్ధమవుతోంది. 2025–26 విద్యాసంవత్సరం నుంచి బోర్డు పరీక్షలను రెండుసార్లు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కేంద్ర విద్యా శాఖ సీబీఎస్ఈకి సూచించింది. సీబీఎస్ఈలో సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన లేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ప్రతి సంవత్సరం రెండు సార్లు బోర్డు పరీక్షల నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ, సీబీఎస్ఈ అధికారులు వచ్చే నెలలో స్కూల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

శుక్రవారం ఉష్ణోగ్రతలు ఇలా...	హఫీజ్‌పేట్	కుత్బుల్లాపూర్	వివేకానందనగర్	బన్సీలాల్‌పేట	జీడిమెట్ల	గౌలివాడ	బండ్లగూడ	మలక్‌పేట	విరల్‌వాడి	అల్కాపురి	ఐఎస్ సదన్	చాంద్రాయణగుట్ట
	43.5	43.4	43.2	43.1	43.0	43.0	43.0	43.0	42.9	42.9	42.9	42.9


నిర్మానుష్యంగా మారిన సెక్రటేరియట్ రహదారి..

'ఫ్రై'డే.. డ్రై డే

సాక్షి, సిటీబ్యూరో: నగరం నిప్పుల కుంపటిగా మారుతోంది. పగటి ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయి. శుక్రవారం అత్యధికంగా హఫీజ్‌పేటలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇదే రికార్డు. వారం రోజులుగా ఎండలు మండిపోతుండటంతో రోడ్లపై జనసంచారం తగ్గింది. ఉష్ణ తాపానికి తోడు వడగాల్పులు సిటీజనులను బెంబేలెత్తిస్తున్నాయి. మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు రావద్దని సూచించింది.


బాబూ జగ్జీవన్‌రామ్ సెంటర్..


నాయిని నర్సింహారెడ్డి ఫ్లై ఓవర్ వద్ద..

కాంగ్రెస్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు

ఇంటర్వ్యూ

'కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులే మా ప్రచార అస్త్రాలు. ప్రభుత్వ పనితీరును ఎండగట్టే అవకాశం కల్పించాలని మల్కాజిగిరి ఓటర్లను కోరుతున్నా. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతో రోడ్డు షోలు, ప్రత్యేక సభలను నిర్వహించి కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తా. అదృష్టవశాత్తూ మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా ఉండటం నా బలం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదు. బీజేపీ అభ్యర్థితోనే ప్రధానంగా పోటీ ఉండబోతోంది' అని మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- వివరాలు 8లో


మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

7

సాక్షి హైదరాబాద్

శనివారం। 27। ఏప్రిల్। 2024



- కృత్రిమంగా పండించిన పండ్లతో తీవ్ర అనారోగ్య సమస్యలు
- ఇందులోని కాల్షియం కార్బైడ్ ప్రమాదకారి
- కొన్ని రసాయనాలు కార్సినోజెనిక్
- వేసవి సందర్భంగా మార్కెట్‌లోకి కార్బైడ్ మామిడి

'మజా' లేదు..

మామిడి సీజన్ వచ్చేసింది. మార్కెట్‌లకు భారీగా పండ్లు తరలివచ్చాయి. అయితే పండ్లలో మామిడి రారాజు అంటారు కదా! కానీ, తింటే.. అనారోగ్యం రారాదూ.. అని ఆహ్వానిస్తున్నట్టుగా ఉంది పరిస్థితి. మార్కెట్‌లో ఆకర్షణీయంగా, నోరూరించే విధంగా మామిడిపండ్లు దర్శనమిస్తున్నాయి. సహజసిద్ధంగా ఉండే ఈ పండ్లలో లభించే విటమిన్లు, ప్రొటీన్లు తదితర పోషక విలువలు ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ప్రస్తుత మార్కెట్‌లో కొనుగోలు చేసే వివిధ రకాల పండ్లు అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీనికి కారణం పండ్లను మగ్గించడానికి రసాయనాలను వాడటమేనని నిపుణులు అంటున్నారు. ఎక్కువ మొత్తంలో పండ్లను అమ్మడానికి, సీజన్ కన్నా ముందే ఆ ఫలాలను జనాలకు అందించాలనే తాపత్రయంతో కాల్షియం కార్బైడ్ వంటి విషపూరిత రసాయనాలను పండ్లు మగ్గించడానికి (బలవంతంగా పండటానికి) వాడుతున్నారు. ఈ కాల్షియం కార్బైడ్ అనారోగ్యాలకు కారణమని, దీనితో పండ్లను మగ్గించవద్దని గతంలోనే హైకోర్టు నిషేధించింది. అయినప్పటికీ మార్కెట్ అవసరాల కోసం కొందరు ఈ రసాయనాలను వాడుతూనే ఉన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

సహజ ఫలాలు.. తియ్యటివాసన..

సహజపద్ధతిలో పండిన ఫలాలు తియ్యటి వాసనతో ఉంటాయి. వీటిపై నల్లటి మచ్చల వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఫలాలపై ఉండే కాడ తాజాగా కాకుండా పూర్తిగా వాడిపోయి ఉంటుంది. సహజ వాతావరణంలో వేడి ఉష్ణోగ్రతల నిల్వలో మగ్గించడంతో కాస్త బూజు పట్టినట్లుగానూ ఉంటాయి.

గుండె, మూత్రపిండాలు, కాలేయం.. జర జాగ్రత్త!

కృత్రిమంగా పండ్లను మగ్గించడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాల వల్ల గుండె, మూత్రపిండాలు, కాలేయంపై ప్రభావం పడుతోంది. ఈ రసాయనాలు ఆర్సెనిక్, కార్సినోజెనిక్ కావడం వల్ల కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు దరి చేరుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనాలు ఫలాలపై తొక్క మాత్రమే పండేలా చేస్తాయి. ఫలితంగా లోపలి గుజ్జు మాత్రం పూర్తిగా పండకుండానే మార్కెట్‌లోకి అమ్మకానికి వస్తుంటాయి. ఈ పండ్లు తినడం వల్ల వాంతులు, నీరసం, చర్మసమస్యలు, దాహం, నోటిలో నొప్పి వంటి సర్వసాధారణమైన సమస్యలు ఎదుర్కొంటారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు ఇలాంటి పండ్లు మరింత ప్రమాదకరం. కాల్షియం కార్బైడ్ ఉత్పత్తి చేసే ఎసిటలీన్ మానవ నాడీ వ్యవస్థను దెబ్బతీసి, జ్ఞాపక శక్తిని కోల్పోయేలా చేస్తుందని పరిశోధనలు స్పష్టం చేశాయి.

మగ్గించిన వాటిని ఇలా తెలుసుకోవచ్చు...

బకెట్‌లో నీళ్లు నింపి అందులో సహజ ఫలాలు వేస్తే నీటి అడుగు భాగానికి చేరుకుంటాయి. రసాయనాలతో పండినవి మాత్రం నీటి పైకి తేలుతుంటాయి. రసాయనాలతో పండించినవి తాజాగా, చర్మం నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఈ ఫలాలు వాటి సహజమైన రుచిని చాలా వరకు కోల్పోతాయి. ఈ ఫలాలపై ఆకుపచ్చ, బ్రౌన్ కలర్‌లో మచ్చలను గుర్తించవచ్చు.

ఫుడ్‌సేఫ్టీ నియమ నిబంధనలు

సహజంగా పక్వానికి వచ్చిన కాయలను సేకరించి గడ్డిలో నాలుగైదు రోజులు మగ్గపెడితే పండ్లుగా మారుతాయి. ఈ సీజన్‌లో మార్కెట్‌లో పండ్లకు గిరాకీ అధికంగా ఉండటంతో కృత్రిమ పద్ధతుల్లో కాయలను మగ్గిస్తున్నారు. దీని కోసం జాతీయస్థాయిలో ఫుడ్‌సేఫ్టీ విభాగం కొన్ని నియమ నిబంధనలు అమలు చేస్తోంది. అనుమతి మేరకు నిర్దేశిత మోతాదులో ఇథిలిన్ చాంబర్స్‌ని వాడుతారు. ఈ చాంబర్స్‌లో 72 గంటల్లో కాయలు పండ్లుగా మారుతాయి. ఈ విధానంలో హార్మోన్లు సమపాళ్లలో ఉంటాయి. ఈ ఇథిలిన్ చాంబర్స్ కొన్ని మార్కెట్‌లలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ చాంబర్స్ కాకుండా ఇతోఫాన్ అనే సాచెస్‌ని వినియోగించి పండ్లు మగ్గించడానికి కూడా ప్రభుత్వ అనుమతి ఉంది.



ఇతోఫాన్ పాకెట్ మాత్రమే వాడుతున్నాం..

దాదాపుగా 2015 నుంచే కాల్షియం కార్బైడ్‌ను నిషేధించారు. 2016లో మార్కెట్ యార్డ్ పరిధిలో దాదాపు 15 మంది ఖరీదుదారులపై ఫుడ్ స్టాండర్డ్స్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా శాఖ కేసులు నమోదు చేయగా వారు నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే కాల్షియం కార్బైడ్‌కు బదులు పండ్లను మగ్గబెట్టడానికి ఇతోఫాన్ పాకెట్(ఇథలిన్ గ్యాస్ విడుదల చేస్తుంది)ను వాడొచ్చని ఫుడ్‌సేఫ్టీ విభాగం 2018లో జారీ చేసిన మార్గదర్శకాల్లో సూచించింది. ఇతోఫాన్ హానికరం కాదనే ఈ నిబంధనలకు లోబడే మార్కెట్ యార్డ్ గడ్డి అన్నారం పరిధిలోని బాటసింగారం మార్కెట్‌లో పండ్లను మగ్గించడానికి ఇతోఫాన్ పాకెట్‌లను వాడుతున్నాం. – చిలక నర్సింహారెడ్డి, ఉన్నత శ్రేణి కార్యదర్శి– మార్కెట్ కమిటీ గడ్డి అన్నారం

ఊపిరితిత్తులపై ప్రభావం..

పండ్లను కృత్రిమంగా పండించడానికి వాడే రసాయనాలు నేరుగా జీర్ణాశంలోకి చేరుతాయి. ఇవి చాలా ప్రమాదకరం. ఈ రసాయనాలు ఊపిరితిత్తులపై ప్రభావాన్ని చూపిస్తాయి. చర్మ సమస్యలకు కారణమవుతాయి. జీర్ణాశయనాళంలో రసాయనాలు చేరి దానికి చిల్లులు పడేలా చేస్తాయి. ఈ రసాయనాలకు సంబంధించిన మూలకాలు శరీరంలోని వివిధ భాగాల్లో చేరి, కొంతకాలం తరువాత ఆ భాగాల్లో కేన్సర్ కణాలను వృద్ధి చేస్తాయి. ఇందులో భాగంగానే లంగ్ కేన్సర్, గొంతు, జీర్ణాశయంలో తదితర భాగాలకు కేన్సర్లు సోకుతాయి. కొందరు వ్యాపారులు వేడి చేసిన కాల్షియం కార్బైడ్ నీళ్లలో పండ్లను ఉడకబెట్టి కృత్రిమంగా మగ్గిస్తుంటారు. ఇలాంటి విధానాలు ప్రమాదకరం. ఇలా ఉడకబెట్టి పండించిన పండ్లు వాటి ఆకారాన్ని కోల్పోయి గుండ్రంగా మారుతాయి. –అజారయ్య, న్యూట్రీషనిస్టు (వెల్‌ఫిట్– వెల్‌నెస్ కోచ్)

సికింద్రాబాద్: లష్కర్ వీరుడెవరో ?



ఓ రెండు పార్టీలకు ఈ నియోజకవర్గం నుంచి గెలిస్తే కేంద్రమంత్రి పదవి గ్యారంటీ అనే అభిప్రాయాలున్నాయి. మూడు పార్టీల నుంచి ముగ్గురు 'సిట్టింగ్'లు పోటీలో ఉండటం విశేషం. కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన దానం నాగేందర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి కేంద్రమంత్రి పదవిలో ఉన్న సిట్టింగ్ ఎంపీ కిషన్‌రెడ్డి బరిలో నిలిచారు. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావు బీఆర్‌ఎస్ తరఫున ప్రస్తుతం ఎంపీగా పోటీ చేస్తున్నారు. నాగేందర్, పద్మారావు రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన వారే. నగర రాజకీయాల్లో సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు బస్తీల్లోని ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్నవారు. దేశవ్యాప్తంగా బీజేపీ గాలి వీస్తుందనే ప్రచారం సాగుతున్న తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలో ఈ నియోజకవర్గంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.

నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక ప్రచార పర్వం ఊపందుకోనుంది. గ్రేటర్ పరిధిలోకి వచ్చే నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈసారి పోటీ చేస్తున్న వారిలో మెజారిటీ అభ్యర్థులు సామాన్యులు కారు. హేమాహేమీలు. ఒకరికి మించి ఒకరికి ఘనమైన రాజకీయ చరిత్ర ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్ని ఎవరికి వారు సవాల్‌గా తీసుకుంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల ఫలితం నాలుగు నెలల పాలనకు రెఫరెండమ్ కానుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పాగా వేసేందుకు వీటిని 'ఎంట్రన్స్'గా భావిస్తోంది. ఇక బీఆర్‌ఎస్.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ అభ్యర్థులు గ్రేటర్ పరిధిలోకొచ్చే అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధిక స్థానాల్లో, భారీ మెజార్టీలతో గెలిచారు. కాంగ్రెస్ పాలన గారడీలతో సాగుతోందని, దాని మెడలు వంచాలంటే మళ్లీ తమనే గెలిపించాలని కోరుతోంది. ఇప్పటి వరకు పాతబస్తీలో ఎదురే లేదనుకున్న ఎంఐఎం పరిస్థితి గతంలోలా లేదు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీల టాప్ నేతలు ఇప్పటికే ప్రచారంలో పాల్గొంటున్నారు. రాబోయే రోజుల్లో మరింత విస్తృతంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్: పాతబస్తీలో కొత్త చిత్రం



పాతబస్తీ పరిధిలోకొచ్చే హైదరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒకే పార్టీ గెలుస్తూ వస్తుండటంతో దాని గురించి ఒకే అభిప్రాయం ఉండేది. ఎంఐఎంను సైతం ఢీకొనే పరిస్థితులు వస్తాయనేందుకు ఈ ఎన్నికలు శ్రీకారం చుడుతున్నాయి. ఎంఐఎం నుంచి బరిలో ఉన్న అసదుద్దీన్ ఒవైసీ భారీ విజయాన్ని ఎవరూ మార్చలేరనే అభిప్రాయం నుంచి మెజార్టీ తగ్గగలదని వినిపిస్తోంది. అందుకు కారణం బీజేపీ నుంచి పోటీ చేస్తున్న మాధవీలత ఫైర్‌బ్రాండ్‌గా దూసుకొచ్చారు. పదునైన వాక్బాణాలతోనూ, రామ బాణాన్ని ఎక్కుపెడుతున్న హావభావాలతోనూ పాతబస్తీ ఎన్నికల దృశ్యాన్నే మార్చివేశారు. గతంలో ఎంఐఎంకు పోటీగా ఎంబీటీ కూడా పోటీలో ఉండేది. ఈసారి ఎంబీటీ పోటీనుంచి వైదొలగడం మాధవీలత కెపాసిటీకి నిదర్శనమనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. వరుస విజయాలతో అప్రతిహతంగా జైత్రయాత్ర కొనసాగిస్తున్న ఎంఐఎం గతంలో ప్రచారంపై పెద్దగా దృష్టి సారించేది కాదు. ఈసారి మాత్రం సోషల్ మీడియా, యూట్యూబ్‌ల ద్వారానూ విస్తృత ప్రచార కార్యక్రమాలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం ఆ పార్టీ అభ్యర్థికి కలిసి వచ్చే అంశం. కేసీఆర్ పథకాలు పొందినవారు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపవచ్చని భావిస్తున్నారు. అన్ని వర్గాల ఓటర్ల మద్దతుతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ వలీవుల్లా సమీర్ ధీమాగా ఉన్నారు. ఈసారి పాతబస్తీ ఓటర్లు సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ వైపే మొగ్గుచూపడం ఖాయమని ఆయన భావిస్తున్నారు. ఇక బీఆర్‌ఎస్ విషయానికొస్తే.. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. ఓటర్లు బీఆర్‌ఎస్ వైపే చూస్తున్నారని ఆ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ భరోసా వ్యక్తం చేస్తున్నారు.

- గ్రేటర్ బరిలో హేమాహేమీలు
- అభ్యర్థులందరూ ఉద్దండులే
- దూకుడు పెరిగిన ప్రచారం
- సుడిగాలి పర్యటనలకు శ్రీకారం



- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు
- గెలుపే ధ్యేయంగా వ్యూహ ప్రతి వ్యూహాలు

ఎవరో ఆ నలుగురు?

చేవెళ్ల: గెలిచేదెవరో?



హైదరాబాద్‌లో కలిసి ఉన్న మూడు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన మూడు స్థానాలూ ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోవే. దీంతో లోక్‌సభలోనూ గెలుస్తామనే ధీమా ఆ పార్టీ నేతలకుంది. బీఆర్‌ఎస్ నుంచి ఈ నియోజకవర్గ ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి.. పార్టీ మారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి బరిలో దిగిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో బీఆర్‌ఎస్ నుంచి ఓసారి ఎంపీగా పని చేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కు సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా, తెలంగాణ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్రంలో టీడీపీ జెండా ఎత్తేయడంతో బీఆర్‌ఎస్‌లో చేరి పోటీ చేస్తున్నారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ ఉద్దండులైన వారు పోటీలో ఉండటంతో గ్రేటర్‌లో పోటీ టఫ్‌ఫైట్‌గా ఉంటుందనే అభిప్రాయాలున్నాయి.

మల్కాజిగిరి: ఎవరిదో?



ఇక్కడ గెలిచే వారి భవిష్యత్ ఉజ్వలంగా వెలుగుతుందనే రికార్డు ఈ నియోజకవర్గానికి ఉంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతారెడ్డి మూడు పర్యాయాలు జెడ్పీ చైర్‌పర్సన్‌గా గెలిచారు. ఆమె భర్త మహేందర్‌రెడ్డి గతంలో మంత్రిగా పని చేశారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ గురించి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. కేసీఆర్ వైఖరిని ఎండగట్టి బయటికి వచ్చి బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో ఆర్థికం సహా వివిధ శాఖల మంత్రిగానూ పనిచేశారు. ఎంతోకాలంగా కాంగ్రెస్‌లో ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ టికెట్ ఆశించి అది దక్కకపోవడంతో బీఆర్‌ఎస్‌లో చేరిన రాగిడి లక్ష్మారెడ్డి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు పార్టీ బలం ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

వెల్‌కం సార్..


ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎస్ శాంతికుమారి

సనత్‌నగర్: నగర పర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కడ్‌కు శుక్రవారం సాయంత్రం బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. ఆయనకు గవర్నర్ రాధాకృష్ణన్, మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

అనుజ్ఞకు సీఎం అభినందన



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాధానగర్‌కు చెందిన అడ్వకేట్ సోమిశెట్టి రవికాంత్ కుమార్తె అనుజ్ఞ ఇంటర్మీడియట్ ఎంపీసీ రెండో సంవత్సరంలో 993 మార్కులతో టాపర్‌గా నిలిచిన అనుజ్ఞను శుక్రవారం సీఎం రేవంత్ తన కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు.

'ఎర్లీ బర్డ్'కు నాలుగు రోజులే..

సాక్షి, సిటీబ్యూరో: ఆస్తిపన్ను చెల్లింపులకు 5 శాతం రాయితీనిచ్చే 'ఎర్లీబర్డ్' పథకానికి ఈ నెల 30వ తేదీ వరకే గడువు ఉన్నందున త్వరగా ఆస్తిపన్ను చెల్లించి సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఆస్తిపన్నును ఆన్‌లైన్, సిటిజెన్ సర్వీస్ సెంటర్లు, ఈ– సేవ కేంద్రాలు, 'మైజీహెచ్‌ఎంసీ' యాప్ ద్వారా చెల్లించవచ్చని.. జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలోని సిటిజెన్ సర్వీస్ సెంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. ఇంటివద్దకు వచ్చే బిల్‌కలెక్టర్లకు కూడా నేరుగా ఆస్తిపన్ను చెల్లించి, రాయితీతో కూడిన రసీదులను పొందాలన్నారు. ఎక్కువ ఆస్తిపన్ను ఉండే ఐటీ కంపెనీలు, మల్టీలెవెల్‌మాల్స్, స్టార్ హోటల్స్, ఇతరత్రా వ్యాపార సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

124 తిరస్కరణ.. 168 ఆమోదం

ముగిసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో పరిధిలోని నాలుగు లోక్‌సభ స్థానాలకు దాఖలైన నామినేషన్లలో సుమారు 124 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాలకు మొత్తం 292 నామినేషన్లను దాఖలు కాగా.. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఒక్కో నామినేషన్‌ను పరిశీలించి వివరాలు, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్న 168 నామినేషన్లను ఆమోదించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

లోక్‌సభ	అభ్యర్థులు	తిరస్కరణ	ఆమోదం
హైదరాబాద్	57	19	38
సికింద్రాబాద్	57	11	46
చేవెళ్ల	64	17	47
మల్కాజిగిరి	114	77	37

బ్లాక్‌లో ఐపీఎల్ టికెట్ల విక్రయం

ఇద్దరు నిందితుల అరెస్టు

రాంగోపాల్‌పేట్: ఐపీఎల్ టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న ఇద్దరిని ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేసే చిత్తూరు రమణ, హైదరాబాద్‌లో డిజిటల్ మార్కెటింగ్ చేసే శామ్యూల్ సుశీల్ క్రికెట్ అభిమానులు. గతంలో జరిగిన వన్డే మ్యాచ్‌ల సందర్భంగా వాట్సాప్ గ్రూపుల్లో వీరిద్దరూ స్నేహితులయ్యారు. ఇటీవల జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా టికెట్లకు డిమాండ్ ఏర్పడటంతో టికెట్లను బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసికోవాలని పథకం వేశారు. ఒక్కో గ్రూపులో వెయ్యి మందికి పైగా సభ్యులుండే అనేక వాట్సాప్ గ్రూపుల్లో వీరిద్దరు ఉన్నారు. ఆ గ్రూపుల్లో టికెట్ల గురించి చర్చ నడుస్తుండగా ఎవరి వద్దయినా టికెట్లు ఉన్నాయా? అని రమణ ఆరా తీసి వారి వద్ద ఉన్న టికెట్లను మెయిల్ ద్వారా శామ్యూల్ సుశీల్‌కు పంపించే వాడు. శామ్యూల్ వాటికి ఉండే క్యూర్‌కోడ్ ద్వారా హైదరాబాద్‌లో రిడీమ్ చేస్తాడు. గ్రూపుల్లో ఉండే ఇతరుల మెయిల్ ఐడీ, చిరునామాల ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఎక్కువ మొత్తంలో టికెట్లను సేకరించే వారు. ఇద్దరు కలిసి ఈ టికెట్లను సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజ్ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను వీరు విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు రమణ గతంలో వరల్డ్ కప్ సమయంలోనూ టికెట్లు విక్రయిస్తూ చెన్నై పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుల నుంచి 101 ఐపీఎల్ టికెట్లు, 2 మొబైల్ ఫోన్లు, రూ.5.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐపీఎల్ టికెట్లు

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను సాధారణ పరిశీలకులు పీఐ శ్రీవిద్య పరిశీలించారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నిజాం కళాశాల, కోఠిలోని మహిళా యూనివర్సిటీల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ ఫయాజ్, హైదరాబాద్ ఆర్డీఓ కే. మహిపాల్ రెడ్డి, ఏఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చు

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని హైదరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా పిఐ శ్రీవిద్యను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదులను జనరల్ అబ్జర్వర్ ను సెల్ నెంబర్ 91543 42023 ద్వారా సంప్రదించవచ్చన్నారు. అదే విధంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12,సిటీ మేనేజర్స్ ట్రైనింగ్ సెంటర్, 3వ ఫ్లోర్, హైదరాబాద్ ఉదయం 8.30 నుండి 9.30 గంటల మధ్య నేరుగా కలిసి ఫిర్యాదులు, సూచనలు అందజేయవచ్చని సూచించారు.

కారు ఢీకొని ఏఎస్ఐకి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: కారు ఢీకొని బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ తీవ్రంగా గాయపడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ ట్రాఫిక్ ఏఎస్ఐ ఎం.డి. ఉస్మానల్‌ఖాన్ గురువారం రాత్రి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని సాగర్ సొసైటీ చౌరస్తాలో ముఖ్యమంత్రి బందోబస్తులో విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన మహేంద్రకారు ఏఎస్ఐని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం సమీపంలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

INTERVIEW

- బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు
- బీఆర్ఎస్ శ్రేణులే నా బలం-బలగం
- మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కాంగ్రెస్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు

మల్కాజిగిరిలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు చూపే ఆదరణను జీవిత కాలం గుర్తుంచుకుంటానని, ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. 25 ఏళ్లుగా పార్టీలకతీతంగా ప్రజల్లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తుంచుకుని ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారన్నారు. తన మంచితనమే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందన్నారు. బీఆర్ఎస్ తనకు కొత్త రాజకీయ జీవితాన్ని అందించిందని, అందుకు పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే రోజుల్లో పెద్ద ఎత్తున పాదయాత్రలు, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో రోడ్డు షోలు, ప్రత్యేక సభలను నిర్వహించి కాంగ్రెస్ 100 రోజుల పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తామన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలిట అంకుశమవుతానని, ప్రభుత్వ పనితీరును ఎండగట్టే అవకాశం తనకు కల్పించాలని మల్కాజిగిరి ఓటర్లను కోరారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాల్లో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. రాగిడి లక్ష్మారెడ్డి మనోభావాలు ఆయన మాటల్లోనే..

– ఉప్పల్



ప్రశ్న: లోక్‌సభ నియోజకవర్గంలో మీకున్న బలం..?

రాగిడి: అదృష్టవశాత్తు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎఎస్ ఎమ్మెల్యేలుగా ఉండటం నా బలం , బీఆర్ఎస్ శ్రేణులు అండగా ఉంటూ సైనికుల్లా పని చేస్తున్నారు.

ప్రశ్న: నియోజకవర్గాల్లో మీ బలహీనతలు?

రాగిడి: మల్కాజిగిరి పార్లమెంట్ అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్కసారి ప్రచారం ప్రారంభమైతే అప్పుడు ఎదుటి పార్టీలకు దడ పుడుతుంది. శత్రువునైనా చేరదీస్తా, అదే నా బలహీనత.

ప్రశ్న: ఏ పార్టీ అభ్యర్థి మీకు పోటీ..?

రాగిడి: కాంగ్రెస్, బీజేపీ రెండు ప్రధాన పార్టీలైనా.. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఇక్కడి ప్రజలు నావైపు, నా పార్టీ వైపు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదు. బీజేపీ అభ్యర్థితోనే ప్రధానంగా పోటీ ఉంటుంది.

ప్రశ్న: మీ ప్రచారాస్త్రాలు ఏమిటి..?

రాగిడి: కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులే మా ప్రచార అస్త్రాలు. ఆరు గ్యారంటీలకు ఆదిలోనే చరమగీతం పాడిన రేవంత్ ప్రభుత్వం పనితీరే మా ప్రచారం అస్త్రం. పథకాల అమలులో జాప్యంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు, గ్రామాల్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాం. రోడ్లు బాగు చేశాం. తాగునీరు అందించాం. ఫ్లైఓవర్‌లు నిర్మించాం. ఉప్పల్‌లో శిల్పారామం నిర్మించాం. ఉప్పల్ చౌరస్తాలో ప్రమాదాలను నివారించడానికి స్కైవాక్ వంతెన ఏర్పాటు చేశాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా నిలిపాం. ఇవన్నీ మాకు కలిసివచ్చే అంశాలు..

ప్రశ్న: మల్కాజిగిరిలో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదా..?

రాగిడి: రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓడిపోతే మల్కాజిగిరి ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారు. మోస పూరిత మాటలతో ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాల్లో అడుగు పెట్టలేదు. మల్కాజిగిరి ఆయనకు జీవం పోసింది. అయితే ఆయన ఇక్కడి ప్రజల గుండెల మీద తన్ని వెళ్లాడు. ఏ ఒక్క సమస్యకు పరిష్కారం చూపలేదు. నిధులను మురగబెట్టి చోద్యం చూశాడే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదు. తిరిగి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో చెప్పాలి. కాంగ్రెస్, బీజేపీలు చాకబారు ఎత్తుగడలతో బీఆర్ఎస్ నేతలకు గాలం వేస్తున్నారు. బీజేపీ దేశానికి ఆర్థిక నేరాలకు పాల్పడ్డవారిని, ప్రభుత్వ భూములు కబ్జా చేసుకున్న వారిని, పేదల భూములను లాక్కున్న వారిని స్వలాభాల కోసం పార్టీలో చేర్చుకుని క్లీన్ చిట్ ఇస్తోంది.

మే 2 నుంచి సాంస్కృతిక శిక్షణ శిబిరం

బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన సాంస్కృతిక విభాగం 'సుమేధస' (సంస్కృతి ద్వారా మేధస్సు) ఆధ్వర్యంలో మే 2 నుంచి 25 వరకు సాంస్కృతిక శిక్షణ శిబిరం–2024 (కల్చర్ క్యాంప్) నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాంస్కృతిక శిక్షణ శిబిరం పోస్టర్ విడుదల చేశారు. వేసవి సెలవుల్లో పిల్లల సర్వతోముఖ వికాసం (శారీరక, మానసిక, ఆధ్యాత్మిక) కోసం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ సంగీతం, జానపద నృత్యాలు, పూల అలంకరణలు, వక్తృత్వం, పెయింటింగ్, స్కెచింగ్, కథలు చెప్పడం తదితర భారతీయ సంప్రదాయ కళల్లోనే కాకుండా భగవద్గీత శ్లోక పఠనం, మంత్ర ధ్యానం, యోగా తదితర అంశాల్లోనూ చిన్నారులకు శిక్షణ ఇస్తామన్నారు. 21 రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో పిల్లల కోసం జగన్నాథ రథయాత్ర, ఒక ఆధ్యాత్మిక తీర్థయాత్ర, మెగా టాలెంట్స్ డే ద్వారా పిల్లలు తాము నేర్చుకున్న అంశాలను, సృజనాత్మకతను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు, యువతలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు, ఆచార వ్యవహారాలను పెంపొందించే లక్ష్యంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ చాలా ఏళ్లుగా సాంస్కృతిక శిబిరాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 2.45 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. 6 నుంచి 16 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనేందుకు అర్హులన్నారు. శిక్షణ శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శిబిరం పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్: 81436 5518లో సంప్రదించాలన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

సాంస్కృతిక శిక్షణ శిబిరం నిర్వహించే ప్రాంతాలివీ...

బంజారాహిల్స్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్, కోకాపేట్ హరేకృష్ణ హెరిటేజ్ టవర్, సంగారెడ్డి కంది హరేకృష్ణ కల్చరల్ సెంటర్, కాచిగూడ వైశ్య హాస్టల్, కొల్లూరు మాగ్యాస్ మెజెస్టిక్ మెడోస్, కోకాపేట్ రాజపుష్ప అట్రియాగేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో శిబిరాలు కొనసాగుతాయని ఆయన వివరించారు.

రూ.25.5 లక్షల నగదు పట్టివేత



కూకట్‌పల్లి: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును సైబరాబాద్ ఎస్‌ఓటీ బాలానగర్ టీమ్, కేపీహెచ్‌బీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. శుక్రవారం జేఎన్‌టీయూ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు అటుగా వచ్చిన రైటర్ పీవీఎస్ క్యాష్ లాజిస్టిక్స్ వాహనాన్ని ఆపి సోదా చేశారు. వాహనంలో రూ. 25.50ల నగదును గుర్తించిన పోలీసులు అందుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపారు.

అబిడ్స్‌లో రూ.49.75 లక్షలు..

అబిడ్స్: అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల్లో తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. హనుమాన్ టెక్డీ ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి సోదా చేసిన పోలీసులు వారి నుంచి రూ.49.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అందజేసినట్లు అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు.

ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్ రద్దు..

సనత్‌నగర్: బేగంపేటలోని ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బార్‌లో యువతులు అశ్లీల నృత్యాలు చేయడం, యువకులను రెచ్చగొట్టడం , డీజే శబ్దాల హోరులో మద్యం సేవించి చిందులు వేయడం తదితర అనైతిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ నెల 3న నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు జరిపిన విషయం విదితమే. ఆ సమయంలో బార్ నిర్వాహకులతో పాటు మొత్తం 107 మందిని అరెస్టు చేశారు. వీరిలో 30 మంది యువతులు కాగా మరో 60 మంది యువకులు, 17 మంది నిర్వాహకులు ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసును బేగంపేట పోలీసులకు అప్పగించడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బార్‌లో అశ్లీల కార్యకలాపాలు, నిబంధనలకు విరుద్ధంగా బార్‌ను నిర్వహించడంతో ఆధారాలతో సహా ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఊర్వశి బార్‌ను మూసివేసి లైసెన్స్‌ను రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.150 పంపి..రూ.2.94 లక్షలు లాగేశారు

గూగుల్ రివ్యూల పేరుతో టీచర్‌కు టోకరా

హిమాయత్‌నగర్: పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో గూగుల్ రివ్యూలు ఇస్తూ ఇంటి వద్దనే ఉంటూ డబ్బు సంపాదించవచ్చని నమ్మించి ఓ ప్రైవేట్ టీచర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ప్రైవేట్ టీచర్‌కు పార్ట్ టైం జాబ్ పేరుతో రోజువారీ టాస్క్‌లు పూర్తి చేస్తూ డబ్బు సంపాదించవచ్చునని వాట్సాప్ మెసేజ్ వచ్చింది. గూగుల్‌లో రివ్యూలు ఇస్తే ఒక్కోదానికి రూ.50 ఇస్తామని సైబర్‌నేరగాళ్లు బాధితుడికి గూగుల్ లింక్‌ను షేర్ చేశారు. మూడు టాస్క్‌లను పూర్తి చేసినందుకు గాను అతడికి రూ.150 చెల్లించి నమ్మకం కలిగించారు. అనంతరం అతడికి మరో లింక్ పంపగా, దానిని ఓపెన్ చేయగానే బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.2.94 లక్షలు కాజేశారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

మహిళలను వేధిస్తున్న పోకిరీలకు జైలు

హిమాయత్‌నగర్: నగరంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో మహిళలను వేధిస్తూ, అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఏడుగురు పోకిరీలకు 10వ ప్రత్యేక న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. శుక్రవారం షీటీమ్స్ పోలీసులు వివరాలు వెల్లడించారు. బస్‌స్టాప్‌లు, పార్కులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో మహిళలను వేధిస్తున్న ఏడుగురు పోకిరీలకు అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారిలో ఒకరికి ఏడు రోజుల, మరో వ్యక్తికి మూడు రోజులు, మిగతా వారికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించినట్లు తెలిపారు. వేధింపులకు గురైన బాధితులు షీ టీమ్స్ హెల్ప్‌లైన్ నం: 040 2785 2355, వాట్సాప్ ద్వారా 94906 16555లో సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్ టు సూడాన్!



- సముద్రమార్గం ద్వారా అక్రమంగా సెల్‌ఫోన్ల తరలింపు
- జగదీష్ మార్కెట్ కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న దందా
- తక్కువ ధరకే బ్రాండెడ్ ఫోన్లు, విడిభాగాల విక్రయం
- ఫోన్లు కొట్టేసేందుకు జీతాలిస్తూ నిరుద్యోగుల నియామకం
- 17 మంది కూడిన అంతర్జాతీయ ముఠా అరెస్టు
- రూ.1.75 కోట్ల విలువ చేసే 703 ఫోన్లు స్వాధీనం
- సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఫోన్లను దొంగిలించడమే ఉద్యోగంగా నిరుద్యోగ యువతను నియమించుకుని నగరంలో మొబైల్స్‌ను కొట్టేస్తున్నారు. ఆపై వీటిని జగదీష్ మార్కెట్ కేంద్రంగా సముద్ర మార్గం గుండా అక్రమంగా సూడాన్ దేశానికి తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఈ దందా సాగిస్తున్న 17 మంది సభ్యుల ముఠాను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 12 మంది స్థానికులతో పాటు ఐదుగురు సుడాన్ దేశీయులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.75 కోట్ల విలువ చేసే 703 ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు.

- గత కొద్ది రోజులుగా నగరంలో మొబైల్ దొంగతనాల కేసులు ఎక్కువయ్యాయి. ఈ నేరాల సరళిని విశ్లేషించగా.. స్నాచర్లు ఫోన్లను దొంగిలించేందుకు, వీటిని చట్టవిరుద్ధంగా ఇతర దేశాలకు తరలించేందుకు జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులతో కూడిన నెట్‌వర్క్ ముఠాగా ఏర్పడినట్లు తేలింది. కొట్టేసిన సెల్‌ఫోన్ల నుంచి మొబైల్ స్క్రీన్లు, కెమెరాలు, స్పీకర్లు ఇతర విడిభాగాలను వేరు చేసి వాటిని కంపెనీ నిర్ణయించిన రేట్ల కంటే తక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ విడిభాగాలను పాడైపోయిన సెల్‌ఫోన్లకు వినియోగించి కొత్త ఫోన్లుగా మార్కెట్‌లో విక్రయించి రెట్టింపు సొమ్ము చేసుకుంటున్నారు.
- డెకోరేషన్ పని చేసే తాడ్‌బన్‌కు చెందిన మహ్మద్ ముజామ్మిల్ అలియాస్ ముజ్జు, జహనుమా ప్రాంతానికి చెందిన లారీ మెకానిక్ సయ్యద్ అబ్రార్ ఇద్దరు స్నేహితులు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన వీరు అర్ధరాత్రుల్లో రోడ్ల మీద తిరుగుతూ నిర్మానుష్య ప్రాంతాల్లో వెళుతున్న బాటసారులను భయభ్రాంతులకు గురి చేసి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. చోరీ చేసి పారిపోయేందుకు వీలుగా ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో బజాజ్ పల్సర్ బైక్‌ను దొంగిలించారు. దీనిపై తిరుగుతూ బండ్లగూడ, ఫలక్‌నుమా, బహదూర్‌పుర, మంగళ్‌హట్, హయత్‌నగర్ ఠాణాల పరిధిలో సెల్‌ఫోన్లను చోరీలకు పాల్పడ్డారు.

థర్మల్ బాక్సుల్లో సూడాన్‌కు...

- సూడాన్ దేశానికి చెందిన ఖలీద్ అబ్దీల్‌భాగీ అహ్మద్ అల్బద్వీ, అబ్దలేలా అహ్మద్ ఉస్మాన్ బాబికర్, ఐమ్నీ మహ్మద్ సలీహ్ అబ్దల్లా, అనస్ సిద్దీఖ్ అబ్దేల్‌గాదర్ అహ్మద్, ఒమర్ అబ్దుల్లా ఎల్తాయెబ్ మహ్మద్‌లు చదువు, వ్యాపారం పేరుతో నగరంలో అక్రమంగా నివాసం ఉంటున్నారు. వీరిలో అలద్వీకి మాసబ్‌ట్యాంక్‌లో సెల్‌ఫోన్ దుకాణం ఉంది. ఇతను జగదీష్ మార్కెట్‌లో ఫోన్ల వ్యాపారి మహ్మద్ షఫీ అలియాస్ బబ్లూ నుంచి మొబైల్స్ కొనుగోలు చేసేవాడు. ఆపై వీటిని సీ ఫుడ్ ను తరలించే థర్మల్ బాక్సులలో భద్రపరిచి, సముద్ర మార్గం ద్వారా అక్రమంగా సూడాన్‌కు తరలిస్తున్నాడు.

ఫోన్లు చోరీ చేయడమే ఉద్యోగం..

ఫోన్లను చోరీ చేయడమే పనిగా నిరుద్యోగ యువతకు జీతాలు ఇచ్చి మొబైల్ స్నాచింగ్‌లు చేయిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత వీరు నిర్మానుష్య ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్తున్న వారి నుంచి, రద్దీ ప్రాంతాల్లో మాటల్లో పెట్టి దృష్టి మరల్చిఫోన్లు, జేబులోని నగదును దొంగిలిస్తున్నారు. ఇప్పటివరకు ఈ ముఠాపై పలు ఠాణాల్లో కేసులున్నాయి. ఈ మేరకు నిఘా పెట్టిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ముజామ్మిల్, సయ్యద్ అబ్రార్, సయ్యద్ సలీం, పఠాన్ రబ్బానీ ఖాన్, మహ్మద్ అథర్, మహ్మద్ జాకీర్, షేక్ అజార్, మహ్మద్ ఖాజా నిజాముద్దీన్, సయ్యద్ లయిఖ్, షేక్ అజర్ మొయినుద్దీన్, మహ్మద్ షఫీ, జే యలమందా రెడ్డి, సూడాన్ దేశానికి ఐదుగురిని అరెస్టు చేశారు.

మేధావులు మౌనం వీడాలి: జానారెడ్డి


జానారెడ్డిని కలిసిన వివిధ రంగాల ప్రతినిధులు

బంజారాహిల్స్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మేధావులు మౌనం వీడి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. జానారెడ్డి నివాసంలో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ పంచాయతీరాజ్ ఎం.ఎ. కరీం, సీనియర్ జర్నలిస్ట్ కోటగిరి దైవధీనంతో పాటు స్వచ్ఛంద సంస్థల నాయకులు, విద్యావంతులు, అడ్వకేట్లు, పాత్రికేయులు, ఆర్‌టీఐ రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ... దేశంలో సుపరిపాలన కోసం యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టంతో పాటు లోక్‌పాల్, ఫోక్సో, గృహహింస, వయోవృద్ధుల సంక్షేమం, జాతీయ ఉపాధి హామీ, విద్యాహక్కు తదితర చట్టాలను తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆయా చట్టాలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఆ చట్టాలను రక్షించడానికి మేధావులు, విద్యావంతులు, ఆర్టీఐ కార్యకర్తలు, క్రియాశీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛంద సంస్థ నాయకులు వై.కృష్ణారెడ్డి, ఎం.ఎ.కుర్షీద్ పాషా, ముకుందరెడ్డి, హేమలత, బైరు సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దానంను భారీ మెజార్టీతో గెలిపించాలి


బంజారాహిల్స్ రోడ్ నెం.7 మసీదు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత రాములు చౌహాన్

వెంకటేశ్వరకాలనీ: సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ వెంకటేశ్వరకాలనీ డివిజన్ సీనియర్ నేత, కాంగ్రెస్ నాయకుడు రాములు చౌహాన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని మసీదుల వద్ద శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు అభ్యర్థి దానం నాగేందర్ ఆదేశాలతో ముస్లిం కీలక నేతలతో భేటీ కావడంతో పాటు కాంగ్రెస్ పార్టీ పథకాల గురించి వివరించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దానంను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3 మసీదు, దేవరకొండ బస్తీ మసీదు, జహీరానగర్, బంజారాహిల్స్ రోడ్ నెం.10, నందినగర్ మసీదుల వద్ద నేతలు ప్రచారం నిర్వహించారు. నేతలు జావెద్, వసీం, షఫి, ఆరిఫ్, రఫిక్, జహంగీర్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను బీసీ-ఏలో కలుపుతామన్న

సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం


మాట్లాడుతున్న సంఘం సలహాదారు ప్రొఫెసర్ బాగయ్య

హిమాయత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట ఎన్నికల ప్రచార సభలో బీసీ-డిలో ఉన్న ముదిరాజులను బీసీ-ఏలో కలుపుతామని చేసిన వాఖ్యలను తెలంగాణ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సలహాదారు ప్రొఫెసర్ డాక్టర్ ఎం.బాగయ్య మాట్లాడుతూ... బీసీ-ఏలోని 56 కులాలు అత్యంత వెనుకబడి ఉన్నాయన్నారు. కొన్ని కులాలకు భిక్షాటన చేస్తే తప్ప బతకలేని పరిస్థితి ఉందని అలాంటి కులాలలో రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన ముదిరాజులను బీసీ-ఏలో ఎలా కలుపుతారని ప్రశ్నించారు. బీసీడీలో 95 శాతం మంది ముదిరాజులు ధనవంతులుగా ఉన్నారని, అంతేకాకుండా ఎంపీ, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ జడ్పీ చైర్మన్లు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, కాంట్రాక్టర్లుగా ఉన్నారని గుర్తు చేశారు. బీసీ-ఏలో ముదిరాజులను చేర్చే ఆలోచన ఉంటే బీసీ ఏ లోని 56 కులాలను ఎస్సీ జాబితాలో చేర్చి ఇతర కులాలను బీసీ-ఏ లో చేర్చాలన్నారు. ముదిరాజులను బీసీ-ఏలో చేర్చితే బీసీ-ఏలోని 56 కులాల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. త్వరలోనే హైదరాబాద్ వేదికగా 56 కులాలతో భారీ నిరసన చేపడుతామన్నారు. సమావేశంలో బీసీ-ఏలోని వివిధ కుల సంఘాల నాయకులు డాక్టర్ రాపోలు సుదర్శన్, బాలరాజ్, దేవరకొండ నాగరాజు, గడప శ్రీహరి, నరహరి, రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్ దాలియే...


శ్రీరాంనగర్ మసీదు ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని శుక్రవారం ప్రార్థన మందిరాల వద్ద కార్పొరేటర్లు ముస్లింలను అభ్యర్థించారు. రహమత్‌నగర్, శ్రీరాంనగర్‌ల్లోని మసీదుల వద్ద కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బోరబండ పలు మసీదు వద్ద కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌లు కరపత్రాలు అందించి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 వద్ద కాంగ్రెస్ నాయకులు జాఫర్‌హుస్సేన్, గ్యార నాగరాజు ప్రచారం చేస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి రిమాండ్

కాచిగూడ: ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసగించిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఏడుకొండలు (34) ఇస్రోలో సీనియర్ టెన్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇస్రోలో ఉద్యోగం ఇప్పిస్తామని నింబోలిఅడ్డ లో ఉండే గుంటూరుకు చెందిన కృష్ణారావు వద్ద నుంచి రూ. 20 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

శ్మశానవాటిక కోసం ముస్లింల ఆందోళన


సంజయనగర్‌లోని ఖబరస్థాన్

- శవాల ఖననానికి స్థలాభావం
- ఆందోళనలో వేలాదిమంది ముస్లింలు
- ఐదు ఏకరాల స్థలం.. నలభై ఏండ్లుగా ఖననం
- కొత్త స్థలాన్ని కేటాయించాలని కోరుతున్న ముస్లింలు

రహమత్‌నగర్: ఖబరస్థాన్‌లో ఖననం చేసేందుకు స్థలం లేదని, వేరే చోట స్థలం కేటాయించాలని ముస్లిం ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలోనే ఇటీవల ర్యాలీని సైతం నిర్వహించారు. వివరాలివీ... దివంగత పీజేఆర్ హయాంలో ఖబరస్థాన్ కోసం సంజయ్‌నగర్ ప్రధాన రహదారి పక్కన దాదాపు 5 ఎకరాలు స్థలం కేటాయించారు. అప్పట్లో బస్తీలు తక్కువ ఉండటంతో జనాభా అంతగా ఉండుది కాదు. ఈ కారణంగా ఎలాంటి ఇబ్బంది లేకదు. రానురాను జనాభా పెరిగి ఖననాల సంఖ్యలో పెరిగిపోయింది. ప్రస్తుతం ఈ ఖబరస్థాన్‌లో దాదాపు 13 బస్తీలకు చెందిన మృతులను ఖననం చేస్తున్నారు. అందరి ఖననాలకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు స్థలం కేటాయించాలని ఖబరస్థాన్ కమిటీ, బస్తీవాసులు పలు రాజకీయ పార్టీల నేతలకు విజ్ఞప్తి చేశారు. అయినా అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా మరో మారు దెక్కన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శుక్రవారం సంతకాలు సేకరించారు. దీంతో మరోమారు ఖబరాస్థాన్ స్థల సమస్య వెలుగులోకి వచ్చింది.

స్థలం కేటాయించాలి



రహమత్‌నగర్ ఖబరస్థాన్ సమాధులతో నిండి పో యింది. మరో ప్రాంతంలో స్థలం కేటాయించాలి. స్థలం సాధన కోసం ప్రతి ముస్లిం ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో రాజకీయ పార్టీల నాయకులు స్పందించాలి. కొంత ప్రాంతం ఖబరస్థాన్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– షేక్ అహ్మద్, ఖబరస్థాన్ ఇన్‌చార్జ్

3268 @ ఖైరతాబాద్‌లో పెరిగిన ఓటర్లు

- అనుబంధ జాబితాతో తాజా ఓటర్ల జాబితా విడుదల
- గత అసెంబ్లీ ఎన్నికల కంటే పెరిగిన ఓటర్లు


ఓటరు జాబితాలో పేరు పరిశీలిస్తున్న ఓటరు

బంజారాహిల్స్: పోలింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు వేసే దిశలో ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్ల నిండిన వారంతా ఓటరుగా నమోదయ్యేందుకు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గంలో అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకున్నారు. ఈ నెల 15వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

- నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో కొత్త 3468 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఫిబ్రవరి 8న విడుదల చేసిన ఓటరు తుది జాబితాలో 2,96,383 మంది ఉండగా తాజాగా ఈ నెల 25న విడుదల చేసిన ఓటరు తుది జాబితాలో 2,99,651 మంది ఉన్నారు.
- ఓటరు తుది జాబితా ప్రకారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో తాజా ఓటర్ల సంఖ్య 2,99,651 కాగా ఇందులో పురుషులు 1,55,352, మహిళలు 144265, ఇతరులు 34 మంది ఉన్నారు.
- నుబంధ జాబితాతో కూడిన తాజా ఓటరు జాబితాలో పెరిగిన ఓటర్లు 3268 మంది కాగా ఇందులో పురుషులు 1749, మహిళలు 1519 మంది ఉన్నారు.
- గతేడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,96,014 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 153968, మహిళలు 142011, ఇతరులు 35 మంది ఉన్నారు. ఆ తర్వాత అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక ఓటరు శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా తప్పొప్పుల సవరణకు అవకాశం కల్పించి మృతుల పేర్లను తొలగించారు.
- రెండు చోట్ల ఓటు ఉన్న వారిని కూడా తొలగించారు. ఆ తర్వాతనే డ్రాఫ్ట్ నోటిఫికేషన్, తుది జాబితా విడుదల చేశారు.
- పోలింగ్ శాతాన్ని ఇంకా పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వివిధ మార్గాల్లో అర్హులైన వారికి అవకాశాలు ఇస్తూ వచ్చింది. ఈ సారి ఈ అవకాశాలను చాలామంది సద్వినియోగం చేసుకున్నట్లుగా తాజా ఓటరు జాబితా నిరూపిస్తుంది.
- ప్రస్తుతం విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారమే మే 13న జరిగే సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు.
- కొత్తగా ఓటర్లుగా నమోదైన వారికి కూడా బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నారు.
- కొత్తగా ఓటు హక్కు పొందిన వారు సంబంధిత వెబ్‌సైట్‌కు వెళ్లి తమ ఓటరు గుర్తింపు కార్డు తీసుకునే సౌలభ్యం కూడా కల్పించారు.
- కొత్తగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరు లేకపోతే మాత్రం వారి దరఖాస్తులు పలు కారణాల వల్ల తిరస్కరించామనే విషయాన్ని గమనించాలని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ. 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 33, చామగడ్డ 37, మొరంగడ్డ 18, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 9, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేత



ఫిలింనగర్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం ఎన్నిక ఏజెంట్‌గా నియమితులైన జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నేత, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ దానంకు భారీ మెజార్టీ వచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

పెంపుడు కుక్కల దాడి: వ్యక్తికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని తరుముకొచ్చిన రెండు పెంపుడు కుక్కలు కరవడంతో తీవ్ర గాయాలపాలైన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివీ... రాజీవ్‌నగర్‌లో నివసించే పవన్‌కుమార్ సాయంత్రం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని జవహర్‌నగర్ నుంచి ఇందిరానగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా నిర్లక్ష్యంగా వదిలేసిన రెండు పెంపుడు కుక్కలు ఆయన వెంటపడి కరిచాయి. కుక్కల యజమాని నిర్లక్ష్యంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని, వాటిని ఇంట్లో కట్టేయకుండా రోడ్డు పైకి వదిలేశారని, గతంలో కూడా ఇవే కుక్కలు ఇద్దరు, ముగ్గురిని కరిచాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కుక్కల యజమానిపై ఐపీసీ సెక్షన్ 279 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క దాడిలో విద్యార్థికి గాయాలు

వెంగళరావునగర్: యజమాని నిర్లక్ష్యంతో హాస్టల్‌కు వెళ్లున్న విద్యార్థినిపై కుక్క దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... పల్నాడు జిల్లాకు చెందిన పి.రామలక్ష్మి వెంగళరావునగర్‌లోని హాస్టల్‌లో ఉంటూ సీఏ చదువుతోంది. 25వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంటకు స్టడీ సెంటర్ నుంచి హాస్టల్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో శాంతి స్వరూప అనే మహిళ తన కుక్కను రోడ్డు మీదకు వదిలేసింది. అది రామలక్ష్మిపై దాడి చేస్తున్నా యజమాని పట్టించుకోలేదు. విద్యార్థి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి వదిలించారు. ఇదేమని రామలక్ష్మి తండ్రి శ్రీనివాసరావు ప్రశ్నించగా నా ఇష్టం నాకుక్కను ఇలాగే వదులుతాను, మీ ఇష్టం వచ్చింది చేసుకో అంటూ బెదిరించింది. దాంతో కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లిన అనంతరం శ్రీనివాసరావు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'దళితుల సమస్యలను మేనిఫెస్టోల్లో చేర్చాలి'

లిబర్టీ: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలలో చేర్చి పరిష్కారానికి చర్యలు చూపాలని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.సదానందు కోరారు. అనేక సామాజిక సమస్యలతో పాటు అణచివేత, దోపిడీ గురవుతున్న దళితులకు జీవనస్థులు మార్చేందుకు అన్ని సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దళితుల సమస్యలను వివరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించే ఎన్నికల ప్రణాళికలలో దళిత బంధు పథకం అమలు, దళితులకు రుణ వసతి, దళితులకు భూ పంపిణీ, సంక్షేమ పథకాలు అమలు ఇందిరమ్మ ఇల్లు, కేటాయింపు భూమి సేద్యం చేసుకోవడానికి సబ్సిడీలో బోరుబావులు ఏర్పాటు ఎస్సీల కోసం గురుకుల ఏర్పాట్లు తదితర అంశాలను ఎన్నికల ప్రణాళికలు పెట్టాలని మహేష్‌గౌడ్‌కు విన్నవించారు. దళితుల సమస్యల పరిష్కారించినందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అన్ని సమస్యలను పరిష్కరిస్తామని దళితుల జీవనస్థితి గతులను మార్పు తేస్తామని మహేష్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

కళలు.. కళాకారులను ప్రోత్సహించాలి


అవార్డులు ప్రదానం చేస్తున్న డా.ఆదినారాయణ

లిబర్టీ: కళలతోపాటు కళాకారులను ప్రోత్సహించాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. కళా రంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వాలు ప్రోత్సహించి వెన్నుతట్టాలని కళాకారులకు అవార్డులు ఇచ్చి ఫౌండేషన్ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని విన్నవించారు. కూచిపూడి, భరతనాట్యం తదితర నాట్యాలపై మక్కువతో నేర్చుకొని ప్రతిభ కనబరుస్తున్న కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిచ్చి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

సిటీ నేచర్ చాలెంజ్ పేరుతో పోటీలు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖైరతాబాద్: ప్రకృతిని కాపాడే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలు సిటీ నేచర్ చాలెంజ్ పేరుతో పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం సిటీ నేచర్ చాలెంజ్ 2024లో భాగంగా ఖైరతాబాద్‌లోని లేక్‌వ్యూ పార్కులో కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి రఘువీర్, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొని అవగాహన కల్పించారు. మనమంతా ఉమ్మడి లక్ష్యంతో పనిచేసినప్పుడే ఏదైనా సాధించగలమని తెలిపారు. ఈ సందర్భంగా బయోడైవర్సిటీ యాప్‌ను ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా నేచర్‌లో ఉన్న ప్రాణులను, చెట్లను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా వాటిని పరిరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వాకర్లు ఉదయ్‌భాస్కర్, బాక్సర్ అశోక్, ధర్మరాజు, గోవింద్, సంజయ్, పరమేష్, శంకర్, అరుణ్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి


జగదీశ్వర్‌రావుకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి

- మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆయన అనుచరులు

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలని టీపీసీసీ కాంగ్రెస్ చేరికల కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్ దక్కలేదని బీఆర్ఎస్‌లో చేరిన ఈ నియోజకవర్గంకు చెందిన టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు, ప్రొటోకాల్ కమిటీ ఇన్‌చార్జీ సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆయన అనుచరులు రాపోలు నర్సింహ్మ, గజ్జెల సూర్యనారాయణ, సిరిపల్లి శంకర్, నవీన్, నర్సింగ్‌రావు, బాలకృష్ణ, చంద్రమౌళి, కిట్టు, జెల్ల దినేష్, ప్రవీణ్, రఘు, నర్సింహ్మగౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ చేరికల కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, కోదండరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు మోజార్టీ ఓట్లు వచ్చేలా ప్రతి ఒక్కరూ సైనికులుగా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరిన జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ... టికెట్ రాకపోవడంతో ఆవేశంతో కన్నతల్లి వంటి పార్టీని వీడటం జరిగిందన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు తిరిగి సొంత గూటికి రావడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జి.ఎస్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, వేణుగౌడ్, అంజయ్య, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దానంకు మాల సంఘాల జేఏసీ మద్దతు


మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ మద్దతు ప్రకటిస్తున్నట్లు చైర్మన్ చెరుకు రాంచందర్ తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. జేఏసీ వైస్ చైర్మన్ ఎస్.నాను తాలూకా అనిల్, బరిగెల వెంకటస్వామి, ఎడ్ల వెంకటేశ్వర్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అపోలో మెడ్‌స్కిల్స్ విద్యార్థులకు జాతీయ గుర్తింపు

లక్డీకాపూల్: అపోలో మెడ్‌స్కిల్స్‌లో శిక్షణ పొందిన తెలంగాణ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లకు అంతర్జాతీయ సర్టిఫికేషన్ లభించింది. హెల్త్‌కేర్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో అగ్రగామిగా ఉన్న అపోలో మెడ్ స్కిల్స్ లిమిటెడ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ఎన్‌హాన్స్‌మెంట్ ప్రోగ్రాం (స్టెప్) విజయవంతంగా అమలు చేయడంతో నర్సింగ్ విద్యలో మరోసారి బెంచ్‌మార్క్‌ను నెలకొల్పిందని ప్రిన్సిపాల్ ముప్పిడి రాజేశ్వరి, అకడమిక్ కోఆర్డినేటర్ మమత పేర్కొన్నారు. తమ వినూత్న స్టెప్ ప్రోగ్రామ్‌తో నర్సింగ్ ప్రమాణాలను ఎలివేట్ చేస్తుందన్నారు. ఆరోగ్య సంరక్షణలో నర్సులు పోషించే కీలక పాత్రరోగి సంరక్షణ, క్లినికల్ ఫలితాలపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతుందన్నారు.

విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులతో శ్రీశారద కళాశాల చైర్మన్ శ్రీదేవి

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులను సాధించడం సంతోషంగా ఉందని శ్రీ శారద మహిళా కళాశాల చైర్మన్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడ నాగార్జునగర్‌కాలనీలోని కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో మంచి ర్యాంకులను సాధించిన విద్యార్థినులను అభినందించి మెమొంటోలను అందజేసి సత్కరించారు. మహిళలు ఉత్తమ విద్యను అభ్యసించి దేశానికి ఖ్యాతిని తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్, అకడమిక్ డైరెక్టర్ పవన్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



రహమత్‌నగర్: చదువుకు పేదరికం అడ్డు కాదని, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బోరబండ డివిజన్‌కు చెందిన విద్యార్థినులు ముస్కాన్ ఉన్నీసా, మహ్మదీ, హర్షితలను ఆయన శుక్రవారం ఘనంగా సన్మానించారు. నరసింహ, మహేష్‌గౌడ్, కరీమ్ పాల్గొన్నారు.

ఫోన్ పే చేస్తానని నగదు తీసుకుని మోసం

వెంగళరావునగర్: ఫోన్ పే చేస్తానంటూ నగదు తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సనత్‌నగర్‌కు చెందిన దాసరి సురేష్ బాబు ప్రైవేటు ఆఫీసులో అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25న తన అధికారి సత్యనారాయణతో కలిసి ఎస్‌బీఐ ఏటీఎంకు వచ్చాడు. సత్యనారాయణ కారుల ఉండగా సురేష్‌బాబు రూ. 47 వేలు డిపాజిట్ చేయడానికి ఏటీఎం దగ్గరకు వచ్చాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనకు నగదు ఇస్తే తాను ఫోన్ పే చేస్తానన్నాడు. ముందుగా రూ. 15 వేలు ఇచ్చాడు. అనంతరం రూ. 20 వేలు తీసుకున్నాడు. అయితే వాటిని ఫోన్ పే చేయలేదు. సురేష్‌బాబు మరో రూ. 27 వేలు డిపాజిట్ చేసి సత్యనారాయణ వద్దకు వచ్చి రూ. 20 గురించి అడగ్గా వాటిని రాలేదన్నాడు. ఆ నగదు తీసుకున్న వ్యక్తి కోసం వెదకగా కనిపించలేదు. దాంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి?

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... కొడంగల్ సమీపంలోని దామరగిద్ద మండలం లోపర్తి గ్రామానికి చెందిన శాంతయ్య దినసరి కూలీ. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నెం-51 గురుబ్రహ్మనగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య, పిల్లలు తమ సొంతగ్రామానికి వెళ్లగా శాంతయ్య తన తండ్రితో కలిసి నాలుగురోజుల క్రితం దర్గా వద్ద కల్లు దుకాణం వెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలిసి కల్లు తాగారు. మత్తులో శాంతయ్య ఎక్కడికో వెళ్లి రెండురోజుల తర్వాత బస్తీకి వచ్చాడు. ఎక్కడికి వెళ్లావంటూ తమ్ముడు చిన్నమాణిక్యంతో చిన్న గొడవ జరిగింది. ఈ క్రమంలో శాంతయ్య కిందపడి స్పృహతప్పి పడిపోయాడు. బస్తీవాసులు అతడిని అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని సొంత ఊరికి తీసుకెళ్లారు. శాంతయ్య మృతికి అనేక అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

రసాయనాలతో పండ్లు మాగపెడుతున్న ఇద్దరి అరెస్టు

రహమత్‌నగర్: రసాయనాలతో పండ్లను మాగబెడుతూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం అదుపులోకి బోరబండ పోలీసులకు అప్పజెప్పారు. వివరాలివీ... ఎర్రగడ్డ డివిజన్ గంగానగర్‌లో ఓ షెట్టర్‌లో మహ్మద్ మోయిజ్, అలీ అహ్మద్ కొన్ని రోజులుగా మామిడి పండ్లను రసాయన పదార్థాలతో రహస్యంగా మాగపెడుతున్నారు. సమాచారం అందుకున్న వెస్ట్ జోన్‌టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి చేసి మోయిజ్, అలీ అహ్మద్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు మాగపెట్టేందుకు ఉపయోగించే కెమికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బోరబండ పోలీసులకు దర్యాప్తు చేపడ్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: రోడ్డు పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచా రం మేరకు... ఇంజినీర్స్ కాలనీలో నివాసం ఉండే పి.శ్రీకాంత్ డి-మార్ట్‌లో పనిచేస్తాడు. ఈ నెల 25న రోడ్డు పక్కన తన ద్విచక్ర వాహనం పార్క్ చేసి షాపులోకి వెళ్లాడు. తిరిగి వచ్చే చూసేసరికి కనిపించలేదు. పలు ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేదు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొండా సురేఖపై ఈసీ ఆగ్రహం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై నోటీసు జారీ

సాక్షి, న్యూఢిల్లీ: మంత్రి కొండా సురేఖపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమె ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఈసీ పేర్కొంది. ఎన్నికల సమయంలో ఇతర పార్టీల నేతలను విమర్శించే సమయంలో తాను కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, మంత్రి అనే విషయాన్ని గుర్తుంచుకొని మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కోడ్ ముగిసే వరకు జాగ్రత్తగా మాట్లాడాలని కొండా సురేఖకు సూచించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ఆమెకు నోటీసు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఈసీ తప్పుబట్టింది. ఫోన్ ట్యాపింగ్‌తో ఎంతోమంది హీరోయిన్లను బ్లాక్ మెయిల్ చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఎంతో మంది అధికారులను బలిచేసి వారు ఉద్యోగాలు కోల్పోయి జైలుకు వెళ్లేలా చేశారని.. అధికారం లేకనే కేసీఆర్, కేటీఆర్‌లు కొత్త డ్రామాలకు తెర తీశారని కొండా సురేఖ వ్యాఖ్యానించారు. దీంతో బీఆర్ఎస్ నేతలు కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఈసీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా తెప్పించుకున్న నివేదిక ఆధారంగా.. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను పరిశీలించిన ఈసీ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేసింది. కేసీఆర్, కేటీఆర్‌లపై చేసిన నిరాధార ఆరోపణలు ప్రతిపక్ష పార్టీ, నేతల ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనేనని ఈసీ స్పష్టం చేసింది. ఇక ముందు జాగ్రత్తగా ఉండాలని ఆమెకు సూచించింది.

ట్యాపింగ్ కేసులో ఎవరినీ వదలం

మంత్రి కొండా సురేఖ



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సురేఖ

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు వెళ్లడం పక్కా అని, ఈ కేసులో ఎంతటి పెద్దవారు ఉన్నా వదిలేదిలేదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ...లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన కవిత విడుదల కోసం కేసీఆర్ బీజేపీకి అంతర్గతంగా మద్దతిస్తున్నారని మంత్రి ఆరోపించారు. ఆగస్టు 15లోగా రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తన రాజీనామా లేఖను స్పీకర్ ఫార్మాట్‌లో సిద్ధంచేసి పెట్టుకోవాలని సూచించారు. బీజేపీ దేశంలో మరోసారి అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తారని, అందువల్ల ఆ పార్టీని ఓడించాలన్నారు.

ఘర్‌వాపసీ మొదలైంది

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



పార్టీలో చేరిన సంగిశెట్టి జగదీశ్వరరావు. చిత్రంలో జగ్గారెడ్డి, అంజన్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టి వెళ్లినవారు మళ్లీ పార్టీలోకి వచ్చేందుకుగాను ఘర్‌వాపసీ మొదలైందని, రెండురోజులుగా అదే జరుగుతోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కొత్తగూడెం నియోజకవర్గ నేత యడవెల్లి కృష్ణ, ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సంగిశెట్టి జగదీశ్వరరావు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి జగ్గారెడ్డి, కోదండరెడ్డిలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినవారిని కూడా చేర్చుకోవాలని ఏఐసీసీ సూచించిందని, ఏఐసీసీ నిర్ణయాన్ని ఎవరైనా శిరసావహించాల్సిందేనన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే కూడా పార్టీలోకి వస్తారు.. చేర్చుకోవాలా అని జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ తనను అడిగితే చేర్చుకోమని చెప్పానని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో సోనియా, రాహుల్‌ల నిర్ణయాన్ని పాటించాల్సిందేనని చెప్పారు.

లోక్‌సభ సెగ్మెంట్	మొత్తం	తిరస్కరణ	చెల్లుబాటైనవి
మల్కాజ్‌గిరి	114	77	37
చేవెళ్ల	64	17	47
పెద్దపల్లి	63	14	49
భువనగిరి	61	10	51
సికింద్రాబాద్	57	11	46
హైదరాబాద్	57	19	38
నల్లగొండ	56	25	31
మెదక్	54	01	53
కరీంనగర్	53	20	33
వరంగల్	58	10	48
ఖమ్మం	45	4	41
మహబూబ్‌నగర్	42	7	35
నిజామాబాద్	42	10	32
జహీరాబాద్	40	18	22
నాగర్‌కర్నూల్	34	13	21
మహబూబాబాద్	30	05	25
ఆదిలాబాద్	23	10	13
మొత్తం	893	271	622

271 నామినేషన్ల తిరస్కరణ

- ముగిసిన పరిశీలన... ఈనెల 29న ఉపసంహరణకు గడువు
- 622 మంది అభ్యర్థుల నామినేషన్లు ఓకే



మందా జగన్నాథం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం రాత్రి ముగిసింది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల పరిధిలో మొత్తం 893 మంది నామినేషన్లు దాఖలు చేయగా, 271 మంది అభ్యర్థుల నామినేషన్లను పరిశీలన అనంతరం అధికారులు తిరస్కరించారు. 622 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు 29తో ముగియనుంది.

తిరస్కరణకు కారణాలెన్నో: నామినేషన్ పత్రా ల్లోని అన్ని కాలమ్స్ పూరించాల్సి ఉండగా, కొందరు అభ్యర్థులు కొన్ని కాలమ్స్‌ను భర్తీ చేయకుండా వదిలివేయడం, పత్రాలపై కొన్నిచోట్లలో సంతకాలు చేయకపోవడం వంటి కారణాలతో చాలా మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కనీసం 10 మంది ఓటర్లు స్వతంత్ర అభ్యర్థులను ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. కొందరు స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు కూడా ప్రతిపాదించకపోవడంతో వారి నామినేషన్లను సైతం జిల్లా ఎన్నికల అధికారులు తిరస్కరించారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు షాక్

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానానికి బీఎస్పీ తరఫున మాజీ ఎంపీ మందా జగన్నాథం వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇటీవల అధినేత్రి మాయావతి సమక్షంలో బీఎస్పీలో చేరిన ఆయన ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే బీఎస్పీకి సంబంధించి బీఫాం అందజేయకపోవడంతో నామినేషన్ తిర్కరణకు గురైంది. నామినేషన్ పత్రాల్లో నో అబ్జెక్షన్ పత్రం అందజేయకపోవడం, గడువులోగా సమర్పించాల్సి ఉన్నా సమర్పించకపోవడంతో నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. అయితే బీఎస్పీ తరఫున మరో అభ్యర్థి యోసేఫ్ నామినేషన్ దాఖలు చేయడంతో పార్టీ బీఫాంను అతనికి అందజేసింది.



అన్నా.. నువ్వే ఎంపీగా గెలుస్తున్నావు!

ఈటలతో మాజీ మంత్రి మల్లారెడ్డి సరదా సంభాషణ

మేడ్చల్: అన్నా నా కొడుకు సీటు గుంజుకున్నావు.. నువ్వే ఎంపీగా గెలుస్తున్నావు.. పక్కా నీదే గెలుపు. తన సరదా మాటలు, చేష్టలతో అందరినీ ఆకట్టుకునే మాజీ మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో అన్న మాటలివి. మేడ్చల్ మండలం రాయిలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌రెడ్డి అన్న కూతురు వివాహం కండ్లకోయలోని కేఎస్ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగింది. ఈ వేడుకకు మొదట ఈటల రాజేందర్ వచ్చి వధూవరులను ఆశీర్వదించి వెళుతుండగా అదే సమయంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన కొందరు నాయకులు మల్లారెడ్డిని కలసి ఆయనను ఈటల వద్దకు తీసుకెళ్లారు. మల్లారెడ్డి, ఈటలను కలుస్తూనే ఆలింగనం చేసుకుని 'నా కొడుకు సీటు తీసుకున్నావన్నా. మల్కాజ్‌గిరిలో నువ్వే గెలుస్తున్నావు అన్నా! పక్కాగా గెలుస్తున్నావు'అంటూ చమత్కరించారు. 'మళ్లెప్పుడు కలుస్తామో, ఒక ఫొటో దిగుదాం'అంటూ ఫొటోలు దిగి అందరినీ నవ్వించారు. మల్కాజ్‌గిరి బరిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఉన్నా, మల్లారెడ్డి.. ఈటల గెలుపు గురించి సరదాగా చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సమన్వయ కర్తలు




సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంటుకు అసెంబ్లీ, డివిజన్ల వారీగా సమన్వయకర్తలను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. అసెంబ్లీ వారీగా జూబ్లీహిల్స్‌కు షేక్ అబ్దుల్లా సోహెల్, సికింద్రాబాద్‌కు రాజీవ్‌సాగర్, అంబర్‌పేట దాసోజు శ్రవణ్, సనత్‌నగర్ వెంకట్‌రెడ్డి, ముషీరాబాద్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ సలీం, నాంపల్లి మహమూద్ అలీ, ప్రభాకర్ రావు, ఖైరతాబాద్ ఎంఎన్ శ్రీనివాసరావులను సమన్వయ కర్తలుగా నియమించారు. అలాగే డివిజన్ల వారీగా వెంకటేశ్వర కాలనీకి మన్నే కవితారెడ్డి, ఖైరతాబాద్‌కు మన్నే గోవర్ధన్‌రెడ్డి, జూబ్లీహిల్స్‌కు వెంకటేశ్, బంజారాహిల్స్‌కు విష్ణుకుమార్, హిమాయత్‌నగర్‌కు హేమలత, సోమాజిగూడకు ఆశిష్‌లను నియమించారు.

'దానం' పోటీపై ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి సికింద్రాబాద్ స్థానంలో ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేస్తుండటంపై జలగం సుధీర్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఇది అనైతికమని ఆయన కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల నమ్మకాన్ని తోసిరాజని మరో పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్నందున ఆయన్ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలన్నారు.

మెదక్ మొనగాడెవరు?



బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ

బలమైన అభ్యర్థులను రంగంలో దింపిన మూడు పార్టీలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అందరి దృష్టి మెదక్ పార్లమెంట్ స్థానంపైనే ఉంది. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వంటి కాకలుతీరిన నేతలు ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో విజయం ఎవరిని వరిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు గట్టి అభ్యర్థులను బరిలో దింపగా, వారు నువ్వానేనా అన్నట్టు పోటీ పడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి చేరికలు..విమర్శలు.. ప్రతివిమర్శలతో మెదక్ పార్లమెంట్ స్థానంలో రాజకీయం వేడెక్కింది. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీ బలంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఎదురవుతోంది. మొత్తం మీద ఈ స్థానంలో త్రిముఖ పోరు కొనసాగుతోందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో నెలకొంది. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తొమ్మిదిసార్లు, బీఆర్ఎస్ ఐదు పర్యాయాలు (ఉప ఎన్నికతో కలిపి) గెలిచాయి. బీజేపీ, టీడీపీ, పీడీఎఫ్, టీపీఎస్ ఒక్కోసారి విజయం సాధించాయి.

పట్టు నిలుపుకునేందుకు గులాబీ



పి. వెంకట్రాంరెడ్డి (బీఆర్ఎస్)

2004 నుంచి రెండు దశాబ్దాలుగా ఈ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉంది. ఈసారి కూడా ఎలాగైనా పట్టు నిలుపుకునేందుకు గులాబీ పార్టీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ పి.వెంకట్రాంరెడ్డిని బీఆర్ఎస్ బరిలోకి దింపింది. గెలుపు బాధ్యత మాజీ మంత్రి హరీశ్‌రావు తన భుజాలపై వేసుకొని నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండగా, ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానంలో మాత్రమే కాంగ్రెస్ గెలుపొందింది. ఈ ఫలితాలను పునరావృతం చేసేందుకు బీఆర్ఎస్ ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.

పాగా వేసేందుకు బీజేపీ యత్నం..



ఎం. రఘునందన్ రావు (బీజేపీ)

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఒకేఒక దుబ్బాక సీటును కోల్పోయి.. ఘోర పరాజయం పాలైన కమలం పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ప్రధాని మోదీకి ప్రజల్లో ఉన్న చరిష్మాతో ఈ ఎన్నికల్లో ముందుకెళుతోంది. బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావును బరిలో దింపింది. పార్టీకి బలమైన కేడర్ ఉన్నా, అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాయకత్వ సమస్యను ఎదుర్కొంటోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఈ పార్టీ తరఫున పోటీ చేసిన నందీశ్వర్‌గౌడ్ వంటి నాయకులు ఈ ఎన్నికల్లో అంటీ ముట్టనట్టుగా ఉంటున్నారు. సంగారెడ్డి నుంచి పోటీ చేసిన పులిమామిడి రాజు పార్టీని వీడారు.

సత్తా చాటేందుకు హస్తం యత్నం




నీలం మధు ముదిరాజ్ (కాంగ్రెస్)


రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెదక్ స్థానంలో సత్తా చాటేందుకు సై అంటోంది. వరుస చేరికలతో ఊపు మీదున్న హస్తం పార్టీ దూకుడుగా ముందుకెళుతోంది. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితర నాయకులను పార్టీలో చేర్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్‌ను ఎంపిక చేసింది. ప్రత్యర్థి పార్టీల నుంచి ఇద్దరు అగ్రవర్ణాల అభ్యర్థులు పోటీ చేస్తుండగా., కాంగ్రెస్ వ్యూహాత్మకంగా బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకుడిని ఎంపిక చేసింది. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానాన్ని ఎలాగైనా తన ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది.

ప్రభావితం చేసే అంశాలు



- మల్లన్నసాగర్, కొండపోచమ్మ జలాశయాల భూనిర్వాసితుల ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి. సర్వం కోల్పోయిన నిర్వాసితులకు పరిహార పంపిణీ, పునరావాస కల్పన అంశాలు ఈ ఎన్నికల్లో చర్చనీయాంశంగా మారాయి. ఐదు వేల వరకు నిర్వాసిత కుటుంబాలున్నాయి.
- బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో సుమారు 20 వేలమంది ఉద్యోగులున్నారు. వారితోపాటు కుటుంబసభ్యుల ఓట్లూ ఈ ఎన్నికల్లో ప్రభావితం చూపనున్నాయి.
- యూపీ, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు పటాన్‌చెరు, పాశమైలారం, ఖాజీపల్లి వంటి పారిశ్రామిక వాడల్లో పనిచేస్తున్నారు. చాలామంది ఇక్కడే స్థిరపడిపోయారు. వీరి ఓట్లు అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలున్నాయి.
- మెదక్ ఎన్‌డీఎస్ఎల్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. చెరకు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.





అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్ల వివరాలు ఇలా...

	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
సిద్దిపేట	1,16,042	1,20,361	71	2,36,474
మెదక్	1,03,654	1,13,089	5	2,16,748
నర్సాపూర్	1,09,806	1,16342	6	2,26,154
సంగారెడ్డి	1,22,021	1,25,284	33	2,47,338
పటాన్‌చెరు	2,09,757	1,97,577	85	4,07,419
దుబ్బాక	96,867	1,02,369	0	1,99,236
గజ్వేల్	1,37,630	1,41,854	5	2,79,489
మొత్తం	8,95,777	9,16,876	205	18,12,858

మాది పక్కా లోకల్ పార్టీ.. మీదే ఇటలీ పార్టీ

- చార్జిషీట్ వేయాల్సి వస్తే కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై వేయాలి
- ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం
- బీజేపీ రిజర్వేషన్లను కల్పించిందే తప్ప వాటిని రద్దు చేయలేదు
- మీడియాతో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి



శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారసత్వాన్ని కొనసాగిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఐఎన్‌సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదని.. ఇటలీ నేషనల్ కాంగ్రెస్‌గా మారిందని ధ్వజమెత్తారు. శుక్రవారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ పక్కా లోకల్ పార్టీ అని చెప్పారు. బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసిన చార్జిషీట్ హాస్యాస్పదమని విమర్శించారు. 'బీజేపీ కొత్తగా ఈబీసీ రిజర్వేషన్లను కల్పించిందే తప్ప పదేళ్లలో ఎక్కడైనా రిజర్వేషన్లను రద్దు చేసిందా?'అని ఆయన ప్రశ్నించారు.

ఉచిత బస్సు తప్ప మిగతా గ్యారంటీల అమలేదీ?

చార్జిషీట్ వేయాల్సి వస్తే కాంగ్రెస్ గ్యారంటీలపై, వాటి అమలు ఏమైందో నిలదీస్తూ వేయాల్సి ఉంటుందని కిషన్‌రెడ్డి చెప్పారు. అధికారంలోకి రావడానికి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 హామీల సంగతి ఏమైందని ఆయన ప్రశ్నించారు. కేవలం ఉచిత బస్సు పథకం తప్ప మిగితావి ఏవీ అమలుకు నోచుకోలేదన్నారు. 'గతేడాది డిసెంబర్ 9న రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు కదా.. మళ్లీ ఆగస్టు 15 అంటున్నారు. దీనిపై రైతులకు ఏ సమాధానం చెబుతారు? లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో, రాహుల్ గాంధీ ప్రధాని కాలేరనే దుగ్ధతో బీజేపీపై రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దేశంలోని వ్యవస్థలన్నింటినీ కాంగ్రెస్ అవమానించింది'అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

ముస్లిం రిజర్వేషన్లకు ప్రాతిపదిక ఏమిటి?

కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా మత ప్రాతిపదికన ముస్లిం రిజర్వేషన్లను తీసుకొచ్చిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్లను ఏ ప్రాతిపదికన తీసుకొచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రిజర్వేషన్లు చెల్లవని సుప్రీం కోర్టు గతంలోనే చెప్పిందని, ఈ రిజర్వేషన్లను తాము తప్పకుండా రద్దు చేసి తీరతామని స్పష్టం చేశారు. మరోసారి మోదీ ప్రభుత్వం వస్తే రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ నేతలు దిగజారి వితండవాదం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీసీల రిజర్వేషన్లకు గండి కొడుతున్నది ఎవరో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలోని 150 డివిజన్లలో 50 బీసీలకు కేటాయిస్తే వాటిలో 31 మజ్లిస్ గెలుచుకొనేలా కాంగ్రెస్ చేసిందన్నారు. ముస్లింలను తీసుకొచ్చి బీసీలుగా మారుస్తున్నారని, దీనివల్ల బీసీలకు అన్యాయం జరిగినట్లు కాదా? అని ప్రశ్నించారు.

కుర్చీ పోతుందనే భయంతోనే నోటికొచ్చినట్లు రేవంత్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలే ఆ పార్టీ నెత్తిన భస్మాసుర హస్తంగా మారుతాయని కిషన్‌రెడ్డి జోస్యం చెప్పారు. ఒట్లు పెట్టుకుంటే ఓట్లు పడవనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తన కుర్చీ ఎక్కడ పోతుందో అని భయపడి రేవంత్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆ భయంతోనే కాంగ్రెస్ పెద్దల మన్ననలు పొందాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కనుచూపు మేరలో కూడా అధికారంలోకి వచ్చే అవకాశం లేదని, ఒకవేళ వస్తే దేశాన్ని ముంచడం ఖాయమని ధ్వజమెత్తారు.

కేసీఆర్ ఇక ఫాంహౌస్‌లో ఉండాలి..

'పదేళ్లలో తెలంగాణను సర్వనాశనం చేసింది మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావేనని కిషన్‌రెడ్డి ఆరోపించారు. 'కేసీఆర్.. ఇకపై నువ్వు ఫాంహౌస్‌లోనే ఉండిపో'అని ఆయన విమర్శించారు. కాగా, శుక్రవారం కిషన్‌రెడ్డి సమక్షంలో నిజామాబాద్ మాజీ ఎంపీ రాంగోపాల్‌రెడ్డి కుమారుడు ముదుగంటి వెంకట శ్రీనివాస్‌రెడ్డి బీజేపీలో చేరారు.

ఆ పార్టీలకు కార్యకర్తలే ఓటెయ్యరు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఎద్దేవా



శుక్రవారం మానకొండూర్‌లో దళిత సమ్మేళనంలో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్ టౌన్/మానకొండూర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఆయా పార్టీల కార్యకర్తలే ఓటేసే పరిస్థితి లేదని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో మానకొండూరు నియోజకవర్గం గన్నేరువరం మండలం జంగపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గీకురు లత ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరగా, కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలానికి చెందిన యూత్ అసోసియేషన్ నాయకులు, కుమ్మరి, కురుమ సంఘాలకు నాయకులు, యువకులు, మానకొండురు నియోజకవర్గం అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యులు పలువురు బండి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను బేరీజు వేసి ఓటేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీలని మానకొండూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన దళిత సమ్మేళనంలో బండి సంజయ్ ఆరోపించారు. ఏ ఉద్యమంలో ఏనాడూ కనిపించని, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని ఆరోపించారు.

డబ్బులు పంచానన్న మంత్రి జూపల్లిపై చర్యలు తీసుకోండి

ఈసీకి బీఆర్ఎస్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్రమాలకు పాల్పడిన కొల్లాపూర్ ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు లిఖితపూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 21న నాగర్ కర్నూలు జిల్లా పెంట్లవెల్లిలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామంలో డబ్బులు పంచిన తనకు ఎందుకు తక్కువ ఓట్లు వచ్చాయని జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యలు చేశారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఎన్నికల నియమావళికి పూర్తి విరుద్ధమని, ఎన్నికల కమిషన్ పూర్తి విచారణ చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన జూపల్లి కృష్ణారావును ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలతో కూడిన వీడియో లింక్‌ను కూడా ఫిర్యాదుకు జత చేశారు.

ఒక్క స్థానం.. ఇద్దరు ఎంపీలు!

ఒక్క లోక్‌సభ నియోజకవర్గానికి ఇద్దరు ఎంపీలుంటారా? ఇద్దరేం ఖర్మ... ముగ్గురు కూడా ఉన్నారు! ఎప్పుడు? ఎలా?

మన దేశంలో రాజకీయాలు చాలా క్లిష్టంగా ఉన్నాయని ఇప్పుడనుకుంటున్నాం. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన ఎన్నికల సమయంలో మరింత సంక్లిష్టంగా ఉన్నాయి. సాధారణంగా ఒక్క నియోజకవర్గానికి ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తారు. ఎన్నికలు జరిగేదే ఆ ప్రతినిధిని ఎన్నుకోవడానికి. కానీ తొలి రెండు సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం పలు నియోజకవర్గాలకు ఇద్దరేసి ఎంపీలను ఎన్నుకున్నారు. 1961లో రద్దయ్యే దాకా ఇది కొనసాగింది. కొన్ని నియోజకవర్గాలకైతే ముగ్గురు ఎంపీలూ ఉన్నారు! దళితులు, గిరిజన సమూహాల వంటి అణగారిన వర్గాలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం పెంచేందుకు ఈ ఏర్పాటు కల్పించారు.

తొలి ఎన్నికల్లో...

మొట్టమొదటి ఎన్నికల సమయంలో లోక్‌సభలో 400 స్థానాలున్నాయి. వీటిలో 314 స్థానాలకు ఒక్క ఎంపీ ఉండగా, 86 నియోజకవర్గాలకు ఒక జనరల్, మరొక షెడ్యూల్ కులాల ప్రతినిధి



చొప్పున ఇద్దరేసి ఎంపీలు ఎన్నికయ్యారు. ఇలా ఇద్దరు ఎంపీలున్న నియోజకవర్గాలు యూపీలో 17, నాటి మద్రాసు రాష్ట్రంలో 13, బిహార్‌లో 11, బాంబేలో 8 ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లోని నార్త్ బెంగాల్ నియోజకవర్గానికయితే ఏకంగా ముగ్గురు ఎంపీలు ప్రాతినిధ్యం వహించారు!

1957లో...

సీట్ల పునర్విభజన అనంతరం 1957 సార్వత్రిక ఎన్నికల్లో 494 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఇద్దరు ఎంపీల స్థానాలు 57కు తగ్గాయి. వీటిలో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 18, ఆంధ్రప్రదేశ్‌లో 8, బిహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 8, బాంబేలో 8, మద్రాసులో 7 స్థానాలకు ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓటుకు సుముహూర్తం!

మధ్యాహ్నం 2 గంటలకు వివాహ సుముహూర్తం. వధువు నుదుటిపై జీలకర్ర బెల్లం పెట్టాల్సిన వరుడు కంగారుగా పోలింగ్ స్టేషన్ వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. అతడిని కొందరు అనుసరిస్తున్నారు. అక్కడున్న వారికి అతడు కొత్త పెళ్లి కొడుకు అని తెలుస్తోంది. అయినా కానీ, ఏంటా! అనుకుంటూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. పెళ్లి ఎవరికైనా జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. ఈ విషయం అతడికీ తెలుసు. కానీ, పెళ్లితోపాటు, ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం కూడా అంతే ముఖ్యమని భావించడమే ఈ వరుడి ప్రత్యేకతగా చెప్పుకోవాలి. మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో వదార్‌పుర ప్రాంతంలో కనిపించింది ఈ దృశ్యం. రెండో దశలో భాగంగా మహారాష్ట్రలోని ఎనిమిది లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ నిర్వహించారు. షేర్వాణీ, తలపాగా ధరించిన నవ వరుడు ఆకాశ్‌ను పోలింగ్ స్టేషన్ ముందు ఏఎన్ఐ వార్తా సంస్థ పలకరించింది. అతడు తన ఓటింగ్ కార్డు చూపిస్తూ, ఓటు వేసేందుకు వచ్చినట్టు చెప్పాడు. తల్లితోపాటు, మామయ్య అతడి వెంట ఉన్నాడు. ''పెళ్లి వేడుక ముఖ్యమే. మరి ఓటు?. మధ్యాహ్నం 2 గంటలకు పెళ్లి''అని ఆకాశ్ చెప్పడంతో తోటి ఓటర్లు శభాష్ అని మెచ్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలపైకి చేరగా, యూజర్లు ఎవరికి తోచిన తీరులో వారు స్పందిస్తున్నారు. ఓటు విలువను గుర్తు చేసిన ఆకాశ్‌ను అభినందిస్తున్నారు. మరొకరు అయితే.. కాబోయే వధువు ఆలోచనల్లో తేలిపోతూ ఓటును విస్మరించే వారేమో!

- సాక్షి, నేషనల్ డెస్క్





గిర్ సఫారీలో... మళ్లీ వార్ వన్‌సైడే!

గుజరాత్‌లో హ్యాట్రిక్ క్లీన్‌స్వీప్‌పై బీజేపీ కన్ను

కనీస పోటీ కూడా ఇవ్వలేక కాంగ్రెస్ ఆపసోపాలు

ఏ ఆటగాడైనా సొంత పిచ్‌పై బరిలోకి దిగితే ప్రత్యర్థులకు చుక్కలే. మరి అలాంటిది దేశాన్ని నడిపిస్తున్న కెప్టెన్, వైస్ కెప్టెన్ తమ సొంత రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో స్కెచ్ గీస్తే పరిస్థితి ఎలా ఉంటుంది! వార్ వన్‌సైడే! గుజరాత్‌లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో అక్షరాలా అదే జరిగింది. రాష్ట్రంలో మొత్తం 26 లోక్‌సభ స్థానాలనూ 2014, 2019 ఎన్నికల్లో విపక్షాలకు ఒక్కటీ దక్కకుండా క్లీన్‌బౌల్డ్ చేశారు మోదీ, అమిత్ షా. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పట్టున్న ఈ పశ్చిమ రాష్ట్రం మోదీ రాకతో పూర్తిగా కమలనాథుల గుప్పెట్లోకి వెళ్లిపోయింది. ఈసారీ క్లీన్‌స్వీప్ చేసి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్న కాషాయదళాన్ని కాంగ్రెస్ ఏ మేరకు అడ్డుకుంటుందన్నది ఆసక్తికరం...

- సాక్షి, నేషనల్ డెస్క్

గుజరాత్‌లో ఎన్నికలేవైనా బీజేపీ దెబ్బకు పార్టీలన్నీ చుక్కలు లెక్కబెడుతున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ ఒంటరిగా పోటీ చేసి మొత్తం సీట్లు తమ ఖాతాలో వేసుకుంది. 2009లో 11 సీట్లు గెలిచి బీజేపీకి గట్టి పోటీ ఇచ్చిన హస్తానికి ఆ తర్వాత రాష్ట్రం నుంచి లోక్‌సభలో పదేళ్లుగా ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. 2019 ఎన్నికల్లోనైతే ఇరు పార్టీల ఓట్ల శాతంలో ఏకంగా 30 శాతానికి పైగా అంతరముండటం విశేషం. బీజేపీకి 62.21 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 32.11 దక్కాయి మిగతా పార్టీలేవీ ఇక్కడ పెద్దగా సోదిలో లేవు. గత ఎన్నికల్లో 25 చోట్ల పోటీ చేసిన బీఎస్పీకి నోటా కంటే తక్కువ ఓట్లు పడ్డాయి!

కాంగ్రెస్.. 'ఇండియా' పోటీనిచ్చేనా!

గుజరాత్‌లో ఎంతో కొంత పుంజుకోవడానికి కాంగ్రెస్ ఆపసోపాలు పడుతూనే ఉంది. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 60 సీట్లు కోల్పోయి 17కు పరిమితమైంది. ఆమ్ ఆద్మీ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా 5 సీట్లు గెలుచుకుని రాష్ట్రంలో భవిష్యత్తుకు పునాదులు వేసుకుంది. ఈ నేపథ్యంలో పొత్తులో భాగంగా కాంగ్రెస్ 24 చోట్ల పోటీ చేస్తుండగా భావనగర్, బారుచ్ స్థానాల్లో ఆప్ బరిలో ఉంది. రైతులు, యువత, మహిళలు, ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలపై ఇండియా కూటమి హామీల వర్షం కురిపిస్తోంది. వాటినే ప్రచారాస్త్రాలుగా మలచుకుంటోంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలోనూ వాటికే పెద్దపీట వేయడం తెలిసిందే. మోదీ హయాంలో దేశవ్యాప్తంగా నిరుద్యోగం, ద్రవ్యోల్బణం చుక్కలనంటాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రచారం చేస్తున్నారు. పేదల పొట్టగొట్టి అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు దోచిపెడుతున్నారంటూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం గుజరాత్‌లో ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. విపక్షాలపై బీజేపీ కక్షగట్టి నేతలను వరుసగా జైలుపాలు చేస్తోందన్న ఇండియా కూటమి ప్రచారం ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి. సోనియా, రాహుల్, ప్రియాంకతో పాటు కాంగ్రెస్ నుంచి 40 మంది స్టార్ క్యాంపెయినర్లు గుజరాత్‌లో ప్రచారం చేస్తున్నారు. ఆప్ తరఫున కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఆప్ కీలక నేతలు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తదితరులు కూడా రంగంలోకి దిగారు.



కమలం బోణీ!

గుజరాత్‌లో ఇంకా పోలింగైనా జరగకుండానే తొలి 'కమలం' విరబూసింది! కాషాయ దళం బోణీ కొట్టేసింది. సూరత్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభనీని ప్రతిపాదించిన నేతల సంతకాల్లో తేడా ఉండటంతో నామినేషన్ తిరస్కరణకు గురవడమే ఇందుకు కారణం. కాంగ్రెస్ ప్రత్యామ్నాయ అభ్యర్థి సురేశ్ పడ్సాలా నామినేషన్ కూడా పలు కారణాలతో తిరస్కరణకు గురైంది. ఆ వెంటనే పోటీలో ఉన్న ఇతర పార్టీల అభ్యర్థులంతా నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దాంతో ముకేశ్ ఏకగ్రీవంగా గెలుపొందినట్లు ఈసీ ప్రకటించింది.

సర్వేలన్నీ కమలం వైపే

దాదాపు అన్ని సర్వేలూ బీజేపీకే జై కొడుతున్నాయి. ఈసారి కూడా మొత్తం సీట్లను చేజిక్కించుకుని హ్యాట్రిక్ కొడుతుందని అంచనా వేయడం విశేషం.

స్టేట్ స్కాన్ — బీజేపీ సమరోత్సాహం...

గుజరాత్‌లో రాజకీయం మోదీకి ముందు, తర్వాత అన్నట్టుగా మారిపోయింది. బీజేపీ దిగ్గజ నేత కేశూభాయ్ పటేల్ అనారోగ్యం, ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలతో 2001 అక్టోబర్‌లో మోదీ అనూహ్యంగా ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఏడాదికే 2002 నాటి గోద్రా రైలు దహనంలో 60 మంది కరసేవకుల మరణం మతకల్లోలాలకు దారి తీసి రాష్ట్రాన్ని కుదిపేసింది. సీఎంగా వాటి అదుపులో మోదీ వైఫల్యంపై తీవ్ర విమర్శలు చివరికి అసెంబ్లీ రద్దుకు దారితీశాయి. అయితే హిందుత్వ అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు మోదీ. ఆ తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమి కేంద్రంలో పదేళ్లు అధికారంలో కొనసాగినా గుజరాత్‌లో మోదీ పీఠాన్ని మాత్రం కదపలేకపోయింది. అద్వానీకి ప్రత్యామ్నాయంగా 2013లో ఎన్డీఏ ప్రధాని అభ్యర్థిగా మోదీ జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో గుజరాత్‌లోని వడోదరతో పాటు వ్యూహాత్మకంగా యూపీలోని వారణాసి నుంచీ పోటీ చేసి రెండింటా ఘనవిజయం సాధించారు. బీజేపీకి ఒంటి చేత్తో మెజారిటీ దక్కించి ప్రధాని పగ్గాలు చేపట్టారు. మోదీకి సేనాపతిగా పేరొందిన అమిత్ షా కూడా గుజరాత్‌లో బీజేపీ పాతుకుపోవడంలో కీలకంగా నిలిచారు. 2001 నుంచి 2014 దాకా గుజరాత్ సీఎంగా చక్రం తిప్పిన మోదీ ప్రధానిగా కూడా రాష్ట్రాభివృద్ధిపై బాగా దృష్టి పెట్టారు. దాంతో గుజరాత్ ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసింది. అయినా 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీగా పుంజుకుంది. కానీ 2022 ఎన్నికల్లో మళ్లీ చతికిలపడింది. 182 సీట్లకు బీజేపీ ఏకంగా 156 స్థానాలతో దుమ్మురేపింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ కమలనాథులు అభివృద్ధి అజెండాతో పాటు అయోధ్య రామమందిర సాకారం తదితర అంశాలను బలంగా ప్రచారం చేస్తున్నారు.

యూపీఏ మన్మోహనం

ఎనిమిదేళ్ల తర్వాత కాంగ్రెస్‌కు అధికారం | **బీజేపీని ముంచిన 'ఇండియా షైనింగ్'**

2004లో ఏప్రిల్ 20 నుంచి మే 10 దాకా నాలుగు విడతల్లో పోలింగ్ జరిగింది. బీజేపీ ఇచ్చిన 'ఇండియా షైనింగ్' (భారత్ వెలిగిపోతోంది) నినాదం ఎన్డీఏ పుట్టి ముంచింది. బీజేపీ పాలనలో దేశం అంధకారంలోకి నెట్టిందన్న కాంగ్రెస్ ప్రచారం ప్రజల్లోకి బాగా వెళ్లింది. కాంగ్రెస్ 145 చోట్ల విజయం సాధిస్తే బీజేపీ 44 స్థానాలు కోల్పోయి 138కి పరిమితమైంది. ఎన్డీఏ కూటమి బలం 185కి పడిపోయింది. యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) పేరిట పలు పార్టీలను కాంగ్రెస్ ఒక్కతాటిపైకి తెచ్చి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మద్దతు కూడగట్టింది. 335 సీట్లతో మన్మోహన్ సారథ్యంలో యూపీఏ సర్కారు ఏర్పడి ఐదేళ్లూ విజయవంతంగా పాలించింది. లెఫ్ట్ ఫ్రంట్‌తో పాటు బీఎస్పీ, ఎస్పీ, కేరళ కాంగ్రెస్ బయటి నుంచి మద్దతిచ్చాయి.



గతం

ఐదేళ్ల పాలనలో అంతా వెలిగిపోతోందన్న భావన. ఆర్థిక సంస్కరణలు. ఇటు వాజ్‌పేయి కటౌట్. దాంతో ధీమాగా ఆర్నెల్ల ముందే ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉప ప్రధాని అద్వానీ ఏకంగా 8,500 కిలోమీటర్లు భారత యాత్ర చేసినా లాభం లేకపోయింది. ఫలితంగా 2004లో జరిగిన 14వ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ అధికారం కోల్పోయింది. యూపీఏ పేరిట కాంగ్రెస్ చేసిన సంకీర్ణ ప్రయోగం ఫలించి పార్టీని ఎనిమిదేళ్ల తర్వాత కేంద్రంలో అధికారంలోకి తెచ్చింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

అనూహ్యంగా మన్మోహన్

విపక్షాలతో పాటు సొంత పార్టీ వాళ్లు కూడా తన జాతీయతను ప్రశ్నిస్తుండటంతో ప్రధాని పదవి చేపట్టరాదని సోనియాగాంధీ నిర్ణయించుకున్నారు. ప్రణబ్ ముఖర్జీ వంటి ఆశావహులను కాదని విశ్వాసపాత్రుడైన మన్మోహన్‌సింగ్‌ను ఆ పదవికి ఎంచుకున్నారు. పీవీ ప్రభుత్వంలో అనుకోకుండా కేంద్ర ఆర్థిక మంత్రి అయిన ఆయన అంతే అనూహ్యంగా అత్యున్నత పీఠమూ అధిరోహించారు. మచ్చలేని నేత కావడంతో ఆయన అభ్యర్థిత్వానికి యూపీఏ భాగస్వామ్య, మిత్రపక్షాలు కూడా అంగీకరించాయి. దేశ తొలి హిందూయేతర, సిక్కు ప్రధానిగా మన్మోహన్ చరిత్ర సృష్టించారు.

ముందస్తు పొత్తులు

14వ లోక్‌సభ ఎన్నికలు ఎన్డీఏ, యూపీఏ కూటముల పోరాటంగా సాగాయి. ఎన్డీఏ భాగస్వాములు కాని టీడీపీ, అన్నాడీఎంకేతోనూ బీజేపీ సీట్ల సర్దుబాటు చేసుకుంది. కాంగ్రెస్ కూడా ఎన్నికలకు ముందే జాతీయ స్థాయిలో కూటమి ఏర్పాటు చేయాలనుకున్నా సాధ్యపడలేదు. దాంతో లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా రాష్ట్రాల స్థాయిలో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంది. పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళల్లో సీపీఎం, సీపీఐ స్వతంత్రంగా పోటీ చేశాయి. కాంగ్రెస్, ఎన్డీఏ పక్షాలతో నేరుగా పోటీ పడ్డాయి. ఏపీ, పంజాబ్‌లో కాంగ్రెస్‌తో సీట్ల పంపకం చేసుకున్నాయి. తమిళనాడులో డీఎంకేతో కలిసి పోటీ చేశాయి. యూపీలో ఎస్పీ, బీఎస్పీతో కాంగ్రెస్, బీజేపీ పరస్పరం పోటీపడ్డాయి.

విశేషాలు...

- ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏకు 250–275 స్థానాల దాకా వస్తాయని పేర్కొన్నాయి. తీరా చూస్తే ఈ అంచనాలన్నీ తుస్సుమన్నాయి.
- దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే నిర్ణయాలకు యూపీఏ తొలి ఐదేళ్ల కాలంలో అడుగులు పడ్డాయి. వాటిల్లో సమాచార హక్కు చట్టం ముఖ్యమైనది. 2005 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వచ్చింది.
- 2006 ఫిబ్రవరి 2 నుంచి అమల్లోకి వచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ కూలీలకు ఎంతో ఆసరా అయింది.
- 2005 జూలై 18న మన్మోహన్ అమెరికా పర్యటన సందర్భంగా ఆ దేశంతో కీలకమైన అణు సహకార ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం పౌర అవసరాలకు అణు ఇంధన వినియోగానికి అమెరికా నుంచి టెక్నాలజీ సాయం లభించింది.
- అన్ని ధ్రువీకరణలకు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాల బదిలీకి వీలు కల్పిస్తున్న ఆధార్‌ను యూపీఏ సర్కారు ప్రవేశపెట్టింది.
- రాహుల్ గాంధీ తొలిసారి యూపీలోని అమేథీ నుంచి ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించారు. ప్రియాంక సైతం తొలిసారి కాంగ్రెస్ తరఫున ప్రచారం చేశారు.

పద్నాలుగో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	145
బీజేపీ	138
సీపీఎం	43
ఎస్పీ	36
ఆర్జేడీ	24
బీఎస్పీ	19
డీఎంకే	16
శివసేన	12
సీపీఐ	10
బిజు జనతాదళ్	11
స్వతంత్రులు	5
ఇతరులు	84

పరిచయం

ప్రణతీ షిండే
పక్కింటి అమ్మాయి



ప్రణతి షిండే... మహారాష్ట్రకు తొలి దళిత ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి సుశీల్‌కుమార్ షిండే కూతురిగా రాజకీయాల్లోకి వచ్చారు. కాలేజీ క్యాంటీన్‌లో చీజ్-క్యాప్సికమ్ శాండ్‌విచ్, బయట చీజ్ ఆనియన్ దోశ తింటూ ముంబై నగరంలో షికార్లు కొట్టిన అల్లరి పిల్ల.. తిరుగులేని రాజకీయ నాయకురాలవుతుందని తండ్రి కూడా ఊహించలేదు. లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ నడుపుతున్నప్పుడు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా చూశారు ప్రణతి. కలుపుగోలుతనం, ఆకట్టుకునే తత్వంతో షోలాపూర్ ప్రజల మనసును గెలుచుకున్నారు. షోలాపూర్ సిటీ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టిన ప్రణతి.. ఇప్పుడు షోలాపూర్ నుంచే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

హ్యాట్రిక్ విజయం..

రాజకీయాల్లో ఎంట్రీకి వారసత్వంగా పనికొచ్చినా ఒక మహిళగా రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి, తండ్రి పేరు నిలబెట్టడానికి చాలా కష్టపడాల్సి వచ్చిందని చెప్తారు ప్రణతి. తన మంచి పనులే మళ్లీ మళ్లీ గెలిపించాయని గుర్తు చేసుకుంటారు. షోలాపూర్‌లో బీడీ, పవర్‌లూమ్ పరిశ్రమలు ఎక్కువ. అక్కడి కార్మికుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లినవారే ఎక్కువ. తెలుగులో మాట్లాడుతూ వారి హృదయాల్లో స్థానం సంపాదించారామె. 2009, 2014, 2019ల్లో వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 2021 నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈసారి షోలాపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ షిండే 2014, 2019ల్లో వరుసగా రెండుసార్లు ఓడిపోయారు. బీజేపీ సిట్టింగ్ ఎంపీ జై సిద్ధేశ్వర స్వామి స్థానంలో రామ్ సత్పుతేను బరిలో దించింది. వాస్తవానికి షిండేను, ప్రణతిని పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలే చేసింది. షిండే ఈ సంగతి బహిరంగంగా చెప్పారు. "కాంగ్రెస్ సంస్కృతిలో పుట్టి పెరిగా. సెక్యులర్ భావజాలాన్ని వదులుకొని ఇంకో పార్టీలోకి వెళ్లలేను" అని ప్రణతి కూడా స్పష్టం చేశారు. తెలుగు వారితో పాటు ముస్లిం ఓట్లు కూడా బాగా ఉన్న షోలాపూర్‌లో ప్రణతి కాంగ్రెస్ జెండా ఎగరేసి విజయ పరంపరను కొనసాగిస్తారేమో చూడాలి.

ఇంగ్లిష్ రెట్రో సంగీతం.. సినిమాలు

1980 డిసెంబర్ 9న సుశీల్‌కుమార్ షిండే, ఉజ్వల దంపతులకు జన్మించారు ప్రణతి. తండ్రి ఎస్సీ, తల్లి కాయస్థ. ముగ్గురు కూతుళ్లలో తనే చిన్న. ముంబై సెయింట్ జేవియర్స్ కాలేజ్ నుంచి పొలిటికల్ సైన్స్, అర్థ శాస్త్రంలో డిగ్రీ చేశారు. ముంబై ప్రభుత్వ కళాశాలలో న్యాయ శాస్త్రం చదివారు. రాజకీయాల్లో ఇందిరాగాంధే తనకు ప్రేరణ అంటారు. భర్తను పోగొట్టుకున్న బాధను దిగమింగి దేశంకోసం మొండి పట్టుదలతో నిలిచిన సోనియా కూడా స్ఫూర్తేనంటారు. సంగీతమంటే ఇష్టం. అందులోనూ ఇంగ్లిష్ రెట్రోను ఇష్టపడతారు. సినిమాలన్నా మక్కువే. ప్రణతి జంతు ప్రేమికురాలు కూడా.

చిన్న వయస్కురాలిగా అసెంబ్లీలో రికార్డు

డిగ్రీ పూర్తవుతూనే 2000 సంవత్సరంలో ప్రజా జీవితంలోకి వచ్చారు ప్రణతి. 'జై జుయ్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి తండ్రి నియోజకవర్గమైన షోలాపూర్‌లో మహిళలు, యువతతో కలిసి పనిచేశారు. స్వయం సహాయక బృందాలతో చిన్న తరహా పరిశ్రమలు పెట్టించారు. 2008లో క్రియాశీల రాజకీయాల్లో ప్రవేశించారు. 2009 ఎన్నికల్లో షోలాపూర్ సిటీ సెంట్రల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేశారు. పక్కింటి అమ్మాయిలా కనిపించిన ప్రణతిని జనం అక్కున చేర్చుకున్నారు. సుదీర్ఘ ప్రసంగాల కంటే ప్రజలను నేరుగా కలుస్తూ వారికి దగ్గరయ్యారు. వారి మనసులతో పాటు, షోలాపూర్ అసెంబ్లీ స్థానాన్నీ గెలిచారు. అప్పుడామెకు కేవలం 28 ఏళ్లు. నాటి అసెంబ్లీలో అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించారు.

జైత్రయాత్ర 2024

నేడు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో శనివారం విడుదల కానుంది. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోను ప్రకటిస్తారు. విశ్వసనీయ సమాచారం మేరకు... ప్రస్తుతం రాష్ట్రంలో లక్షల కుటుంబాల స్థితిగతులను మార్చేసిన పథకాలన్నిటినీ తదుపరి టర్మ్‌లోనూ కొనసాగించాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించిందని, ఈ మేరకు మేనిఫెస్టోలో **ప్రకటన చేసే** అవకాశం ఉందని తెలియవచ్చింది. **ప్రస్తుతం** పిల్లలను స్కూళ్లకు పంపించడానికి **ఏ తల్లిదండ్రులూ** భయపడకుండా, ప్రయివే**టు స్కూళ్లకు** పంపినా కూడా వారి ఫీజులకు ఇ**బ్బంది కాకుండా** ప్రభుత్వం అమ్మ ఒడిని అంది**స్తోంది. దీంతో** పిల్లలను స్కూళ్లలో చేర్చి చదివి**ంచే వారి సంఖ్య** గణనీయంగా పెరిగింది. ఇది **అక్షరాస్యత** రేటుతో పాటు విద్యావంతుల స**ంఖ్యనూ గణ**నీయంగా పెంచనుంది. అలాగే **నాణ్యమైన** విద్యను అందించడానికి స్కూళ్లను **సకల సౌకర్యా**లతో తీర్చి దిద్దటంతో పాటు **వారికి స్కూళ్ల** తెరిచే నాటికే యూనిఫాం, **బూట్లతో పాటు** పుస్తకాలన్నిటినీ కలిపి విద్యా కా**నుకగా అంది**స్తున్నారు. ఇక 8వ తరగతి పిల్లలకు ఉచితంగా ట్యాబ్‌లిస్తూ... డిజిటల్ విద్యను ప్రోత్సహిస్తున్నారు. ఈ పథకాలన్నీ కొనసాగవచ్చని సమాచారం. నడివయసు మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా వడ్డీ లేని రుణాలను అందిస్తూ 'చేయూత' ఇస్తున్నారు. ఇక రైతాంగానికి ఏటా రెండు సార్లు రైతు భరోసాను అందిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ పథకాలతో పాటు మిగతా పథకాలనూ కొనసాగించే అవకాశం కనిపిస్తోంది. నిజానికి రాష్ట్రంలో ప్రస్తుతం పథకాలన్నీ శాచ్యురేషన్ పద్ధతిలో... అంటే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా అమలు చేస్తున్నారు. ఆర్థికంగా, సామాజికంగా బలహీనంగా ఉన్న వర్గాలను ఒక స్థాయికి తెచ్చి, మిగిలిన వారితో వీళ్లు కూడా పోటీ పడేలా చేయాలన్నదే ఈ పథకాల అసలు ఉద్దేశం. అయితే ఉద్దేశించిన ఫలితాలు రావాలన్నా, ఇలా బలహీనంగా ఉన్న వర్గాలు ఆశించిన స్థాయికి చేరాలన్నా ఈ పథకాలను మరికొన్నాళ్లు కొనసాగించాల్సిన అవసరం ఉందని పార్టీ భావించిందని, ఈ నేపథ్యంలోనే ఆయా అంశాలన్నిటినీ పొందుపరిచి మేనిఫెస్టోను ప్రకటిస్తారని భావిస్తున్నారు.



ఒకరు ఖూనీకోరు.. మరొకరు దౌర్జన్యాలకు మారుపేరు
బెట్టింగ్ బంగార్రాజు ఒకరైతే.. దాడులు, కిడ్నాపుల కింగ్ ఒకరు
ఉన్నత స్థానానికి ఎదగడానికి కుట్రలు,
కుతంత్రాలు, హత్యల మార్గాన్నే ఎంచుకున్న చంద్రబాబు..
ఈసారి ఖూనీకోరులు, దౌర్జన్యకారుల్ని ఎంపిక చేసి సీట్లు కట్టబెట్టారు.
తనకు తగ్గ టీంను ఎన్నికల బరిలోకి దించారు.
అడుగడుగునా అడ్డదారుల్లో ముందుకెళ్తూ.. ఎదురొచ్చిన వారిని
అడ్డు తొలగించుకుంటూ.. రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన చంద్రబాబు టీం ఇది..

కరడుగట్టిన నేరస్తుడు జూలకంటి బ్రహ్మారెడ్డికి మాచర్ల..
రంగా హత్య కేసు నిందితుడు వెలగపూడికి వైజాగ్ ఈస్ట్..
బెట్టింగ్ బంగార్రాజు బీటెక్ రవికి పులివెందుల..
దౌర్జన్యాలు, అక్రమాలకు మారుపేరు చింతమనేనికి దెందులూరు..
నేరాల్లో దిట్ట కందికుంటకు కదిరి..
దౌర్జన్యాలు, కిడ్నాపుల క్వీన్ అఖిలప్రియకు ఆళ్లగడ్డ..
కానిస్టేబుల్ కన్ను పోగొట్టిన చల్లా బాబుకు పుంగనూరు..
హత్య కేసు నిందితుడు శ్యాంబాబుకు పత్తికొండ..

బాబు దృష్టిలో వీరంతా నచ్చీలురు, శాంతిభద్రతలు కాపాడే ప్రజా ప్రతినిధులు.
రాష్ట్రంలో శాంతిభద్రతలపై నీతి వచనాలు చెప్పే చంద్రబాబు టీంలోని
వీరు ఎన్నికైతే రాష్ట్రంలో పరిస్థితిని మనం ఊహించుకోవచ్చు.

ఖూనీకోరులు, నేరస్తులు..

హంతకులు, కరడుగట్టిన నేరస్తులకు టికెట్లు కట్టబెట్టిన చంద్రబాబు..

బ్రహ్మారెడ్డి పేరు చెబితేనే హడల్

పల్నాడు ప్రాంతంలో జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేరు చెబితేనే సామాన్యులు ఉలిక్కిపడతారు. చంద్రబాబు సీఎంగా ఉండగా 2001లో ఏడుగురు కాంగ్రెస్ కార్యకర్తలను అత్యంత పాశవికంగా హత్య చేసిన కేసులో నేరస్తుడు. దుర్గికి చెందిన కాంగ్రెస్ నేత సాంబిరెడ్డి తన అనుచరులతో వస్తుండగా ఆ వాహనాన్ని లారీతో ఢీకొట్టి సాంబిరెడ్డిని హత్యచేశారు. పారిపోతున్న సాంబిరెడ్డి అనుచరులను వెంటాడి నరికి చంపిన కరడుకట్టిన హంతకుడు బ్రహ్మారెడ్డి. అప్పుడు అతని తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా ఉండడంతో ఆ అండ చూసుకుని ఈ హత్యలకు పాల్పడిన విషయం అందరికీ తెలిసిందే. ఈ కేసు కోర్టులో నిలబడలేదు. ఇరువర్గాలు రాజీ పడడంతో కేసు వీగిపోయింది. బ్రహ్మారెడ్డిని ఈ హత్యల తర్వాత టీడీపీలో చాలా ఏళ్లు దూరం పెట్టారు. మాచర్లలో అభ్యర్థి దొరక్కపోవడంతో బ్రహ్మారెడ్డిని వెతికి తీసుకొచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేశారు. మాచర్లలో ఆయన కాలుమోపాక మళ్లీ రౌడీయిజం, నేరాలు పెరిగిపోయాయి.

రంగా హత్య కేసు నిందితుడికి అందలం

వంగవీటి మోహన రంగా హత్య కేసులో నిందితుడు విశాఖపట్నం తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు. 1988లో విజయవాడలో రంగా హత్య సంచలనం రేపింది. హత్య చేసినవారిలో రామకృష్ణబాబు ఉన్నారని చెబుతారు. ఆ కేసులో అతన్ని ఐదో నిందితుడిగా చేర్చారు. ఆ తర్వాత ప్రాణ భయంతో రామకృష్ణబాబు విశాఖ పారిపోయారు. అక్కడే స్థిరపడి దౌర్జన్యాలు, రౌడీయిజంతో రాజకీయ నేతగా ఎదిగారు. ఆయన ఎదిగేందుకు చంద్రబాబు సాయపడ్డారు. టీడీపీలో మంచి అవకాశాలు కల్పించారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉంటూ దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారు.

అరాచకానికి కేరాఫ్ చింతమనేని

అరాచకానికి మారుపేరు దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్.. ప్రశాంతమైన దెందులూరు నియోజకవర్గంలో తన దాడులతో అల్లకల్లోలం రేపారు. సొంత పార్టీ నేతలే అతని అరాచకాల్ని భరించలేకపోయారు. దుగ్గిరాలకు చెందిన ప్రభాకర్ జులాయిగా తిరిగేవాడు. ప్రారంభంలో రౌడీ షీటర్‌గా దాడులకు తెగబడేవారు. ఏలూరు పోలీసులు అరెస్టు చేసి అండర్‌వేర్‌తో లాకప్‌లో కూర్చోబెట్టిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా, దౌర్జన్యాలకు కేరాఫ్ ప్రభాకర్‌కు చంద్రబాబు దెందులూరు సీటు ఇచ్చి ఎమ్మెల్యేను చేశారు. ఎమ్మెల్యే అయ్యాక అతని దౌర్జన్యాలు మితిమీరాయి. అధికారుల్ని బెదిరించడం దాడులు చేయడం నిత్యకృత్యం. మంత్రి వట్టి వసంతకుమార్‌పై దాడి చేసిన ఘనుడు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారనే అక్కసుతో తహసీల్దార్ వనజాక్షిపై దాడి రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఆయనపై వంద కేసులున్నాయి.

అఖిలప్రియ అంటే హడలే..

ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ దౌర్జన్యాలకు అంతేలేదు. కిడ్నాప్ కేసులో నిందితురాలిగా ఉన్నారు. జాతీయ హాకీ ప్లేయర్ ప్రవీణ్‌రావు, అతని ఇద్దరు సోదరులను 2019లో కిడ్నాప్ చేయించి బీభత్సం సృష్టించారు. ఈ కేసులో ఆమె అరెస్టయి కొద్దిరోజులు జైల్లో ఉన్నారు. పలువురిపై దాడులు, దౌర్జన్యాలు చేసి నియోజకవర్గంలో అందరినీ భయభ్రాంతులకు గురిచేసే ఆమెకు సీటిచ్చారు.

అల్లరిమూకలతో కలిసి పోలీసులపై చల్లా బాబు దాడి

చల్లా రామచంద్రారెడ్డి అలియాస్ చల్లా బాబు గతేడాది చంద్రబాబు పుంగనూరు పర్యటన సందర్భంగా జరిగిన విధ్వంసంలో కీలకమైన వ్యక్తి. పోలీసులపైనే దాడి చేసి ఒక కానిస్టేబుల్ కన్ను పోగొట్టారు. అల్లరిమూకలను వెంటబెట్టుకుని మారణాయుధాలతో పోలీసులపై దాడి చేశారు. రొంపిచర్ల మండలంలో జరిగిన పలు దాడులు, దౌర్జన్యాలతో రౌడీగా ముద్రపడ్డారు. ఆయనకు చంద్రబాబు పుంగనూరు సీటు ఇచ్చారు.

-సాక్షి, అమరావతి

బెట్టింగ్, హత్య కేసులో నిందితుడు బీటెక్ రవి

నేరస్తుడిగా ఉన్న మారెడ్డి రవీందర్‌రెడ్డి (బీటెక్ రవి)ని రాజకీయాల్లో పైకి తీసుకువచ్చి ప్రోత్సహించారు చంద్రబాబు. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం సర్పంచ్ రామలింగారెడ్డి హత్య కేసులో బీటెక్ రవి నిందితుడిగా ఉన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో అరెస్టయిన చరిత్ర రవిది. రౌడీ కార్యకలాపాలతో రాజకీయ నేతగా ఎదిగిన అతన్ని చంద్రబాబు ఎమ్మెల్సీగా చేసి ఇప్పుడు పులివెందుల ఎమ్మెల్యే సీటు కేటాయించారు.

కందికుంటపై లెక్కలేనన్ని కేసులు..

అనంతపురం జిల్లా కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పరిటాల రవి అనుచరుడిగా ఉండగా అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారని చెబుతారు. ఒక రేప్ కేసులోనూ వెంకట ప్రసాద్ నిందితుడిగా ఉన్నట్లు గతంలో ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. హత్య, హత్యాయత్నం కేసులు ఆయనపై ఉన్నాయి. అక్రమంగా ఆయుధాలు **కలిగి ఉన్నారనే** ఆరోపణలకు సంబంధించిన **కేసులూ ఉన్నా**యి. చెక్ బౌన్స్ కేసులైతే లెక్కలేనన్ని.. **నకిలీ** డీడీల కేసులో నిందితుడిగా **ఉన్నారు. ఆ కేసు**ను ఇటీవలే కోర్టు కొట్టివేయడం**తో చంద్రబాబు** వెంటనే సీటిచ్చారు.

కేఈ శ్యాంబాబుపై హత్య కేసు



కర్నూలు జిల్లా పత్తికొండ **టీడీపీ అభ్యర్థి కే**ఈ శ్యాంబా**బు హత్య కేసు**లో నింది**తుడు. 2017లో** వైఎస్సార్ **సీపీ నేత** చెరుకులపాడు **నారాయణరెడ్డి** హత్య కేసులో ఆయన పాత్ర కూడా ఉన్నట్లు నిర్ధారణ అవడంతో కోర్టు ఆ కేసులో నిందితుడిగా చేర్చింది. వైఎస్సార్‌సీపీ నేతగా నారాయణరెడ్డి ఎదుగుదలను జీర్ణించుకోలేక ఆయనను హత్య చేయించినట్లు ఆరోపణలున్నాయి. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో దౌర్జన్యాలకు పాల్పడిన చరిత్ర శ్యాంబాబుది.

హత్య కేసు నిందితుడు కొల్లు రవీంద్ర



హత్య కేసులో నిందితుడిగా ఉన్న కొల్లు రవీంద్రకు మచిలీపట్నం సీటు ఇచ్చారు. మచిలీపట్నంలో 2020లో జరిగిన వైఎస్సార్‌సీపీ నేత మోకా భాస్కరరావు హత్య కేసులో రవీంద్ర నిందితుడు. రవీంద్ర వ్యూహంలో భాగంగానే భాస్కరరావు హత్య జరిగినట్లు తేలడంతో ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపించారు. ఆయనకే చంద్రబాబు మళ్లీ సీటు ఇచ్చారు.

మాస్టారూ.. ఎవరీమె?

ఎన్నికల కోసం కట్టుకున్న భార్యను కాదనుకున్నావా నారాయణా?

ఆస్తుల్లో భార్యకు వాటాలిచ్చావు.. బిడ్డను కన్నావు.. ఇప్పుడు కాదంటావా?

ఎన్నికల అఫిడవిట్‌లో ఇద్దరు భార్యలున్నట్లు చూపని మాజీ మంత్రి

రెండో భార్య కుమార్తెకు 'గంటా' కుమారుడితో వివాహం జరిపించలేదా?

నీ ఎడ్యుకేషనల్ సొసైటీలో రెండో భార్య ఇందిర డైరెక్టర్‌గా ఎలా ఉంది?

గత అఫిడవిట్, ప్రస్తుత అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన 'పొంగూరు'

మొన్న మరదలిని వంచించావు..ఇప్పుడు కట్టుకున్న భార్యనే కాదనుకుంటావా?

మహిళలను మోసం చేసే నీవు సింహపురి మహిళలకు ఏం చెబుతావు?

నారాయణ అఫిడవిట్‌పై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అభ్యంతరాలు



నెల 1వ తే... సంవత్సరముల కాలపరిమితి వరకు బాడుగ ఖరారునామా
2015 వ సంవత్సరం జనవరి నెల
1. స్వంత దారు :-
1. పొంగూరు సుబ్బమ్మ వయస్సు 75 సం॥లు భర్త లేట్ సుబ్బరామయ్య
పొంగూరు రమాదేవి వయస్సు 48 సం॥లు భర్త నారాయణ
2. పొంగూరు రమాదేవి వయస్సు 48 సం॥లు భర్త నారాయణ
3. పొంగూరు ఇందిర వయస్సు 48 సం॥లు భర్త నారాయణ

ఒక డాక్యుమెంట్లో ఇందిర భర్త నారాయణగా పేర్కొన్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నారాయణ విద్యాసంస్థల అధినేతగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల వేళ సత్యాన్ని సమాధిచేసి తన రాజకీయ పదవి కోసం తాళి కట్టిన భార్యనే కాదనుకున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నారాయణతో మూడు దశాబ్దాల పాటు అన్యోన్య దాంపత్య జీవితం పంచుకున్న ఆమె ప్రస్తుతం ఎవరు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికల అఫిడవిట్‌లో తనకు ఒక భార్య, కుమార్తెను మాత్రమే చూపారు. రెండో భార్య ఆమె కుమార్తెను చూపించకపోవడంతో గత నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ మహిళలను వంచించిన విషయంలో సింహపురి మహిళలకు ఏమని సమాధానం చెబుతారు.

తప్పుల కుప్ప.. ఆ 'అఫిడవిట్'

టీడీపీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణ చిక్కుల్లో పడ్డాడు. భారత ఎన్నికల సంఘం నిబంధనలను సవాల్ చేస్తూ తన నామినేషన్ పత్రంతో సమర్పించిన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం పొందుపరిచారు. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఒక భార్య ఉన్న వారే రాజ్యాంగబద్ధ పదవులకు అర్హులు. ఇంకో భార్య ఉన్నప్పటికీ విడాకులు అయినా ఇచ్చి ఉండాలి. అయితే నారాయణ విద్యా సంస్థల అధినేతగా నారాయణ వ్యక్తిగత జీవితం 'తెరిచిన పుస్తకం'. నారాయణకు ఇద్దరు భార్యలు ఉన్న విషయం అందరికీ తెలిసిందే.

- **2014లో ఇలా..**

2014లో ఎమ్మెల్సీ నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య పి. రమాదేవిగా, శారిణి (రెండో భార్య ఇందిర కుమార్తె), కుమారుడు నిశింత్‌ను డిపెండెంట్‌లుగా చూపించారు. వీరు కొడుకు, కూతురు అయినప్పటికీ వారు తన సంతానంగా స్పష్టంగా పేర్కొనకపోవడం విశేషం.

- **2019 ఎన్నికల్లో ఇలా..**

2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో కేవలం తన భార్య రమాదేవిని మాత్రమే చూపించారు. అయితే అంతకు ముందే కుమారుడు నిషాంత్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో కుమార్తె శారిణిని అఫిడవిట్‌లో సంతానంగా, డిపెండెంట్‌లుగా పేర్కొనకపోవడం గమనార్హం.

- **2024లో (ప్రస్తుతం)ఇలా..** 2024 సార్వత్రిక ఎన్నికల్లో సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య రమాదేవిని మాత్రమే చూపించారు. కానీ ఎక్కడా కుమార్తెలు ఉన్నట్లుగా చూపించకపోగా, శారిణి, సింధూర వద్ద అప్పులు తీసుకున్నట్లు అఫిడవిట్‌లో చూపించడం గమనార్హం.

ఇందిర నారాయణ రెండో భార్యే?

పొంగూరు ఇందిర రెండో భార్యే అనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. 1996లో ఏర్పాటు చేసిన నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంస్థలో ఇందిర భర్త పొంగూరు నారాయణగా ఆమె చైర్మన్ హోదాతో ఉన్నట్లు ట్రస్ట్ బోర్డులో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు నిర్ధారణ చేస్తున్నాయి. ఇందిర నిర్వహణ కమిటీలో కూడా కోశాధికారిగా ఉన్నట్లు తెలుస్తోంది. 2014లో మాత్రం ఎన్నికల కోసం ఆమెతో రాజీనామా చేయించారు.

2011 నుంచి 2020 వరకు నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్‌లో లావాదేవీల విషయంలో కూడా ఇందిర సంతకం ఉంది. అయితే ఆమెతో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నట్లు ఎప్పుడు, ఎలా, ఎక్కడ అనే ఆధారాల్లేవు. ఆమె పాస్‌పోర్టు పరిశీలించినా నారాయణ భార్యగా తేటతెల్లం అవుతుంది. ఆమె పేరుతో ఉన్న ఆస్తుల రిజిస్టర్ డాక్యుమెంట్లను పరిశీలించినా ఇదే విషయం ప్రస్ఫుటం అవుతుంది. ఇందిర కుమార్తె శారిణి పాస్‌పోర్ట్‌లో తన తండ్రి నారాయణగా ఉన్నట్లు సమాచారం. అయితే నారాయణ మంత్రి అయ్యాక వికీపీడియాలో మాత్రం భార్య రమాదేవి, కుమార్తెలు సింధూర, శారిణి, కుమారుడు నిషాంత్ (లేట్) అనే విషయాలు నమోదు చేసి ఉండడం విశేషం.

కన్యాదానం చేసి..

నారాయణ గతంలో మంత్రి పదవి చేపట్టిన తర్వాత కొంత కాలానికి కుమారుడు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తర్వాత కొన్నాళ్లకు తన కుమార్తె శారిణి (రెండో భార్య కుమార్తె)కి టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజతో వివాహం జరిగింది. ఆ వివాహ సందర్భంలో నారాయణ, ఇందిర దంపతులుగా వ్యవహరించి కన్యాదానం చేశారు. అలాగే నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్‌గా శారిణి, రవితేజ వ్యవహరిస్తున్నారు. అన్ని సందర్భాల్లో ఇందిరను భార్యగా చూపిస్తున్న నారాయణ ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం చూపించకపోవడం విశేషం.

టీడీపీకి ఆర్థిక దన్ను

టీడీపీకి నారాయణ ఆర్థిక వెన్నుదన్నుగా నిలుస్తూ చంద్రబాబు అండతో రాజధాని ప్రాంతంలో వేలాది ఎకరాల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. అనేక అవినీతి బాగోతాల్లో నారాయణ పాత్రధారుడుగా ఉన్నారు. ఇక విద్యా సంస్థల్లో అయితే పేపర్ల లీకేజీల నుంచి అనేక అడ్డదారులు తొక్కారు. వీటి నుంచి బయటపడాలని 2019లో నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నారాయణ అవినీతి బాగోతాలన్నీ బయటపడ్డాయి. ఈ కేసులన్నీ మెడకు చుట్టుకోవడంతో కేసుల నుంచి బయటపడేందుకు ఈ ఎన్నికల్లో గెలవాలని రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే టీడీపీకి సైతం దాదాపు రూ.900 కోట్ల ఎన్నికల ఫండ్‌ను అందజేసినట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు సిటీలో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలబెట్టిన ఒక సామాన్యుడిపై ఓడిపోతాననే భయంతో రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు కూడా వెనుకాడడం లేదని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

నామినేషన్ స్క్రూటినీలో అభ్యంతరాలు

నెల్లూరులోని శుక్రవారం జరిగిన నామినేషన్ల స్క్రూటినీ సమయంలో నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి నారాయణ నామినేషన్ సందర్భంగా పొందుపరిచిన అఫిడవిట్‌పై స్థానిక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పలు అభ్యంతరాలను తెలిపారు. నారాయణకు రెండు పెళ్లిళ్లు అధికారికంగా అయినట్లు పలు ఆధారాలతో సహా రిటర్నింగ్ అధికారికి చూపించారు. అఫిడవిట్‌లో రెండో భార్యను ఎక్కడా చూపించలేదని. రెండో భార్య కుమార్తె శారిణి ఉన్నట్లు చూపించారు. నారాయణ ఎడ్యుకేషన్ సొసైటీ ఏర్పాటు నుంచి ఆయన భార్యగా ఇందిరను చూపించారని, కుమార్తె శారిణి కూడా సొసైటీ మేనేజ్‌మెంట్ మెంబర్‌గా ఉందని, వారి పాస్‌పోర్ట్‌లు పరిశీలించినా వాస్తవాలు తెలుస్తాయని అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఆయా అభ్యంతరాల ఆధారంగా నారాయణ నామినేషన్‌ను తిరస్కరించాలని ఫిర్యాదు చేసినా రిటర్నింగ్ అధికారి ఆ అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

ఆస్తుల్లోనూ తప్పుడు సమాచారమే?

దేశ వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలను నెలకొల్పి వేలకోట్ల ఆస్తులను సొంతం చేసుకున్న నారాయణ ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులపై తప్పుడు సమాచారం ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఆయన కుటుంబ ఆస్తుల విలువ రూ.824.05 కోట్లుగా చూపారు. ఆయనతోపాటు మొదటి భార్య రమాదేవి పేరిట ఆస్తులున్నట్లు పేర్కొన్నారు. వారిద్దరి పేర్లతో అప్పులు కూడా రూ.189.59 కోట్లుగా చూపారు. కానీ దేశ వ్యాప్తంగా వేల కోట్ల ఆస్తులు పోగేసుకున్న నారాయణ అఫిడవిట్‌లో కొన్నింటినే చూపారని చెప్పుకోవాలి.

కేసుల్లో దిట్ట

నారాయణపై అఫిడవిట్‌లో చూపిన ప్రకారం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. నారాయణ తమ్ముడు భార్య నెల్లూరు నగరంలోని బాలాజీనగర్ స్టేషన్‌లో వరకట్నం, వేధింపుల కేసు నమోదు చేయించింది. అలాగే చిత్తూరులో ప్రశ్నాపత్రాల లీక్ చేసిన అభియోగంతో కేసు నమోదయింది. అలాగే నారాయణ విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న కేసులో కడప జిల్లా బి కోడూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.. మిగిలిన ఐదు కేసులు అమరావతి భూముల విషయంలో సీఐడీ కేసులు నమోదు చేసింది.. అమరావతి భూముల మాస్టర్ డిజైనింగ్ అక్రమాలు, దళితుల భూములు కొనుగోలు, మంత్రిగా తన విధులను దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై సీఐడీ కేసులు నమోదు చేసినట్లు చూపారు.

భువనేశ్వరి పేరుతో ఆడియో హల్‌చల్

- పోరా.. పో ఇక్కడ నుంచి.. లం.. కొడకా..
- పెద్ద కుటుంబంలో పుట్టినదాన్ని నేను..
- పత్రికల్లో రాయడానికి వీలు లేనంత అసభ్యంగా కొన్ని పదాలు
- 36 గంటలుగా వివిధ సోషల్ మీడియా వేదికల్లో వైరల్
- ఎప్పుడు, ఎవరిపై ఇలా ఆగ్రహంతో ఊగిపోయారన్న దానిపై విస్తృతంగా చర్చ
- టికెట్ కోసం వచ్చిన దళిత నాయకుడిపై మాట్లాడారని కొందరు.. కుప్పం స్టీరింగ్ కమిటీ సభ్యులపై అని మరికొందరు..
- కొన్ని సామాజిక వర్గాలను కించపరిచేలా వ్యాఖ్యలు
- తప్పు పడుతున్న వివిధ కుల సంఘాల నాయకులు



చెత్త నా కొడుకులు.. చెత్త బుట్టలో పుట్టారు..

సాక్షి, అమరావతి

పోరా.. పో ఇక్కడ నుంచి లం..కొడకా..

నేను నీకంటే పెద్ద ఇంటిలో పుట్టిన దాన్ని. చెత్త నా కొడుకులు. చెత్త బుట్టలో పుట్టి కూడా వేషాలు వేస్తారు.

దేనికీ పనికిరారు.. అడుక్కు తింటానికి కూడా.. బాస్టర్డ్. మీ అందరినీ మానిటర్ చేయలేక (పర్యవేక్షించలేక) నేను చస్తున్నా..

తప్పుడు నా కొడకా, ఊడిగం చేసే కుక్క..

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి తిట్ల దండకంతో కూడిన ఆడియో ఒకటి గురువారం రాత్రి నుంచి వివిధ సోషల్ మీడియా వేదికల్లో హల్‌చల్ చేస్తోంది. కేవలం ఒక్క భువనేశ్వరి మాటలు మాత్రమే ఆ ఆడియో టేపుల్లో వినిపిస్తోంది. అందులో కొన్ని పదాలు పత్రికలో రాయడానికి వీలు లేనంత అసభ్యంగా ఉన్నాయి. ఆమె ఎప్పుడు, ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారన్న దానిపై అటు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో పాటు, ఇటు రాష్ట్రంలోని రాజకీయ వర్గాలందరిలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చంద్రబాబు పోటీ చేస్తున్న కుప్పం నియోజకవర్గంలో భర్త నామినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఆమె ఈ నెల 18, 19, 20 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. ఆ సమయంలో.. కొందరు స్థానిక టీడీపీ నాయకులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసిన మాటలుగా టీడీపీలో చర్చ సాగుతోంది. 'కుప్పంలో లోకేశ్ తన సొంత మనుషులతో ఓ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ సభ్యులు కొందరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి బాగోలేదని చెప్పారు. ఆ పరిస్థితిని మార్చడంలో భాగంగా ఎక్కువగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అయిన ఖర్చుకు సంబంధించి బిల్లులు పెట్టిన సందర్భంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు' అని కుప్పం టీడీపీ నాయకులు చెబుతున్నారు. కాగా, మొదటి నుంచి పార్టీ కోసం పని చేస్తూ.. చంద్రబాబు కుటుంబ సభ్యులందరితో పరిచయం ఉన్న ఓ దళిత నాయకుడు ప్రస్తుత ఎన్నికల్లో తన టికెట్ కోసం భువనేశ్వరిని కలిసి సిఫార్సు కోసం ప్రయత్నించినప్పుడు ఆమె ఈ రకంగా ఆగ్రహావేశాలతో ఊగిపోయారన్న చర్చ కూడా సాగుతోంది. అయితే భువనేశ్వరి మాటలతో కూడిన ఆ ఆడియో టేపుల్లోని మాటలు సమాజంలో కొన్ని వర్గాల వారిని బాగా కించ పరిచేలా ఉండడంతో వివిధ కుల సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

కేర్ వైద్యుల అరుదైన చికిత్స

బంజారాహిల్స్: హై బీఎంఐతో బాధపడుతున్న ముగ్గురికి ట్రాన్స్‌ఫర్మేటివ్ సర్జరీ చేసి విజయవంతంగా మధుమేహం నుంచి దూరం చేశారు బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యులు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రి డాక్టర్ వేణుగోపాల్ పరీక్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సయ్యద్ క్రమాన్ హుస్సేన్ వెల్లడించారు. ఒడిశాకు చెందిన ముగ్గురు వ్యక్తులు హైబీఎంఐతో తమ ఆస్పత్రిని సంప్రదించారన్నారు. వారికి హార్మోన్ ఉత్పత్తిని ప్రేరేపించడానికి కడుపు, పేగులను తిరిగి మారుస్తారని ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా ఈ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అధిక బరువుతో ఉన్న వీరు బరువు తగ్గించుకోవడానికి బేరియాట్రిక్ సర్జరీలో పొట్ట తగ్గించుకోవడానికి సిద్ధమవుతారని ఈ సర్జరీ తర్వాత వీరిలో పూర్తిగా మధుమేహం తగ్గిపోయిందని ఇప్పుడు వీరు ఎలాంటి మందులు వాడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఒడిశాకు చెందిన వినీత్‌కుమార్, వినయ్‌కుమార్, మదన్ చందర్‌లకు ఈ సర్జరీని తాము విజయవంతంగా నిర్వహించి బరువు తగ్గించడంతో పాటు మధుమేహాన్ని దూరం చేసినట్లు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

‘బీజేపీ పాలనలో రక్షణ లేదు’



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య ..

పంజగుట్ట: రిజర్వేషన్లు కాపాడుకోవాలన్నా, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా బీజేపీని గద్దె దించాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ ఉండదని పేర్కొన్నారు. శుక్రవారం పంజగుట్ట పోచమ్మబస్తీలో మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్‌లు పుణ్య భానుప్రకాష్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజి రమేష్, మన్నే శ్రీధర్ రావు, వినయ్ కుమార్‌లతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి దళితులను ఐక్యం చేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని ప్రతీ బస్తీకి వెళ్లి దళిత, బహుజనులకు విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు తొలగిస్తామని, రాజ్యాంగాన్ని తిరిగి రాస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్న బిజేపీని ఓడించాలని విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీఏలో ‘స్మార్ట్’ మాయాజాలం

- స్పీడ్ పోస్టు చేయకుండా స్మార్ట్‌కార్డుల నిలిపివేత
- ఏజెంట్ల ద్వారా వాహనదారులకు అమ్మకాలు
- టీఎస్ నుంచి టీజీకి మారిన తరువాత పెరిగిన డిమాండ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు ఆర్టీఏ కార్యాలయాల్లో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ స్మార్ట్‌కార్డుల పంపిణీలో పెద్ద ఎత్తున మాయాజాలం జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు వాహనదారులకు స్పీడ్‌పోస్టు ద్వారా ఈ కార్డులను పంపించవలసి ఉండగా, కొన్ని చోట్ల రికార్డుల్లో మాత్రం స్పీడ్ పోస్ట్ చేసినట్లుగా నమోదు చేసి ఆ తరువాత ఏజెంట్ల ద్వారా అమ్మకాలకు పాల్పడుతున్నారు. నేరుగా వచ్చే వినియోగదారులకు సైతం రూ.200 నుంచి రూ.300 వరకు తీసుకొని ఇస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలా పలు ఆర్టీఏ కార్యాలయాల్లో వందల కొద్దీ స్మార్ట్‌కార్డులు వినియోగదారులకు చేరకుండా ఆర్టీఏ కార్యాలయాల్లోనే పేరుకుపోతున్నాయి. ‘స్పీడ్ పోస్టు ద్వారా పంపినట్లు స్కానింగ్ చేసిన స్మార్ట్‌కార్డులు నమోదై ఉంటాయి. కానీ వాస్తవానికి ఆ కార్డులు పోస్టాఫీస్ వరకు వెళ్లడం లేదు ’అని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ విస్మయం వ్యక్తం చేయడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఇదో తరహా దందాగా మారిందని పేర్కొన్నారు.కొన్ని చోట్ల ఏజెంట్‌లు, దళారులకు గంపగుత్తగా అప్పగిస్తున్నట్లు తెలిసింది.

పోస్టల్ చార్జీలతో సహా చెల్లించినా....

డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీలు, వివిధ రకాల రెన్యువల్స్ పత్రాలను రవాణాశాఖ స్మార్ట్ కార్డుల రూపంలో అందజేస్తుంది. గతంలో వినియోగదారులకు నేరుగా ఇచ్చేవారు. కానీ దీనివల్ల ఆర్టీఏ అందజేసే విలువైన డాక్యుమెంట్‌లు తప్పుడు వ్యక్తులకు చేరే ప్రమాదం ఉండడంతో వాహనదారుల ఇళ్లకే నేరుగా స్పీడ్‌పోస్టు చేస్తున్నారు. ఈ మేరకు అన్ని రకాల సర్వీసు చార్జీలతో పాటు స్పీడ్ పోస్టు కోసం కూడా వాహనదారుల నుంచి మరో రూ.50 వసూలు చేస్తారు. కానీ ఈ స్పీడ్‌పోస్టు ప్రక్రియ మొదటి నుంచి వివాదాస్పదంగానే మారింది. వాహనదారులు కచ్చితమైన చిరునామా రాసినప్పటికీ చాలామందికి సకాలంలో కార్డులు చేరడం లేదు. గతంలో పోస్టాఫీస్ సిబ్బంది బట్వాడా చేయకపోవడం వల్ల వేల కొద్దీ కార్డులు పెండింగ్ జాబితాలో పడిపోయాయి. కొన్నిచోట్ల పోస్టాఫీసుల్లోనే బుట్టదాఖలా అయ్యాయి. ఇప్పటికీ స్పీడ్ పోస్టు చేసిన కార్డు వాహనదారుడికి చేరే వరకు సందేహాస్పదమే. ఒకవైపు ఈ స్పీడ్‌పోస్టు తతంగం ఇలా ఉండగా, మరోవైపు కొంతమంది ఆర్టీఏ సిబ్బంది దళారులు, ఏజెంట్‌లతో కుమ్మక్కై కొంతమంది సిబ్బంది ఈ తరహా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

టీజీతో పెరిగిన డిమాండ్...

వాహనాల నెంబర్ ప్లేట్‌లపైన ‘టీఎస్’కు బదులు ప్రభుత్వం ‘టీజీ’ని మార్చిన తరువాత ఒక్కసారిగా కార్డులకు డిమాండ్ పెరిగింది. ప్రతి రోజు సుమారు 2500 నుంచి 3000 వాహనాలు కొత్తగా నమోదవుతున్నాయి. అలాగే వందల కొద్దీ వాహనాలు ఒకరి నుంచి మరొకరికి బదిలీ అవుతున్నాయి. అలాగే రెన్యువల్స్ కోసం వచ్చే వాటి సంఖ్య కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటుంది. దీంతో తెలంగాణ అంతటా వేల సంఖ్యలో పెండింగ్ జాబితా పెరిగిపోయింది. ఈ క్రమంలోనే సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శించడం గమనార్హం.పాన్ కార్డులు,ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులు వంటి కీలకమైన పత్రాలను ఈ–సేవ, మీసేవ కేంద్రాల నుంచి తీసుకొనే సదుపాయం అందుబాటులో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వాహనాల రిజిస్ట్రేషన్‌లతో పాటు, స్మార్ట్‌కార్డులు, నెంబర్‌ప్లేట్‌లను కూడా షోరూమ్‌లలోనే అందజేస్తున్నారు. అదే తరహా సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని వాహనదారులు కోరుతున్నారు.

పెట్టుబడి పేరుతో మోసం..

- రూ.10 లక్షలు కోల్పోయిన విద్యార్థిని
- రికవరీ చేసి బాధితురాలికి అందించిన సైబర్ క్రైమ్ పోలీసులు

హిమాయత్‌నగర్: కోవిడ్ సమయంలో ఓ విద్యార్థిని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి భారీగా మోసపోయింది. దీంతో తన డబ్బు తిరిగి రాకపోవడంతో గతంలో సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు బాధితురాలికి రికవరీ చేసిన రూ. 10 లక్షలను తిరిగి ఆమెకు అందజేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన మేరకు.. నగరానికి చెందిన విద్యార్థిని (21) కోవిడ్ సమయంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంది. బాధితురాలు ‘యూనిటీ స్టాక్స్’ పేరుతో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా వంద శాతం అత్యధిక లాభాలు ఇస్తామంటూ ఫేస్‌బుక్ పోస్టును చూసింది. సైబర్ నేరగాళ్లు బాధితురాలిని నమ్మించేందుకు తమ కంపెనీ లాభాలు అందించినట్లు ఆధారాలను వాట్సాప్ ద్వారా పంపించారు. అనంతరం సైబర్ నేరగాళ్లు బాధితురాలి పేరుతో ట్రేడింగ్ అకౌంట్ ఓపెన్ చేయడం కోసం తన ఆధార్, పాన్ కార్డ్ అడిగారు. అది నమ్మిన బాధితురాలు విడతల వారిగా వారు చెప్పిన బ్యాంక్ ఖాతాలకు డబ్బు పంపించింది. ఆరు నెలల అనంతరం బాధితురాలు తన డబ్బును తిరిగి ఇవ్వాలని వారిని కోరింది. అయితే కేటుగాళ్లు ఆమె డబ్బు సురక్షితంగా ఉందని, మరికొన్ని రోజులు వేచి ఉండాలని చెప్పారు. ఆరు నెలలుగా విడతల వారిగా పెట్టుబడులు పెడుతున్న బాధితురాలిని మరింత పెట్టుబడులు పెట్టాలని చెప్పారు. ఆపివేస్తే తాను పెట్టిన డబ్బు మొత్తం నష్టపోతారని భయపెట్టారు. మరింత డబ్బు ఇన్వెస్ట్ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో బాధితురాలు తన డబ్బు తిరిగి రాకపోవడంతో గతంలో నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు రూ. 10.23 లక్షలను రికవరీ చేసి బాధితురాలికి అందజేశారు.

హైటెక్స్‌లో కొలువుదీరిన ‘రెన్యూ ఎక్స్’



ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న స్టాళ్లు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ‘రెన్యూ ఎక్స్– 2024 ప్రారంభమైంది. కార్యక్రమంలో పవర్ యుటిలిటీ పీడబ్ల్యూసీ డైరెక్టర్ భాగ్యతే జీరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెన్యువబుల్ ఎనర్జీడెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య , ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర సలహాదారు అజయ్‌మిశ్రా, ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ యోగేస్ ముద్రాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్ యుటిలిటీ పీడబ్ల్యూసీ డైరెక్టర్ భాగ్యతే జీరెడ్డి మాట్లాడుతూ.. అయిదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రెన్యూ ఎక్స్ వివిధ అవకాశాలను కనుగొనడానికి, విజయవంతమైన వ్యాపార సంబంధాలను నిర్మించడానికి ఒక గేట్‌వేలా ఉపయోగపడుతుందన్నారు. కాగా.. నేటితో ముగియనున్న ఈ ప్రదర్శనలో 150కి పైగా దేశీయ, అంతర్జాతీయ ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తా: సినీనటి నమిత



నల్లకుంట: సినీనటి నమిత దంపతులు శుక్రవారం కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని పేర్కొన్నారు. బీజేపీ మైనారిటీ మోర్చా నాయకుడు డాక్టర్ రహమతుల్లా, మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్ పాల్గొన్నారు.

బాటసింగారం మార్కెట్‌లో దోపిడీ!

– కమీషన్ ఏజెంట్ల అక్రమ దందా

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్ అయిన గడ్డిఅన్నారంలో కొందరు కమీషన్ ఏజెంట్లు సరుకు తీసుకొస్తున్న వారిని నిలువునా దోచేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు, వ్యాపారులు పండ్లను బాటసింగారం మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. నిత్యం లారీల్లో టన్నులకొద్దీ పండ్లను తీసుకు వచ్చే వారిని కొత్త తరహాలో దోచేస్తున్నారు. టన్ను పండ్లు మార్కెట్‌కు తీసుకొస్తే, అందులో క్వింటాల్ పండ్లు ఉచితంగా కమీషన్ ఏజెంట్లకు ఇవ్వాల్సిందే. మార్కెట్‌లోకి సరుకు రాగానే కొందరు కమీషన్ ఏజెంట్లు ముందే సిగ్నల్ ఇస్తారు. దీంతో సదరు సరుకు తీసుకొచ్చిన వారు ఇవ్వడానికి సిద్ధం కావాల్సిందే. ఈ మార్కెట్‌కు తెలంగాణ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, రాజస్తాన్ వంటి రాష్ట్రాల నుంచి భారీగా పండ్లు వస్తుంటాయి. రోజుకు వందల సంఖ్యలో వచ్చే లారీల్లో టన్నుల కొద్దీసరుకు ఉంటుంది. గిట్టుబాటు ధరకోసం వస్తే కొందరు కమీషన్ ఏజెంట్లు వారికి గిట్టుబాటు ధర కల్పించకపోగా ఇంకొంత కొట్టేస్తున్నారు. మార్కెట్‌లో యథేచ్ఛగా జరుగుతున్న ఈ అక్రమదందాపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా కొనసాగుతోంది.

రెండు విధాలుగా మోసపోతున్న రైతులు

బాటసింగారం మార్కెట్‌కు రాలేని రైతులు నేరుగా సరుకులు తీసుకొచ్చే పరిస్థితి ఉండదు. రైతుల నుంచి కొందరు మధ్యవర్తులు ఉత్పత్తులను సేకరిస్తారు. ఇలా సేకరించిన ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకొచ్చి కమీషన్ ఏజెంట్ల ద్వారా అమ్మకాలు చేస్తారు. అంటే రైతులు తాము పండించిన ఉత్పత్తులను వారే నేరుగా అమ్ముకునే వీలుండదు. మధ్యవర్తుల ద్వారా సరుకులను విక్రయిస్తారు. మామిడి, ద్రాక్ష, యాపిల్స్, బత్తాయి, సంత్రాలు ఇలా రకరకాల పండ్లను మార్కెట్‌కు తీసుకొచ్చిన మధ్యవర్తులను కొందరు కమీషన్ ఏజెంట్లు నిలువునా దోచేస్తున్నారు.

ఓపెన్ వర్సిటీలో బీఎడ్ (ఓడీయల్) వెబ్ ఆప్షన్‌కు 30న ఆఖరు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఎడ్ (ఓడీయల్) ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ కోసం ఏప్రిల్ 30 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి తెలిపారు.

బీఎడ్ (ఓడీయల్) ప్రవేశ పరీక్ష 2023–24లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆప్షనల్ సబ్జెక్టుల ప్రకారం పది ప్రోగ్రామ్ సెంటర్లలో ఎక్కడ చేరాలనుకుంటున్నారో ప్రాధాన్యతా క్రమంలో ఆప్షన్స్ ఇవ్వాలని సూచించారు. మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను మే 8వ తేదీన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్లు వెల్లడించారు.

పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తుకు తుది గడువు మే 3

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ కోసం కామర్స్, ఇంగ్లిష్, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ కోర్సులలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు. మే 3వ తేదీలోపు దరఖాస్తు ఫీజు చెల్లించాలన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష మే 25న ఉదయం 9 ఉంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సాక్షి రియల్టీ

నిర్మాణ వ్యయం మన దగ్గరే తక్కువ



సాక్షి, హైదరాబాద్: ఇళ్ల ధరలలోనే కాదు వాటిని నిర్మించేందుకు అయ్యే వ్యయం కూడా హైదరాబాద్‌లోనే తక్కువ. నివాసాలు, వాణిజ్య భవన సముదాయాలు ఏవైనా సరే దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే గ్రేటర్‌లోనే తక్కువ నిర్మాణ వ్యయం అవుతుందని జేఎల్ఎల్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. 30, అంతకంటే ఎత్తయిన హైరైజ్ లగ్జరీ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి హైదరాబాద్‌లో చదరపు అడుగు (చ.అ.)కు రూ.4,000 నుంచి రూ.4,700 ఖర్చు అవుతుందని జేఎల్ఎల్ ఇండియా నివేదిక వెల్లడించింది. నగరంలో సిమెంట్ ధరలు తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. స్టీల్, రంగులు వంటి ఇతరత్రా నిర్మాణ సామగ్రి ధరలు మాత్రం ఎక్కువగానే ఉన్నాయని పేర్కొంది.

- చదరపు అడుగుకు రూ.4 వేల నుంచి 4,700 ఖర్చు
- ఇతర మెట్రోలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే తక్కువ
- సిమెంట్ ధరలు అందుబాటులో ఉండటమే కారణం

నగరాల వారీగా నిర్మాణ వ్యయం (చ.అ.కు)

నగరం	30, ఆపై అంతస్తులు	15 అంతస్తుల్లోపు
బెంగళూరు	4,020 - 4,700	2,600 - 3,000
చెన్నై	4,000 - 4,650	2,550 - 2,950
ఢిల్లీ	4,100 - 4,800	2,650 - 3,050
హైదరాబాద్	4,000 - 4,700	2,600 - 3,000
ముంబై	4,250 - 5,000	2,750 - 3,200


పెట్టుబడులకు గమ్యస్థానం..

తక్కువ నిర్మాణ వ్యయం కారణంగా రియల్ ఎస్టేట్ అభివృద్ధితో పాటు దేశ, విదేశీ నిర్మాణ సంస్థలు, పెట్టుబడులకు గమ్యస్థానంగా నగరం మారుతుందని తెలిపింది. ముంబైలో అత్యధిక నిర్మాణ వ్యయం అవుతుంది. ఇక్కడ చ.అ. నిర్మాణానికి రూ.4,250 నుంచి రూ.5,000 వ్యయం అవుతుంది. ఢిల్లీలో రూ.4,100 నుంచి రూ.4,800, పుణేలో రూ.4,050, నుంచి రూ.4,750 ఖర్చు అవుతుంది. మధ్య తరహా అపార్ట్‌మెంట్ల నిర్మాణంలోనూ మన నగరంలోనే తక్కువ ఖర్చు అవుతుంది. ఇక్కడ చ.అ. నిర్మాణానికి రూ.2,600 నుంచి రూ.3,000 వ్యయం అవుతుండగా.. ముంబైలో చ.అ.కు రూ.2,750 నుంచి రూ.3,200 ఖర్చు అవుతుంది.

వాణిజ్య భవనాలలోనూ ఇంతే..

కమర్షియల్ బిల్డింగ్‌ల నిర్మాణంలోనూ నగరంలోనే తక్కువ వ్యయం అవుతుంది. ముంబైలో హైరైజ్ కమర్షియల్ భవన నిర్మాణానికి చ.అ.కు రూ.3,650 నుంచి రూ.4,450 ఖర్చు అవుతుండగా.. హైదరాబాద్‌లో తక్కువగా రూ.3,100 నుంచి రూ.4,200 వ్యయం అవుతుంది.

అద్దెలు పెరిగాయి!



సాక్షి, హైదరాబాద్: ప్రీమియం ఇళ్లకు డిమాండ్, ఆఫీసు కేంద్రాలకు చేరువలో ఉండటం వంటి కారణంగా ప్రధాన నగరాలలో ఇళ్ల అద్దెలు వృద్ధి చెందుతున్నాయి. క్రితం త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది 24.2 శాతం మేర పెరిగాయని మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ నివేదిక వెల్లడించింది. అత్యధికంగా థానేలో 57.3 శాతం, గుర్గావ్‌లో 41.4 శాతం, గ్రేటర్ నోయిడాలో 28.7 శాతం, నోయిడాలో 25.2 శాతం వృద్ధి చెందాయి. దేశంలోని 13 నగరాలలో 67 శాతంగా ఉన్న 18–34 ఏళ్ల వయసు ఉన్న మిల్లీనియల్స్ వల్లే గృహాల అద్దెలు పెరిగాయి. సెమీ ఫర్నిష్ గృహాలను రెంట్‌కు తీసుకునేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ తరహా అద్దెలకు 52.7 శాతం డిమాండ్ ఉండగా.. సప్లయి 48.7 శాతం మాత్రమే ఉందని మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుధీర్ పాయ్ తెలిపారు. నెలకు రూ.10–30 వేలు మధ్య అద్దె ఉన్న మధ్యస్థాయి గృహాలకు 41 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారని పేర్కొన్నారు.

- 2024 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (హెచ్1) దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కార్యాలయాల అద్దెలు 7 శాతం మేర పెరిగాయి. నిర్మాణం, ఇన్‌పుట్ వ్యయం పెరగడమే ఇందుకు కారణమని అనరాక్ రిపోర్ట్ వెల్లడించింది. చెన్నై తర్వాత హైదరాబాద్‌లోనే ఆఫీసు స్పేస్ అద్దెలు అత్యధికంగా పెరిగాయి. ఏడాది కాలంలో చెన్నైలో 10 శాతం మేర వృద్ధి చెందితే.. నగరంలో 8 శాతం పెరిగాయని పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో నగరంలో నెలకు చ.అ. ఆఫీసు అద్దె రూ.61గా ఉండగా.. 2024 ఫైనాన్షియల్ ఇయర్ నాటికి రూ.66కు పెరిగాయి. అదే గ్రేడ్‌–ఏ ఆఫీసు అద్దె చ.అ.కు నెలకు 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.77.5గా ఉండగా.. ఇప్పుడది రూ.83కు పెరిగింది.

క్లుప్తంగా...

జేఈఈ మెయిన్‌లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట

కొత్తపల్లి (కరీంనగర్): గురువారం విడుదలైన ఐఐటీ–జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో తెలంగాణ, మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఈమేరకు కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్ విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి సన్మానించారు. ఎం.హర్షిత్ 252, ఎ.వర్ధన్‌రావు 444, పి.మనోహర్ 466, జి.శ్రీహాస్ 503, బి.భరద్వాజ్‌నాయక్ 781, పి.చందన 1,213, సత్యఅమూల్య 1,301, సుబోధ్‌చౌదరి 1,367, కె.శ్రీనిధి 1,562, ఎండీ.షఫీక్ 1,603, మిత్ర 1,612, సీహెచ్ అనూహ్య 1,632, ఎ.శివవరుణ్ 1,719, ఎస్.ప్రణయ్ 1,721, పి.రాహుల్ 1,751, ఎం.ప్రణీత్‌రెడ్డి 1,912, జె.ఉమామైత్ర 1,953, ఎల్.అరుణ్‌కుమార్ 2,353, సీహెచ్.సిద్ధార్థ 2,444, పి.రఘువీరారెడ్డి 2,510, కె.విశాల్‌రెడ్డి 2,557, కె.రోహన్‌ప్రీత్ 2,643, జె.హర్షవర్ధన్ 2,908, జి.లహరి 2,965వ ర్యాంకు సాధించి, అల్ఫోర్స్ సత్తాచాటారని పేర్కొన్నారు. అలాగే 1,000లోపు 5 ర్యాంకులు, 5,000లోపు 34 ర్యాంకులు వచ్చాయన్నారు. మొత్తం 461 మంది ఐఐటీ (అడ్వాన్స్‌డ్) పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. పిల్లలకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో ప్రత్యేక కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు



సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) కాలేజీల్లో ఇంజనీరింగ్ కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ అడ్వాన్స్‌డ్)కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభమవుతుంది. మెయిన్స్‌లో నిర్ణీత కటాఫ్ పర్సంటైల్ సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 7 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తారు. మే 10లోగా దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 26న దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహిస్తారు. అడ్వాన్స్‌డ్‌ను ఈసారి ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తోంది. ఈ పరీక్ష రాసేందుకు 2.5 లక్షల మందికి అర్హత దక్కింది.

ఇసుక క్వారీల్లో అక్రమ వసూళ్లను అరికట్టాలి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా టీఎస్ఎండీసీ నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లో అక్రమ వసూళ్లను అరికట్టాలని తెలంగాణ స్టేట్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం టీఎస్ఎండీసీ ఇన్‌చార్జ్ ఎండీ, ప్రిన్సిపల్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కాను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందుజాగ్రత్తగా డంపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కాలం దృష్ట్యా డ్రైవర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్, మంచినీటి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుండు లింగన్న గౌడ్, లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల ఆత్మహత్యలపై సీఎం రేవంత్ స్పందించాలి

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: గత నెల రోజులుగా సిరిసిల్లలో వరుసగా కొనసాగుతున్న నేతన్నల బలవన్మరణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీటిపై స్పందించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. చేతిలో పనిలేక ఆర్థిక ఇబ్బందులకు గురై నేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. నేత కార్మికుల ఆత్మహత్యలపై ఇప్పటి వరకూ ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

అడ్వాన్స్‌డే అసలు చాలెంజ్!

- ప్రిపరేషన్ ముమ్మరం చేసిన జేఈఈ మెయిన్ అర్హులు
- ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీటే లక్ష్యం
- గత కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్‌పై విద్యార్థుల్లో తగ్గుతున్న ఆసక్తి
- అర్హత సాధించినా దాదాపు 60 శాతం మందే పరీక్షకు హాజరవుతున్న వైనం
- కఠిన ప్రశ్నలు.. కష్టమని భావిస్తుండటమే కారణం!
- మెయిన్‌తో సరిపుచ్చుకుని ఎన్‌ఐటీల్లో చేరిక



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ ఫలితాలు వచ్చాయి. ర్యాంకులూ కేటాయించారు. విద్యార్థుల దృష్టంతా ఇప్పుడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పైనే ఉంటుంది. దేశంలోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీటు పొందాలంటే అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు రావాలి. దీంతో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన వాళ్లు, మంచి ర్యాంకు వస్తుందని ముందునుంచే విశ్వాసంతో ఉన్నవారు ఐఐటీల్లో సీటు లక్ష్యంగా ప్రిపరేషన్ ముమ్మరం చేశారు. అయితే అర్హత సాధించినప్పటికీ గత కొన్నేళ్లుగా విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌పై పెద్దగా ఆసక్తి చూపడం లేదని, పరీక్ష రాయడం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వీరంతా మెయిన్‌తో సరిపుచ్చుకుని ఎన్ఐటీల వంటి జాతీయ కాలేజీల్లో లేదా రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరిపోతున్నారు. మెయిన్‌లో మంచి ర్యాంకు వచ్చి, అడ్వాన్స్‌డ్‌లోనూ వస్తుందనే విశ్వాసం ఉన్నవాళ్ళు, దీనిని సవాల్‌గా తీసుకున్న వాళ్ళే సీరియస్‌గా ఈ పరీక్ష రాస్తున్నారు.

60 శాతమే రాస్తున్నారు..

జేఈఈ మెయిన్స్ పరీక్షను దేశవ్యాప్తంగా 11 లక్షల మందికిపైగా విద్యార్థులు రాస్తున్నారు. కటాఫ్ పర్సంటైల్ ప్రకారం ఏటా 2.4 లక్షల మందికి అడ్వాన్స్‌డ్‌కు అర్హత కల్పిస్తుంటారు. అయితే అర్హత ఉన్నవారిలో కేవలం 60%మంది మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరవు తున్నారు. జనరల్, రిజర్వుడ్ రెండు కేటగిరీ ల్లోనూ ఇదే ట్రెండ్ కన్పిస్తోంది. ఈ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) లెక్కల ప్రకారం 2017లో 2,21,834 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారు. వీరిలో 1,71,000 మంది మాత్రమే పరీక్ష రాశారు. 2022 నాటికి ఈ సంఖ్య ఇంకా తగ్గిపోయింది. 2.10 లక్షల మందికి పైగా అర్హత సాధిస్తే 1.55 లక్షల పైచిలుకు మాత్రమే రాశారు. 2023 లోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. మెయిన్స్ వరకూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న విద్యార్థులు అడ్వాన్స్‌డ్‌ను కష్టంగానే భావిస్తుండటమే ఇందుకు కారణం. కొన్నేళ్ళుగా అడ్వాన్స్‌డ్ పరీక్షలో కఠినమైన ప్రశ్నలు ఇస్తున్నార నేది విద్యార్థుల వాదన. ప్రత్యేక కోచింగ్ తీసుకుంటే తప్ప ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం కష్టసాధ్య మని అంటున్నారు. కరోనా తర్వాత రెండేళ్ళ పాటు విద్యార్థులు అన్ని రకాలుగా వెనుక బడ్డారు. ఇది కూడా అడ్వాన్స్ డ్‌లో సామర్థ్యం తగ్గడానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.

అర్హతలోనూ అంతంతే..

➤ విద్యార్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకే వెనుకంజ వేస్తుంటే, వారు చెబుతున్నట్టుగానే.. రాసిన వారిలో అర్హత శాతం కూడా రానురాను తగ్గిపోతోంది. ఏటా పట్టుమని 50 వేల మంది పాసవ్వడం కూడా కష్టంగానే ఉంది. దీంతో ఏటా అర్హత కటాఫ్ మార్కులు గణ నీయంగా తగ్గుతున్నాయి. దేశవ్యాప్తంగా 15 వేల ఐఐటీ సీట్లు ఉంటాయి. ఒక్కో సీటుకు ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తారు. వారి ర్యాంకును బట్టి సీటు కేటాయిస్తారు. అయితే కొన్ని కేటగిరీలకు ఇద్దరు చొప్పున కూడా పోటీ ఉండటం లేదని నిపుణులు చెబుతున్నారు. ఐఐటీ సీట్ల విషయంలో పోటీ పెరగాల్సిన అవసరముందని, అడ్వా న్స్‌డ్ ప్రశ్న పత్రాన్ని సరళీకరించడం ద్వారా విద్యార్థులను ఆకర్షించాల్సిన అవసరం ఉందని ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు ఎంఎస్ రావు పేర్కొన్నారు. ఇటీవల ఐఐటీలు కూడా తమ అధ్యయన నివేదికలో ఇదే విషయాన్ని స్పష్టం చేయడం గమనార్హం.

గత ఏడేళ్లుగా అడ్వాన్స్‌డ్ పరీక్ష వివరాలు

సంవత్సరం	అడ్వాన్స్‌డ్‌కు అర్హులు	పరీక్ష రాసినవారు	అర్హులైనవారు
2017	2,21,834	1,71,000	51,000
2018	2,31,024	1,65,656	31,988
2019	2,45,194	1,74,432	38,705
2020	2,50,681	1,50,838	43,204
2021	2,50,597	1,41,699	41,862
2022	2,10,251	1,55,538	40,712
2023	2,51,673	1,80,226	43,773

అడ్వాన్స్‌డ్‌లో తగ్గుతున్న అర్హత మార్కులు



కేటగిరీ	2017	2018	2019	2020	2021	2022	2023
జనరల్	128	90	93	69	63	55	54
ఈడబ్ల్యూఎస్	115	81	83	62	56	50	50
ఓబీసీ	64	45	83	62	56	50	48
ఎస్సీ	64	45	46	34	31	28	27
ఎస్టీ	64	45	46	34	31	28	26
పీడబ్ల్యూడీ	64	45	46	34	31	28	27

ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఆర్‌అండ్‌డీ

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్. చిత్రంలో గవర్నర్ రాధాకృష్ణన్

హైదరాబాద్/ బిజినెస్ బ్యూరో: పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) ఆర్థిక వ్యవస్థకు, దేశానికీ వెన్నెముక అని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. వ్యాక్సిన్ల తయారీలో ఉన్న భారత్ బయోటెక్‌ను జగదీప్ ధన్‌ఖడ్, ఆయన సతీమణి సుధేశ్ ధన్‌ఖడ్ శుక్రవారం సందర్శించారు. జీనోమ్ వ్యాలీలో ఉన్న భారత్ బయోటెక్ తయారీ కేంద్రంలో ఉప రాష్ట్రపతి ఔషధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ, ఆర్‌అండ్‌డీని ప్రోత్సహించడంలో భాగంగా విద్యా, పరిశోధన సంస్థలకు పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోని అనేక అగ్ర శ్రేణి సంస్థలు పూర్వ విద్యార్థుల నుండి బలాన్ని పొందుతున్నాయని గుర్తుచేశారు. పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని, బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పరచుకుని దేశాభివృద్ధికి దోహదపడాలని కోరారు. సైన్స్, పరిశోధనల ద్వారా మానవాళికి సేవ చేయాలనే ప్రయత్నాన్ని తాత్కాలిక వైఫల్యాలు అడ్డుకోకూడదని చెప్పారు. ఇటీవలి కాలంలో పద్మ అవార్డుల విశ్వసనీయత పెరిగిందని ఆయన ప్రశంసించారు. ఉప రాష్ట్రపతి వెంట తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ కూడా ఉన్నారు. కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా, ఎండీ సుచిత్ర ఎల్లా పాల్గొన్నారు.

సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో బీజేపీ నేతలు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ రంగాల ప్రముఖుల మద్దతును కూడగట్టేందుకు ఉద్దేశించిన సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ పోరాటయోధుడు, స్వా తంత్ర్య సమరయోధుడు స్వర్గీయ ఈశ్వరప్ప అలియాస్ జగదీశ్వర్ ఆర్య కుటుంబ సభ్యులను బీజేపీ నేతలు కలుసుకున్నారు. శుక్రవారం సుల్తాన్ బజార్‌లోని వారి నివాసానికి వెళ్లిన నేతలు కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్ద తునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, ఆలే భాస్కర్‌రాజ్ నేతృత్వంలోని విశేష్ సంపర్క్ అభియాన్ టీం పాల్గొంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మేధావులు పాటుపడాలి: జానారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో మేధావులు మౌనం వీడి లౌకిక, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కోరారు. జానారెడ్డి నివాసంలో శుక్రవారం ఉమ్మడి ఏపీ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ పంచాయితీరాజ్ ఎం.ఏ.కరీం, జర్నలిస్ట్ కోటగిరి దైవదీనంతో పాటు స్వచ్ఛంద సంస్థల నాయకులు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ...దేశంలో సుపరిపాలన కోసం యూపీఏ ప్రభుత్వం సమాచార హక్కు చట్టంతో, లోక్‌పాల్, పోక్సో, గృహ హింస, వయో వృద్ధుల సంక్షేమం, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి చట్టాలనెన్నో ప్రజలకు కాంగ్రెస్ అందించిందన్నారు. ఈ చట్టాలు ఇప్పుడు నిర్వీర్యం అవుతున్నాయని వాటిని రక్షించటానికి మేధావులు, విద్యావంతులు, ఆర్టీఐ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర నాయకులు వై.కృష్ణారెడ్డి, ఎంఏ కుర్షీద్ పాషా, జి.ముకుందరెడ్డి, వై.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు ఎక్కడున్నారో తెలియదు

రెడ్‌కార్నర్ నోటీసులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం: హైదరాబాద్ సీపీ



శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసుపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎక్కడ ఉన్నారో తెలియదని, ఆయన్ను రప్పించేందుకు ఇంటర్‌పోల్ సహాయంతో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అయితే ఇప్పటికే ప్రభాకర్‌రావుపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)ను మాత్రం జారీ చేసినట్లు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభాకర్‌రావును పట్టుకోవడం లేదని, ఇప్పటికే రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేశామంటూ ఊహాజనిత వార్తలతో దర్యాప్తును ఇబ్బందిపరుస్తున్నారన్నారు. దీంతో నిందితులు అప్రమత్తమయ్యే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నేతల ప్రమేయంపై కూడా అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు. సరైన సమయంలో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ కేసులో నిందితులంతా చాలా స్మార్ట్‌గా, ఇంటెలిజెంట్‌గా వ్యవహరించారని, వ్యక్తిగత జీవితాలకు భంగం కలిగించేలా ట్యాపింగ్ చేశారని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితాల్లోకి చొరపడటమనేది ఘోరమైన నేరమని, ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు అధికారుల ప్రమేయాన్ని గుర్తించి, వారిని అరెస్టు చేశామని చెప్పారు.



మంటల్లో తగలబడుతున్న పరిశ్రమ

వెల్డింగ్ చేస్తుండగా మంటలు అంటుకొని..

- రంగారెడ్డి జిల్లా నందిగామలోని అల్లెన్ హెర్బల్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం
- లోపల చిక్కుకున్న ఆరుగురిని కాపాడిన 15 ఏళ్ల బాలుడు

నందిగామ/షాద్‌నగర్: రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని అల్లెన్ హోమియో, హెర్బల్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ కర్మాగారంలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పరిశ్రమ కాలిబూడిదై రూ.కోట్లలో ఆస్తినష్టం సంభవించగా ఓ 15 ఏళ్ల బాలుడి సాహసం ఆరుగురి నిండు ప్రాణాలను కాపాడింది.

క్షణాల్లోనే అంటుకొని..

పరిశ్రమ ఆవరణలో కొందరు మరమ్మతు పనుల్లో భాగంగా వెల్డింగ్ చేస్తుండగా ఎగసిపడ్డ నిప్పురవ్వలు పక్కనున్న థర్మోకోల్, స్పాంజ్‌లపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఆపై క్షణాల్లోనే మంటలు ఆ పక్కనే నిల్వ ఉన్న రసాయనాలకు అంటుకోవడంతో ఫ్యాక్టరీ మొత్తం దగ్ధమైంది. ప్రమాద సమయంలో 70 మంది కార్మికులు విధుల్లో ఉండగా వెల్డింగ్ చేస్తున్న వారితోపాటు పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అయితే బయ టకు వెళ్లేందుకు వీల్లేక ఆరుగురు అక్కడే చిక్కుకుపోయారు.

భళారా బాలకా..



ప్రమాద వార్త తెలియగానే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న తన స్నేహితుడి తల్లి క్షేమ సమాచారం తెలుసుకొనేందుకు నందిగామకు చెందిన రేణుక, వెంకటేశ్ దంపతుల కుమారుడు సాయిచరణ్ అనే 15 ఏళ్ల బాలుడు అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే ఆమె బయటకు రాగా మరికొందరు కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నట్లు గుర్తించాడు. వెంటనే ఫ్యాక్టరీ గోడకు ఆనుకొని ఉన్న ఓ చెట్టెక్కి భవనం పైఅంతస్తులో ఉన్న కిటికీకి తాడు కట్టాడు. దీంతో ఆరుగురు కార్మికులు తాడు సాయంతో చెట్టుమీద నుంచి కిందకు క్షేమంగా దిగారు. ఇద్దరికి స్వల్ప గాయాలవగా షాద్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. సాయిచరణ్ ధైర్యసాహసా లను డీసీపీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మెచ్చుకున్నారు. అతనికి ధైర్యానికి ముచ్చటపడి ఎమ్మెల్యే నగదును బహుమతిగా ఇవ్వగా డబ్బు తీసుకుంటే తల్లిదండ్రులు తిడతారని.. అయినా తనకు డబ్బు వద్దని చెప్పాడు.

శవ రాజకీయాలు మానండి


- నేత కార్మికుల మరణానికి పదేళ్ల మీ పాలనా.. లేక నాలుగు నెలల మా ప్రభుత్వం కారణమా..?
- బీఆర్ఎస్ ప్రభుత్వ బకాయిలను మేము చెల్లిస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: నేత కార్మికుల ఆత్మహత్యలను రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న శవ రాజకీయాలను ఆపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి కల్పించింది.. గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్న మీరా లేక 4 నెలల కిందట అధికారంలోకి వచ్చి నా మేమా అన్నది ఆలోచించుకోవాలని సూచించారు. నేత కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తాము తీరుస్తున్నామని, ఇటీవల రూ.50 కోట్లు విడుదల చేశామని, మరో రూ.50 కోట్లు నేడోరేపో విడుదల చేస్తామ న్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డితో కలిసి మంత్రి పొన్నం విలేకరులతో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో చేనేత కార్మికులకు 12 వేల అంత్యోదయ కార్డులు ఇప్పించి 35 కిలోల బియ్యం ఇచ్చామని, 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కార్డులను రద్దు చేశారని మంత్రి ఆరోపించారు. కార్మికులు చేసిన పనికి ఎప్పటికప్పుడు మీరు నిధులు విడుదల చేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చిఉండేదా అని ప్రశ్నించారు. కార్మికులకు ధైర్యం కల్పించాల్సిందిపోయి మీ రాజకీయ లబ్ధికోసం శవ రాజకీయాలు చేయడం ఏమిటని మండిపడ్డారు. సిరిసిల్లనే కాదు రాష్ట్రంలో చేనేత కార్మికుల ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

సిరిసిల్లకు ఒక బ్రాండ్ ఉండాలి

ధర్మవరం, గద్వాల, పోచంపల్లి, సిద్దిపేట గొల్లభామ చీరలకు ఒక బ్రాండ్ ఉందని, అలాగే సిరిసిల్లకు ఒక బ్రాండ్ ఉండాలని మంత్రి సూచించారు. భవిష్యత్‌లో నేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ బ్రాంచ్ ఏర్పాటు చేసేలా అక్కడి ఉత్పత్తులకు ఆధునికత జోడిస్తామన్నారు. 40 వేల పవర్ లూమ్స్ రాష్ట్రంలో ఉంటే అందులో 30 వేల సిరిసిల్లలోనే ఉన్నాయని. ఇక్కడ క్లస్టర్ ఏర్పాటు చేయించలేకపోయారని బండి సంజయ్‌పై ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా ఉంటుందని, రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 10 లక్షల మేరకు ఆర్థిక సాయం అందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణకు విద్య, వైద్య, పరిశ్రమలను తేలేని మూర్ఖుడు సంజయ్ అని పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.



వారం రోజుల వ్యవధిలో సిరిసిల్లలో ముగ్గురు మృతి

చేనేత..చితికిపోయి

బతుకుదెరువు కరువై.. మనోధైర్యం కోల్పోతున్న నేతన్న..

సిరిసిల్ల: ఓవైపు పని లేదు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబసభ్యులకు అనారోగ్య సమస్యలు. ఫలితంగా ఆ'ధారం'కరువైంది. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గమే లేదు. మనోధైర్యం కోల్పోయి ఏం చేయాలో దిక్కు తోచక చేనేత కార్మికులు చితికిపోయే పరిస్థితులు దాపురించాయి. కేవలం వారం రోజుల వ్యవధిలో సిరిసిల్లలో ముగ్గురు చేనేత కార్మికులు తనువు చాలించారు.

ఏం జరుగుతోంది..

సిరిసిల్ల పట్టణంలో దాదాపు 80 శాతం మంది పద్మశాలి సామాజికవర్గానికి చెందినవారే. యజమానులు, ఆసాములు, కార్మికులు ఇలా మూడు వర్గాలుగా చేనేతలో పాలుపంచుకుంటున్నారు. స్థానికంగా 27వేల మరమగ్గాలు ఉండగా, వస్త్ర పరిశ్రమపై ఆధారపడి 25వేల మంది కార్మికులు జీవిస్తున్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 నుంచి బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ వస్త్రాల ఉత్పత్తి ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చింది. ఏటా రూ.350 కోట్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు రావడంతో సంక్షోభంలో ఉన్న పరిశ్రమ కోలుకుంది. ఇటీవల ప్రభుత్వం మారడంతో వస్త్రోత్పత్తి ఆర్డర్లపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన బట్టకు సంబంధించిన రూ.280 కోట్ల బకాయిలు ఇక్కడి వస్త్రోత్పత్తిదారులకు రావాల్సి ఉంది. బకాయిలు రాకపోవడంతో స్థానిక వస్త్రోత్పత్తిదారులు నూలు తెప్పించలేదు. దీంతో వస్త్రోత్పత్తికి విఘాతం ఏర్పడింది. సాంచాలు నిలిచిపోయి నేతన్నలకు ఉపాధి కరువైంది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి పాత బకాయిలు ఇప్పిస్తామని, ఇటీవల రూ.50 కోట్లు విడుదల చేయించారు. కానీ ఇంకా కార్మికులకు 10 శాతం నూలు సబ్సిడీ డబ్బులు రావాల్సి ఉంది. సిరిసిల్లలో వస్త్రోత్పత్తి పాక్షికంగా సాగుతోంది. అయితే కార్మికులకు పూర్తిస్థాయిలో పనిలేకుండా పోయింది.

ఆత్మహత్యల పరంపర..



➤ మార్చి 12న జిల్లా కేంద్రంలోని బీవై.నగర్‌కు చెందిన నేత కార్మికుడు తడుక శ్రీనివాస్(43) ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. భార్య లావణ్య, పిల్లలు అనూష, అక్షయలతో పుట్టింట్లో వేరుగా ఉండగా.. తల్లి లచ్చవ్వతో ఉంటున్న శ్రీనివాస్ కుటుంబకలహాలు.. ఆర్థిక ఇబ్బందులు, పనిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్నాడు.



➤ ఏప్రిల్ 6న సిరిసిల్ల శివారులోని రాజీవ్‌నగర్‌లో కాటన్ కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ(66) ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. భార్య వజ్రవ్వ పక్షవాతంతో బాధపడుతోంది. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణం.



➤ ఏప్రిల్ 18న సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన నేత కార్మికుడు ఈగ రాజు(45) ఆకలితో అలమటించి రామడుగు మండలం వెదిర శివారులో చనిపోయాడు. అతని భార్య రేఖ రాజు మృతదేహాన్ని గుర్తించింది.

➤ ఏప్రిల్ 25న తంగళ్లపల్లి శివారులోని ఇందిరానగర్‌కు చెందిన నేతకార్మికుడు ఆంకారపు మల్లేశం(57) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 40 ఏళ్లుగా సాంచాలు నడుపుతున్న మల్లేశంకు ఇటీవల పని లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. ఇదేరోజు జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌కు చెందిన యువ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి(26) ఇంట్లోనే ఉరివేసుకొని ఉసురు తీసుకున్నాడు. తండ్రికి పక్షవాతం, తల్లికి అనారోగ్యం.. సాయికి పని లేక ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడు.



మల్లేశం



సాయి

శాశ్వత పరిష్కారం ఇలా..

➤ నేత కార్మికులు పనిలేని రోజుల్లో మరో పని చేసుకునేలా ప్రత్యామ్నాయ పని విధానం ప్రవేశపెట్టాలి.

➤ సిరిసిల్ల వస్త్రపరిశ్రమ మొత్తంగా ప్రైవేట్ యజమానుల చేతుల్లో ఉంది. సిరిసిల్లలో ప్రభుత్వపరంగా నూలు డిపోలు ఏర్పాటు చేయాలి. ఆధునిక మగ్గాలను ఏర్పాటు చేసి, నాణ్యమైన వస్త్రాన్ని ఉత్పత్తి చేయాలి.

➤ రూ.300కోట్లతో నిర్మించిన అపెరల్ పార్క్‌లో ఆధునిక మగ్గాలు ఏర్పాటు చేసి కార్మికులను ఆసాములుగా మార్చితే.. మెరుగైన వేతనాలతో వారి బతుకులు గాడిన పడతాయి.

➤ కార్మికులకు సూక్ష్మ రుణాలు అందించాలి.

➤ ప్రభుత్వపరంగా వైద్యసేవలు విస్తరించాలి. ఏ జబ్బు పడినా ఉచితంగా మెరుగైన వైద్యం లభిస్తే నేతన్నలకు భరోసా ఉంటుంది.


ప్రతీకాత్మక చిత్రం

పరంపర

సెలవులొచ్చేశాయ్ ఫోన్ పక్కన పడేద్దామా

సెలవులొచ్చేది ఆటల కోసం, స్నేహాల కోసం బంధువుల కోసం, విహారాల కోసం, వినోదాల కోసం పిల్లలు ఇంతకాలం ఫోన్లలో కూరుకుపోయారు. వారిని ఫోన్ల నుంచి బయటకు తెండి. మీ బాల్యంలో సెలవుల్లో ఎలా గడిపారో అలా గడిపేలా చేయండి. పెద్దయ్యాక తలుచుకోవడానికి బాల్యం లేకపోవడానికి మించిన విషాదం లేదు.

ఆటస్థలాలు లేని స్కూళ్లలో చదివించడం, ఆడుకునే వీలు లేని ఇళ్లలో నివసించడం, పార్కులు లేకపోవడం, ఆడుకోవడానికి తోటి పిల్లలు లేని వాతావరణంలో జీవించడం, ఇవన్నీ ఉన్నా పిల్లలతో గడిపే సమయం తల్లిదండ్రులకు లేకపోవడం... వీటన్నింటి వల్ల పిల్లలకు స్కూల్, ఇల్లు కాకుండా తెలిసింది ఒకే ఒక్కటి. సెల్‌ఫోన్. పిల్లలకు సెల్‌ఫోన్లు ఇచ్చి వారు వాటిలో కూరుకుపోతే 'అమ్మయ్య. మా జోలికి రావడం లేదు' అనుకునే తల్లిదండ్రులు ఉన్న ఈ కాలంలో పిల్లలకు ఆరోగ్యకరమైన ఆటలు, విహారం, అనుబంధాల విలువ, కొత్త విషయాల ఎరుక ఎలా కలుగుతుంది?

అందుకే వేసవి సెలవలు ఒక పెద్ద అవకాశం. ఇరవై ముప్పై ఏళ్ల క్రితం వరకు తెలుగు ప్రాంతాలలో వేసవి సెలవులు వస్తే పిల్లలు ఎలా గడిపేవారో ఇప్పుడూ అలా గడిపే అవకాశం కల్పించవచ్చు. కాకుంటే తల్లిదండ్రులు ప్రయత్నించాలి. పిల్లలను మోటివేట్ చేయాలి.

బంధువులు- బంధాలు

బంధువులు ఎవరో తెలియకపోతే బంధాలు నిలవవు. ఎంత స్వతంత్రంగా జీవిద్దామనుకున్నా, సాటి మనుషుల విసిగింపును తప్పించుకుని తెగదెంపులు చేసుకుని బతుకుదామనుకున్నా మనిషి సంఘజీవి. అతడు బంధాలలో ఉండాల్సిందే. బంధాల వల్ల బతకాల్సిందే. పిల్లలకు బంధాలు బలపడేది, బంధాలు తెలిసేది వేసవి సెలవుల్లోనే. ఇంతకు ముందు పిల్లలు వేసవి వస్తే తల్లిదండ్రులను వదిలిపెట్టి పిన్ని, బాబాయ్, పెదనాన్న, తాతయ్య... వీళ్ల ఇళ్లకు వెళ్లి రోజుల తరబడి ఉండేవారు. వారి పిల్లలతో బంధాలు ఏర్పరుచుకునేవారు. దీని వల్ల కొత్త ఊరు తెలిసేది. ఆటలు తెలిసేవి. కలిసి వెళ్లిన సినిమా అలా ఓ జ్ఞాపకంగా మిగిలేది. ఇవాళ పెద్దల పట్టింపులు పిల్లలకు శాపాలవుతున్నాయి. రాకపోకలు లేని బంధుత్వాలతో పిల్లలు ఎక్కడకూ వెళ్లలేని స్థితి దాపురించింది. దీనిని సరి చేయాల్సిన బాధ్యత పెద్దలదే. లేకుంటే పిల్లలు ఫోన్లనే బంధువులుగా భావించి అందులోని చెత్తను నెత్తికెక్కించుకుంటారు. జీవితంలో సవాళ్లు ఎదురైన సమయంలో ఒంటరితనం ఫీలయ్యి అతలాకుతలం అవుతారు.

తెలుగు ఆటలు

సెలవుల్లో పిల్లలకు తెలుగు ఆటలు తెలియడం ఒక పరంపర. బొంగరాలు, గోలీలు,



వామనగుంటలు, పరమపదసోపాన పటం, ఒంగుళ్లు-దూకుళ్లు, నేల-బండ, ఏడుపెంకులాట, పులి-మేక, నాలుగు స్తంభాలాట, వీరి వీరి గుమ్మడిపండు, లండన్ ఆట, రైలు ఆట, పొడుపుకథలు విప్పే ఆట, అంత్యాక్షరి, కళ్లకు గంతలు... ఈ ఆటల్లో మజా తెలిస్తే పిల్లలు ఫోన్ ముట్టుకుంటారా?

కథ చెప్పుకుందామా

కథలంటే పిల్లలకు ఇష్టం. పెద్దలు చెప్పాలి గాని. ఈ సెలవుల్లో రాత్రి పూట భోజనాలయ్యాక, మామిడి పండ్లు తిన్నాక, పక్కలు వేసుకుని అందరిని కూచోబెట్టి పెద్దలు కథలు చెప్తే ఎన్నెన్ని తెలుస్తాయి! ఎన్ని ఊహల కవాటాలు తెరుచుకుంటాయి. మర్యాద రామన్న, తెనాలి రాముడు, బేతాళుడు, సింద్‌బాద్, ఆలీబాబా, పంచతంత్రం, రామాయణం, మహాభారతం... భీముడిలోని బలం, అర్జునుడిలోని నైపుణ్యం... ఇవి కదా చెప్పాలి.

బలం కోసం తిండి:

పిల్లలను సరిగ్గా గమనించి వారికి కావలసిన బలమైన తిండి తినిపించడానికి వీలయ్యేది ఈ సెలవుల్లోనే. బలహీనంగా ఉండే పిల్లలు, ఎదిగే వయసు వచ్చిన ఆడపిల్లలకు ఏమేమి వొండి తినిపించాలో పెద్దల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు ఈ కాలంలో తినిపిస్తారు. శిరోజాల సంరక్షణ, చర్మ సంరక్షణ, పంటి వరుస సరి చేయించడం, జీర్ణశక్తిని ఉద్దీపన చేయడం, బంధువుల రాక వల్ల లేదా బంధువుల ఇంటికి వెళ్లడం వల్ల పిల్లలందరికీ కలిపి వారికి వృద్ధి కలిగించే ఆహారం చేసి పెట్టవచ్చు. తోటి పిల్లలు పక్కన ఉంటే ఇష్టం లేకపోయినా పిల్లలు తింటారు.

సెలవులొచ్చేది పిల్లల మానసిక, శారీరక వికాసానికి. కదలకుండా మెదలకుండా ఫోన్ పట్టుకుని కూచుని వారు ఈ సెలవులు గడిపేస్తే నింద తల్లిదండ్రుల మీదే వేయాలి... పిల్లల మీద కాదు.

గెలుపు దారి

పాకశాస్త్ర ప్రవీణ

చండీగఢ్‌కు చెందిన 23 సంవత్సరాల దేవిక మస్‌చందానీ ఇప్పుడు న్యూయార్క్‌లోని ప్రముఖ చెఫ్‌లలో ఒకరు. వంటలకు సంబంధించిన ఎన్నో పోటీల్లో బహుమతులు గెలుచుకుంది. పేస్ట్రీ చెఫ్‌గా రకరకాల ప్రయోగాలు చేస్తూ తనదైన ప్రత్యేకత చాటుకుంటోంది.

చిన్నప్పటి నుంచి దేవికకు వంటలన్నా, కొత్త వంటకాల గురించి తెలుసుకోవడం అన్నా చాలా ఇష్టం. ఆ ఇష్టమే తనని చండీగఢ్ వీధుల నుంచి న్యూయార్క్‌లోని ప్రసిద్ధ రెస్టారెంట్‌ల వరకు తీసుకెళ్లింది. ఆమె కుటుంబంలో, బంధువులలో పాకశాస్త్ర ప్రవీణులు ఎంతో మంది ఉన్నారు. వారి దగ్గరి నుంచి ఎన్నో కుటుంబ వంటకాలను నేర్చుకుంది.


వంటలపై దేవిక ఇష్టం ఎక్కడిదాకా వెళ్లిందంటే న్యూయార్క్‌లోని కలినరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికా(సిఐఎ)లో చదివే వరకు. పాకశాస్త్ర పరిధిని విస్తరించుకోవడానికి, ప్రావీణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఈ చదువు దేవికకు ఉపయోగపడింది.

'సిఐఎ'లో అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డ్ నుంచి నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఇచ్చే అవార్డ్ వరకు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్ఏ బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్' పోటీల్లో పాల్గొనడం దేవిక కేరీర్‌లో మైలురాయిగా నిలిచింది. ఆ పోటీలో పాల్గొన్న ఏకైక భారతీయురాలిగా గుర్తింపు పొందింది. అంతేకాదు, ఆ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం తనని రెండు అడుగులు ముందుకు వేసేలా చేసింది. ప్రసిద్ధ 'గాబ్రియెల్' రెస్టారెంట్‌కు సంబంధించి ముఖ్యమైన ఈవెంట్స్‌కు నాయకత్వం వహించేలా చేసింది.

ఆ రెస్టారెంట్‌లో ఎప్పటికప్పుడూ కొత్త కొత్త సవాళ్లు ఎదురయ్యేవి. క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి బాగా తెలిసిన దేవిక ఆ సవాళ్లను అధిగమించింది.

ఒక విజేతగా సిఐఎ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం చేసే


దేవిక మస్‌చందానీ

అవకాశం దేవికకు వచ్చింది. 'పాత్ వేస్ టు ఎక్సలెన్స్' అంశంపై స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేసింది. 'ఎగ్జయిట్‌మెంట్‌కు ఎనర్జీ తోడైతే ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు' అంటుంది దేవిక.

'స్కిల్స్ యూఎస్ఏ' రాష్ట్ర స్థాయి పోటీలకు న్యాయనిర్ణేత పాత్ర పోషించిన దేవిక 'బేకింగ్ అండ్ పేస్ట్రీ ఆర్ట్స్'కు సంబంధించిన పోటీకి పోటీ పడుతున్న తరువాతి తరం విద్యార్థులకు మార్గనిర్దేశం చేసింది.

సూపర్ స్పీకర్

దేవిక మస్‌చందానీ చెఫ్ మాత్రమే కాదు స్ఫూర్తిదాయక వక్త కూడా. ఆమె వంటలతో పాటు ఉపన్యాసాలకు కూడా ఎంతోమంది అభిమానులు ఉన్నారు. పనిచేస్తున్న క్రమంలోనే క్రైసిస్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన సూత్రాలు పట్టుబడతాయని చెబుతుంది దేవిక. చదువుల కోసం వేరే దేశం వెళ్లే విద్యార్థులకు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి. తాను అమెరికాకు వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్లు ఎదురయ్యాయి, వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు చెబుతుంటుంది దేవిక.



'ఎంతో కొంత నేర్చుకున్నాను అనే తృప్తి కంటే 'ఇంకా ఎంతైనా నేర్చుకుంటాను' అనే దాహం విజయానికి దారి చూపుతుంది అంటుంది దేవిక.

'లక్ష్యం మీద అయోమయం కాదు స్పష్టత ఉండాలి' అంటున్న దేవిక ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తుంది.

పేస్ట్రీ చెఫ్ కావాలనే కలతో చండీగఢ్ నుంచి అమెరికాకు వెళ్లిన దేవిక తన కలను నెరవేర్చుకోవడమే కాదు చిన్న వయసులోనే ప్రముఖ 'పేస్ట్రీ చెఫ్'గా పెద్ద పేరు తెచ్చుకుంది.

స్త్రీ శక్తి

సముద్రంపై సాహస సంతకం



'భయంతో కాదు ప్రేమతో మాత్రమే సముద్రంలో ప్రయాణం చేయగలం' అనే మాట ఉంది. వందమందిలో ఒకరిగా సముద్రప్రయాణం వేరు. ఒకరిద్దరుగా వేరు. దిల్నా కె, రూప ఎ ఇరవై రెండు రోజుల పాటు సముద్ర ప్రయాణం చేశారు. కొన్నిసార్లు సముద్రం తన మౌన గాంభీర్యాన్ని వీడి కోపంతో గర్జించేది. ప్రశాంతం అనుకున్న సాగరంలో కల్లోలం మొదలయ్యేది. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులకూ ఈ ఇద్దరూ భయపడలేదు.

భారతీయ నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా కె, లెఫ్టినెంట్ కమాండర్ రూప ఎ 'ఐఎన్ఎస్వీ' తరిణితో సముద్ర సాహస యాత్రని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా ప్రత్యేకత చాటుకున్నారు. 'తరిణి' నౌకలో గోవా నుంచి బయలుదేరి 22 రోజుల తరువాత మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు చేరుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని విజయవంతంగా సముద్రయాత్ర చేసిన దిల్నా, రూపలు శభాష్ అనిపించుకున్నారు.

ఫిబ్రవరి 28న గోవాలోని ఐఎన్ఎస్వీ మండోవి నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు బయలుదేరింది తరిణి. గమ్య స్థానానికి చేరుకున్న తరువాత రెండు దేశాల (భారత్, మారిషస్)ల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించడానికి సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు, విన్యాసాల్లో మారిషస్ కోస్టు గార్డ్‌లతో కలిసి పాల్గొన్నారు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, లెఫ్టినెంట్ కమాండర్ రూప.

'ఈ ఘనత సాధించిన తొలి భారతీయులుగా నిలిచారు. వీరి విజయం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది' అని దిల్నా, రూపలను ప్రశంసించింది నావికాదళం.

సముద్ర ప్రయాణ కాలంలో భారీ గాలులు, ప్రతికూల సముద్ర పరిస్థితుల రూపంలో దిల్నా, రూపలకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు.

'ఒక్కసారి అధైర్యపడితే ఓటమికి ఆహ్వానం పంపినట్లే.

రెండోసారి అధైర్య పడితే ఓటమి మీ గుమ్మం వరకు వచ్చినట్లే.

మరోసారి కూడా భయపడితే ఓటమి ఇంట్లోకి వచ్చినట్లే' అని శిక్షణ సమయంలో విన్న మాటను వారు బాగా గుర్తుపెట్టుకున్నారు.

సముద్రమంత సాహసం


దిల్నా


రూప

నాలుగు ప్రయత్నాల తరువాత అయిదోసారి నేవీకి ఎంపికైంది కేరళలోని కోజికోడ్‌కు చెందిన దిల్నా కె. నావికాదళంలోకి ప్రవేశించడానికి ముందు ఆర్చరీ, క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంది. నేవీ షూటింగ్ టీమ్‌లో ఒకరైన దిల్నాకు రొటీన్ యాత్రల కంటే సాహస యాత్రలు అంటే ఇష్టం. పుదుచ్చేరికి చెందిన రూప అలగిరిసామికి స్ఫూర్తి... కల్పనాచావ్లా. చెన్నైలో ఏరోనాటికల్ ఇంజినీరింగ్ చేసింది. సాహసాలకు మారుపేరుగా నిలిచిన మహిళల జీవితచరిత్రలు చదవడం అంటే ఇష్టం. ఈ ఇద్దరికి ప్రముఖ నావికుడు, గోల్డెన్ గ్లోబ్ రేస్ హీరో అభిలాష్ టోమి (రిటైర్డ్) శిక్షణ ఇచ్చారు. ఐఎన్ఎస్వీ నౌకలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన భారతీయుడిగా టోమి రికార్డ్ సృష్టించాడు. గత సంవత్సరం దిల్నా కె, రూపలు ఆరుగురు సభ్యుల బృందంతో కలిసి గోవా నుంచి కేప్‌టౌన్ మీదుగా రియో డి జనీరోకు 188 రోజుల పాటు నౌకాయానం చేశారు.

ఈ నెల 21న గోవాలోని మండోవికి తిరిగి వచ్చిన ఐఎన్ఎస్వీ తరిణికి నావికా సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సముద్ర యాత్రకు దిల్నా, రూపలను తేలిగ్గా ఎంపిక చేయలేదు. కఠినమైన ఎంపిక ప్రక్రియతో అనేక వడపోతల ద్వారా వీరిని ఎంపిక చేశారు.

వీరి సాహసం ఇక్కడితో ఆగిపోదు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్న 'సాగర్ పరిక్రమ' అనే భూగోళ ప్రదక్షిణ కోసం ఈ ఇద్దరూ సన్నద్ధమవుతున్నారు.

'సాహసం' లోని విశేషం ఏమిటంటే... దానిపక్కన ఫుల్‌స్టాప్ ఎప్పుడూ ఉండదు. ఒక సాహసం మరో సాహసాన్ని ప్రేరేపిస్తుంది. విజయం సాధించేలా చేస్తుంది. 'సాగర్ పరిక్రమ'లో కూడా దిల్నా, రూపలు విజయం సాధించాలని ఆశిద్దాం.

ఇంటి పనులతోనే రోజంతా గడిచిపోతుంటుంది అభిరుచిని మెరుగుపరుచుకోవాలన్నా సమయమే సరిపోదనిపిస్తుంది. కానీ, కొందరు మాత్రమే ఉన్న కాస్త సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమతోపాటు మరికొందరికి ఉపాధి అవకాశాలను అందిస్తుంటారు. ఈ కోవకే చెందుతారు సవిత ఆలంపల్లి. తెలంగాణలోని జహీరాబాద్ వాసి అయిన సవిత కాటన్ ఫ్యాబ్రిక్‌పైన సహజసిద్ధమైన పువ్వులు, ఆకులతో సహజమైన ప్రింట్లను తీసుకువస్తుంది. అదే ఫ్యాబ్రిక్‌ని ఉపయోగిస్తూ మోడ్రన్ డ్రెస్సులను డిజైన్ చేస్తోంది. వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ, బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేసి, సెల్ఫ్ మేడ్ బిజినెస్ ఉమన్‌గా తనని తాను నిరూపించుకుంటుంది. ఆసక్తిని ఉపాధిగా మలుచుకునేందుకు చేసిన ప్రయాణంలో తాను వేసిన అడుగుల గురించి ఆనందంగా వివరించింది.

ఆకులో ఆకునై..

ఎకో ఫ్రెండ్లీ డ్రెస్ డిజైనింగ్


సవిత


వర్క్‌షాప్

"డిగ్రీ వరకు చదువుకున్న నేను పెళ్లయ్యాక మావారు రామకృష్ణతో కలిసి అమెరికాకు వెళ్లాను. గృహిణిగానే కొన్నాళ్లు ఉండిపోయాను. న్యూయార్క్ ఎఫ్ఐటిలో ఫ్యాషన్ డిజైనింగ్‌కి సంబంధించిన కోర్స్ చేశాను. పదేళ్ల క్రితం ఇండియా వచ్చి బెంగళూరులో స్థిరపడ్డాం. రోజంతా ఇంటిపనులు, పిల్లల పనులు ఉన్నా నా కోసం కొంత సమయాన్ని కేటాయించుకునేదాన్ని. ఫాస్ట్ ఫ్యాషన్‌లో ఉపయోగించే ఫ్యాబ్రిక్ తీవ్రమైన కాలుష్యానికి గురి చేస్తుందని తెలుసుకున్నాను. అప్పటినుంచి నా వంతుగా ఏదైనా చేయాలనుకుని ప్రయత్నాలు చేస్తుండేదాన్ని. ఫ్లోర్ క్లీనర్స్, సుగంధ ద్రవ్యాలు వంటివి ఇంట్లో తయారు చేస్తుండేదాన్ని. వాటివల్ల ఇంట్లో వాళ్లు కూడా చాలా మెచ్చుకునేవారు. ఎకో ప్రింటింగ్, సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్స్ పైన వర్క్ చేయడం మొదలుపెట్టాను. ప్రకృతి ద్వారా లభించే వస్తువులతో రోజూ ఏదో ఒక ప్రయోగం చేస్తుండేదాన్ని.

ఆకులు – పువ్వులు

పూజలు, ఇతర సంప్రదాయ వేడుకలలో పువ్వులు, ఆకులను కూడా ఉపయోగిస్తుంటాం. సాధారణంగా వాటిని ఉడకబెట్టి, టై అండ్ డై చేస్తుంటారు. నేను వాటిని ఎండబెట్టి, కొన్నింటిని తాజాగా ఉన్నప్పుడే ఫ్యాబ్రిక్ మీద చల్లి, దగ్గరగా చుట్టి, కొన్ని రోజులు అలాగే ఉంచి ప్రయోగాలు చేసేదాన్ని. ప్రయత్నాలు చేయగా చేయగా ఫ్యాబ్రిక్‌పైన రకరకాల డిజైన్స్ అమితంగా నన్ను ఆకట్టుకున్నాయి. మోదుగ, శంఖపుష్ప, పారిజాత.. వంటివే కాదు అరుదుగా పూసే పువ్వులనూ సేకరిస్తాను. వాటిని ఎండబెట్టి నిల్వ ఉంచుతాను. మామిడి, జామ, మందార ఆకులనూ డిజైన్స్‌కు వాడుతుంటాను. ఏ మాత్రం రసాయనాలు లేని ప్రయోగం ఇది.







ఇంటి నుంచి స్టూడియో వరకు

రసాయనాలతో పండించే పత్తి కాకుండా వర్షాధార పంటద్వారా వచ్చే కాటన్ ఫ్యాబ్రిక్‌ను కలెక్ట్ చేసి, నా ప్రయత్నాలను ఇంకా విరివిగా చేయడం మొదలుపెట్టాను. సస్టెయినబుల్ డ్రెస్సులు అంటే చాలావరకు వదులుగా ఉండే దుస్తులు అనుకుంటారు. కానీ, మంచి ఫిటింగ్, డిజైన్, ప్రింట్లతో ఈ తరం మెచ్చేలా డ్రెస్ డిజైనింగ్ చేయాలనుకున్నాను. కార్పొరేట్ ఉమెన్‌కు నప్పే విధంగా, అలాగే టీనేజ్ కలెక్షన్స్ కూడా ప్రిపేర్ చేస్తుంటాను. ఎకో ఫ్రెండ్లీ ఫ్యాబ్రిక్, ప్రింటింగ్.. డ్రెస్సులు ధరిస్తే ఒంటికి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. ప్రకృతికి దగ్గరగా ఉన్నామన్న అనుభూతి సొంతం అవుతుంది. ఏడెనిమిదేళ్లుగా సస్టెయినబిలిటీ మీద రకరకాల ప్రయోగాలు చేసి, ఐదేళ్ల క్రితం 'టింక్టోరియా' పేరుతో బెంగళూరులో స్టూడియో ఏర్పాటు చేశాను. ఆకులలో ఉండే జీవాన్ని టింక్టోరియా అంటారు. దానిని ఫ్యాబ్రిక్ మీదకు తీసుకురావాలని చేసిన ప్రయత్నం కాబట్టి అదే పేరును నా డిజైన్స్‌కు పెట్టాను. ఇంటినుంచి స్టూడియోదాకా మారేందుకు చేసిన రకరకాల ప్రయోగాల వల్ల ఇప్పుడు నాతో పాటు మరో ఐదుగురు మహిళలకు ఉపాధి అవకాశాలు లభించాయి. మేమంతా కలిసి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌కు వచ్చిన ఆర్డర్స్ ప్రకారం పని చేస్తుంటాం.

అవగాహనకు వర్క్‌షాప్స్

ఎకోప్రింటింగ్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి హైదరాబాద్, బెంగళూరు ఇతర క్రాఫ్ట్ ఎగ్జిబిషన్స్‌లలో ఉచితంగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను. స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాను. అక్కడి వచ్చి, ఆసక్తితో నేర్చుకుంటాను అనేవారు మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసి ప్రింటింగ్ ప్రాసెస్ అడుగుతుంటారు. చాలా మందికి ఆకులతోనూ, పువ్వులతోనూ డిజైన్ చేస్తారని తెలియదు. ఈ డిజైన్ ఉతికితే పోతుందేమో అనుకుంటారు. కానీ, సరైన విధంగా చేస్తే రంగు ఏ మాత్రం పోదు. ముందు కుంకుడుకాయ రసంతో ఫ్యాబ్రిక్‌ను శుభ్రం చేస్తాం. ఆ తర్వాత ఆకులను, పువ్వులను అనుకున్న డిజైన్స్‌లో అమర్చి, దగ్గరగా చుట్టి, ఆవిరిమీద ఉంచుతాం. ఆ తర్వాత బయటకు తీసి, ఒక రోజంతా అలాగే ఉంచుతాం. ఆ తర్వాత పూర్తిగా విప్పి, క్లాత్‌ని శుభ్రం చేస్తాం. సరైన డిజైన్ రావడానికి 3 నుంచి 4 రోజుల సమయం పడుతుంది. షిబోరి, టై అండ్ డై, కలంకారీ డిజైన్స్‌తోపాటు నేతకారులతో ముందే మాట్లాడి ఫ్యాబ్రిక్ డిజైన్‌లో మోటిఫ్ ప్రింట్స్ వచ్చేలా గైడెన్స్ ఇస్తుంటాను. కొన్ని రకాల ఆకులు, పువ్వుల ప్రింటింగ్‌లో థ్రెడ్ వర్క్ కూడా ఉంటుంది. ప్రకృతిపైన ప్రేమ, ఇష్టంతో నన్ను నేను కొత్తగా మార్చుకునే క్రమంలో ఎంచుకున్న మార్గం ఇది. ఇంట్లో వాడాల్సిన కెమికల్స్ స్థానంలో ఏ మాత్రం రసాయనాలు లేని వస్తువులను తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటాను. ఈ విధానం వల్ల ఐదారేళ్లలో నాదైన ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మించుకున్నాను అనిపిస్తుంది' అని ఆనందంగా వివరిస్తారు సవిత.


మోడల్

– నిర్మలారెడ్డి



ఏం తినాలి? ఎలా తినాలి?



కూరలను బాగా నూనె పోసి వేయించి ఉప్పూకారం మసాలా దట్టించినందువల్ల నోటికి రుచిగా ఉండచ్చేమోగాని ఆ కూరలలోని పోషక విలువలన్నీ చచ్చిపోయి నిస్సారమవుతాయి. త్వరగా జీర్ణం కావు. నూనె ఎక్కువైనందువల్ల రక్తంలో కొలెస్ట్రాల్ పెరగటం, శరీరంలో కొవ్వు పేరుకుపోయి స్థూలకాయం రావటం తదితర ఇబ్బందులు తలెత్తుతాయి. విపరీతంగా ఉడకబెట్టినా అంతే... సారం లేని పదార్థాన్ని తిన్నట్టే. అది తినడం వల్ల ఆ ఆహారం మన ఒంటికి పట్టదు. అసలు మనం ఎలాంటి కూరలను ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం.

మనం తిన్న ఆహారం వంటబట్టాలంటే నూనెలో వేయించిన కూరలను తినే అలవాటును మానుకోవాలి. ఉడికించిన కూరలలో కొద్దిగా తాలింపు వేసుకుని తినే విధంగా మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి.

గింజధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, దుంపలు, పండ్లు అన్నింటిలోను అన్ని రకాల పోషకాలు ఉన్నాయి. వాటి మోతాదుల్లో మాత్రమే తేడా ఉంటుంది. అందువల్ల మనకు అన్నీ అవసరమే. అయితే అన్నీ అందరికీ ఒకే రీతిలో అవసరం కావు. ఉదాహరణకు పాలు తాగే పసిపిల్లలకు ఒకరకమైన పోషకాలు కావాలి. చిన్న పిల్లలయితే మరొక రకమైన పోషకాలు కావాలి. యుక్తవయస్కులకు ఇంకొక రకం పోషకాలు కావాలి. అదేవిధంగా గర్భిణులకు ఒక రకమైన పోషకాలు, పెద్దవారికి, వృద్ధులకూ మరొక రకమైన పోషకాలూ కావాలి. అంటే అవసరాలనుబట్టి పోషకాలు మారతాయి. కాబట్టి తీసుకోవలసిన ఆహారం కూడా మారుతుంది. అదే విధంగా ఆహార చికిత్సా ప్రక్రియలో కూడా వ్యాధిని బట్టి, రోగిని బట్టి తీసుకోవలసిన ఆహారం మారుతుంది. ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం అంటే ఇదే.

నిజానికి ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం అనుకున్నంత తేలికకాదు. పోషకాలను బట్టి పరిశీలిస్తే గింజధాన్యాలలో అన్ని రకాల పోషక విలువలు సమృద్ధిగా ఉన్నాయని, ఆకు కూరలు, పండ్లు, దుంపలతో సహా బాదం, ఖర్జూర మొదలైన ఎండు ఫలాలలో ఏదో ఒక పోషక విలువ లోపించి ఉండటాన్ని మనం గమనించవచ్చు. కేవలం ఈ కారణం వల్ల గింజధాన్యాలను మాత్రమే తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయి. అవి త్వరగా జీర్ణంకావు. అందువల్ల, గింజధాన్యాలతోబాటు తప్పనిసరిగా త్వరగా జీర్ణం అయ్యే ఆకు కూరలు, పండ్లు కూడా అవసరం. ఇవి అన్నీ తెలిసినప్పుడే సమీకృత ఆహారాన్ని ఎంపిక చేసుకోవటం సులభం అవుతుంది. ఈ విషయంలో మనలో చాలామందికి ఉన్న సాధారణ ఆహార విజ్ఞానం సరిపోదు. పోషకాహార నిపుణులతో లేదా ప్రకృతి వైద్యులతో సంప్రదించి, వారి సలహా తీసుకోవటం అవసరం.

సమీకృత ఆహారం... కొన్ని సూచనలు

ఎటువంటి ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవాలన్న విషయాన్ని అలా ఉంచితే సాధారణ ఆరోగ్యం దృష్ట్యా ఈ కింది సూచనలను పాటించటం మంచిదని ప్రకృతి వైద్యులు చెబుతుంటారు.

రోజూ ఉదయం పచ్చికూర ముక్కలు (వెజిటబుల్ సలాడ్) తీసుకోవటం మంచి అలవాటు. దంతాల పటుత్వం లేని వారు కూర ముక్కలను మిక్సీలో వేసుకుని చిన్న చిన్న ముక్కల రూపంలో గాని, లేక జ్యూస్ రూపంలోగాని తీసుకోవచ్చు.

అన్నిరకాల, అన్ని రంగుల పండ్లను లేదా పళ్ల రసాలను తీసుకోవాలి. ఆ క్రమంలో కాలానుగుణంగా వచ్చే సీజనల్ ఫలాలను తప్పనిసరిగా తీసుకోవాలి. మనం తినే ఆహారంలో కనీసం 30 లేక 40 శాతం పండ్లు ఉంటే మంచిది.

దంపుడు బియ్యం లేక మర పట్టని ముతక బియ్యం శ్రేష్ఠం. చిరుధాన్యాలు వాడటం మంచిది.

మొలకెత్తిన గింజలు, కొబ్బరి, ఖర్జూర ప్రతి రోజూ తీసుకోవటం మంచిది.

ఇలా తీసుకోవాలి

- కనీసం వారానికి నాలుగు రోజులు ఆకు కూరలను ఇగురు లేదా పప్పు రూపంలో తీసుకోవాలి.
- కాఫీ, టీ తాగే అలవాటును నెమ్మదిగా మానుకోవటం మంచిది, అలా మానుకోవడం సాధ్యం కాకపోతే, కనీసం మోతాదును తగ్గించాలి. రోజుకి ఒకటి లేక రెండుసార్లకు మించి తీసుకోరాదు.
- పొగాకు, జర్దా, ధూమపానం, మత్తుపానీయాలను పూర్తిగా మానుకోవాలి.
- కృత్రిమ రసాయనాలతో తయారు చేసిన, నిల్వ ఉన్న బేకరీ వస్తువులు, శీతల పానీయాలు (కూల్ డ్రింక్స్), చాక్లెట్లు, ఫాస్ట్‌ఫుడ్స్, ఐస్ క్రీమ్ లాంటివి మన శరీరానికి హాని చేస్తాయి. అందువల్ల వీటిని సాధ్యమైనంత వరకు తగ్గించటం మంచిది.
- ఉప్పు వాడకాన్ని బాగా తగ్గించాలి. ఎందుకంటే, మన శరీరానికి అవసరమైనంత ఉప్పు మనం తీసుకునే పండ్లు, కూరగాయలలోనే ఉంటుంది.
- ఆహారం ఎంపికలో మరొక ప్రధాన సమస్య అమ్లయుతమైన ఆహారం, క్షార యుతమైన ఆహారం, ఆమ్లాలు, క్షారాలు రెండూ మనకు అవసరమే అయినా, వాటి నిష్పత్తిలో తేడా ఉంది. ఆమ్లాల కన్నా క్షారాలు మనకు అధికంగా కావాలి. మనం తీసుకునే ఆహారం కూడా అదేవిధంగా ఉండాలి. అంటే అమ్లయుతమైన పదార్థాలు తక్కువగా, క్షారయుతమైన పదార్థాలు. ఎక్కువగా ఉండే విధంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అదేవిధంగా రోగగ్రస్థుల విషయంలో వ్యాధినిబట్టి ఆహార ఎంపిక ఉంటుంది. ఇది. అయితే ప్రధానంగా వైద్యుల పర్యవేక్షణలో జరగాలి.

ప్రకృతి ప్రసాదించిన, తాజాదనాన్ని ఇచ్చే ఎన్నో ఆరోగ్య సుగుణాలు ఉన్న ఆకు పుదీనా. దీనిని నిత్యం ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా వేసవిలో పుదీనా వాడకం మరింత ప్రయోజనకరం.

అలసట, అధిక దాహాన్ని దూరం చేసే పుదీనా



పుదీనా ఆకులలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ బి-6 లతోపాటు, క్యాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పొటాషియం వంటి మినరల్స్, ప్రోటీన్లు, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉండడంతో ఇది మన జీవక్రియను మెరుగుపరుస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ పుదీనా వాటర్ తీసుకుంటే చక్కెర స్థాయులు అదుపులో ఉంటాయి. బరువు తగ్గడానికి, ముసలితనం త్వరగా రాకుండా ఉండడానికి పుదీనా ఎంతో ఉపయోగపడుతుంది.

పుదీనా నీటిని తాగితే శరీరానికి శక్తి లభించడమే కాకుండా చర్మ సమస్యలు తగ్గుతాయి. కళ్ళ కింద నలుపు తగ్గటానికి పుదీనాతో తయారు చేసిన లేపనం ఎంతో ఉపయోగపడుతుంది. శరీరంలోని మలినాలను తొలగించి జీర్ణక్రియను సాఫీగా చేయడానికి, జీర్ణ వ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చేయడానికి ఉపయోగపడుతుంది. పుదీనాను మజ్జిగతో కలిపి తీసుకుంటే మన శరీరంలో వేడి తగ్గుతుంది.

అందానికి కూడా!

పుదీనా ఆకులను మెత్తగా నూరి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా ప్రకాశవంతంగా మారుతుంది. మన అందాన్ని పెంచటంలో కూడా పుదీనాది ప్రత్యేక స్థానం. చర్మ సమస్యలను నివారిస్తుంది. మొటిమలను, మచ్చలను తగ్గించడంలోపుదీనా ఎంతగానో ఉపయోగపడుతుంది. దంత సమస్యలను, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తుంది.

నోటి దుర్వాసనకు చెప్పి చెక్ పెట్టి, దంతాలను తెల్లగా మెరిసేలా చేస్తుంది. ఉదయాన్నే నిమ్మ రసం, తేనె, పుదీనా కలిపి తీసుకుంటే ఆరోగ్యాన్ని అది బాగు చేస్తుంది.

పుదీనాతో ఉత్సాహం...

వేసవిలో అధిక దాహం, అలసట సర్వ సాధారణం. అధిక దాహం సమస్యకు చెక్ పెట్టడానికి పుదీనా వాటర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, అలసటగా ఉన్నప్పుడు పుదీనా వాటర్‌లో కాస్తంత నిమ్మరసం, పటికబెల్లం లేదా చిటికడు బ్లాక్ సాల్ట్ కలుపుకుని తాగితే అలసట ఇట్టే తీరుతుంది.

వేసవి కాలం

కళ్ళ మంటలా? ఇలా చేయండి

ఎండలు మండుతున్నాయి. ఈ సమయంలో చాలామందికి కళ్లు పొడిబారిపోవడం, కళ్లు ఎర్రబడి మంటలు రావడం సర్వ సాధారణం. అలాంటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఉపశమనం కలుగుతుంది. ఆ చిట్కాలేమిటో చూద్దాం...



పాలలో కాని కలబంద రసంలో కానీ దూదిని ముంచి పదిహేను నిమిషాల పాటు కళ్ళపై పెట్టుకుంటే కళ్ళ అలసట తగ్గుతుంది.

- గంధం చెక్కని అరగదీసి కళ్ళ మీద రాసుకుంటే కళ్ళలోని ఎరుపు తగ్గుతుంది
- నిద్ర పోయే ముందు నాలుగైదు తేనె చుక్కలు, నువ్వుల నూనె నాలుగైదు చుక్కలు కలిపి కళ్ళలో వేసుకుంటే ఉదయానికి కళ్ళు నిర్మలంగా,స్వచ్ఛంగా ఉంటాయి.
- కళ్ళు మంటగా వుంటే చల్లటి నీటితో కళ్ళు శుభ్రంగా కడుక్కోవాలి. ఆ నీరు కళ్ళ లోని దుమ్ముకణాలు, మలినాలను తీసివేయడంలో సహాయపడుతుంది
- దూదిని రోజ్ వాటర్ లో ముంచి కను రెప్పలపై 10-15 నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేస్తే కంటి గాయాలకి, కళ్ళ మంటలకి ఉపశమనం లభిస్తుంది
- దూదిని పాలలో ముంచి కంటిచుట్టు తుడవాలి. తర్వాత చల్లనీటితో శుభ్రంగా కడుక్కోవాలి
- దోసకాయ ముక్కల్ని కట్ చేసి కను రెప్పల పై 15 నిమిషాల పాటు ఉంచినట్లయితే కళ్ళ మంట నుంచి ఉపశమనం పొందవచ్చు
- శుభ్రమైన తెల్లటి వస్త్రాన్ని చల్లటి నీటితో తడిపి నీరంతా పిండేయాలి. ఆ వస్త్రంలో కొన్ని మల్లెపూలు లేదా నంది వర్ధనం పూలు ఉంచి కళ్లమీద ఆ వస్త్రాన్ని ఉంచుకుంటే చల్లగా ఉండడంతోపాటు తలనొప్పి తగ్గుతుంది.
- పచ్చి బంగాళదుంపను చక్రాల్లా తరిగి ఆ ముక్కలను కళ్ళపై పెట్టుకుంటే కళ్ళమంటల నుంచి ఉపశమనం లభిస్తుంది.

సినిమా

చెడుపై గెలుపు



● తమన్నా

హీరోయిన్ తమన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓదెల 2'. 'ఓదెల రైల్వేస్టేషన్' ఫేమ్ అశోక్ తేజ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభమైంది. ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తన ప్రజలను రక్షించడానికి దేవుడు ప్రతి యుగంలో చెడుని ఎలా గెలుస్తాడో చూపించే కథాంశంతో ఈ మూవీ ఉంటుంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుపుతున్న రెండో షెడ్యూల్ 25 రోజుల పాటు సాగుతుంది. సినిమాలోని ప్రధాన తారాగణంతో పాటు ఇతర నటీనటులతో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ, మురళీ శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్, క్రియేటెడ్ బై: సంపత్ నంది.



● అమితాబ్ బచ్చన్

లాయర్‌గా...

బాలీవుడ్ హిట్ ఫిల్మ్ 'పింక్'లో అమితాబ్ బచ్చన్ లాయర్‌గా తన నటనతో ఆడియన్స్‌ను కట్టిపడేశారు. మరోసారి కోర్టులో అమితాబ్ బచ్చన్ మాట్లాడే పవర్‌ఫుల్ డైలాగ్స్ వినే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న 'వేట్టయాన్' చిత్రంలో లాయర్ పాత్రలో అమితాబ్ కనిపించనున్నారట. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. అది లాయర్ పాత్ర అనే ప్రచారం జరుగుతోంది. రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపిస్తారని, అమితాబ్ లాయర్‌గా కనిపిస్తారనీ భోగట్టా. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం చెన్నైలోని ఓ స్టూడియోలో జరుగుతోందట. రజనీ ఇంట్రో సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం.

అనుపమ పరదా



● అనుపమ

అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా, సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి 'పరదా' అనే టైటిల్ ఖరారైంది. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా ఫస్ట్ లుక్, కాన్సెప్ట్ వీడియోను నటి సమంత, దర్శక-నిర్మాతలు రాజ్ అండ్ డీకే షేర్ చేశారు. 'పరదా' కాన్సెప్ట్ వీడియోలో 'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా..' అనే శ్లోకం వినిపిస్తుండటం సినిమాపై ఆసక్తిని కలిగించేలా ఉంది. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్ లొకేషన్స్‌తో పాటు ఆ పరిసర గ్రామాల్లో ఇప్పటివరకు ఈ సినిమాను చిత్రీకరించారు. ''మేలో హైదరాబాద్‌లో జరగనున్న కొత్త షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ''ఓ మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అన్నారు ప్రవీణ్. ''ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లే ప్రయాణమే మా చిత్రం'' అన్నారు విజయ్ డొంకాడ. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.

నేరాలను నిర్మూలించే పోలీస్

'మొగలి రేకులు' సీరియల్ ఫేమ్ ఆర్‌కే సాగర్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిషా నారంగ్, ధన్యా బాలకృష్ణ, గిరిధర్, విష్ణుప్రియ ఇతర పాత్రలు చేస్తున్నారు. రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు, జె. తారక్ రామ్ నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ను హీరో చిరంజీవి తల్లి కొణిదెల అంజనా దేవి ఆవిష్కరించారు. ''ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా 'ది 100' రూపొందుతోంది. నేరాలను నిర్మూలించడానికి ఎంతకైనా తెగించే నిజాయితీ గల ఐపీఎస్ ఆఫీసర్ విక్రాంత్ పాత్రలో ఆర్‌కే సాగర్ నటిస్తున్నారు'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు.



● అంజనా దేవి, ఆర్.కె. సాగర్

అధునాతన టెక్నాలజీ తీసుకొచ్చాం

\- సారథి స్టూడియోస్ చైర్మన్ ప్రసాద్



● కీరవాణి, ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్, కేవీ రావు

''మా సారథి స్టూడియోలో పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కావాల్సిన అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చాం. మేం ప్రారంభించిన డాల్బీ మిక్సింగ్, సౌండ్ డిజైన్‌లు చాలా అధునాతనమైనవి. ఈ టెక్నాలజీని ఉపయోగించుకుంటూ మా స్టూడియోలో మొదలైన మొదటి సినిమా ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' అని చెప్పడానికి సంతోషిస్తున్నాం'' అని సారథి స్టూడియోస్ చైర్మన్ ఎంఎస్ఆర్‌వీ ప్రసాద్ అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేటలోని సారథి స్టూడియోలో నెలకొల్పిన అధునాతన డాల్బీ మిక్సింగ్ స్టూడియోను సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సౌండ్ డిజైన్ స్టూడియోను సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర ప్రారంభించారు. ''ఓ చిత్రానికి సౌండింగ్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. అందుకే అధునాతన టెక్నాలజీని ప్రవేశపెట్టాం'' అన్నారు సారథి స్టూడియోస్ డైరెక్టర్ కేవీ రావు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కేఎస్ రామారావు, కేఎల్ నారాయణ, రచయిత విజయేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



● జెన్నిఫర్ అనిస్టన్

ముప్పైనాలుగేళ్లకు సీక్వెల్

హాలీవుడ్ సూపర్ హిట్ కామెడీ ఫిల్మ్ '9 టు 5' (1980). కోలిన్ హిగ్గిన్స్ దర్శకత్వంలో డాబ్నీ కోల్‌మన్, జేన్ ఫోండా, లిల్లీ టామ్లిన్, డాలీ పార్టన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు ఆ తర్వాత సీక్వెల్ తీయాలనుకున్నారు. సీక్వెల్ పనులు జరుగుతున్నాయని జేన్ ఫోండా 2018లో ఓ సందర్భంగా పేర్కొన్నారు. కానీ సెట్స్‌పైకి వెళ్లలేదు. '9 టు 5' విడుదలైన ముప్పైనాలుగేళ్లకు ఇప్పుడు ఈ చిత్రం సీక్వెల్‌ని నటి జెన్నిఫర్ అనిస్టన్ నిర్మించడానికి సన్నాహాలు మొదలుపెట్టారు. ఆస్కార్ అవార్డు విన్నింగ్ రైటర్ డయాబ్లో కథ రాస్తున్నారట. ఇక '9 టు 5' కథ విషయానికొస్తే.. ఓ కంపెనీలో ముగ్గురు ఉద్యోగినిలు పై అధికారి వల్ల వేధింపులకు గురవుతారు. దాంతో అతణ్ని కిడ్నాప్ చేసి, ఓ గదిలో బంధిస్తారు? ఆ కంపెనీ యజమాని ఇదంతా తెలుసుకుని, ఆ ఉద్యోగినిలకు ఎలా అండగా నిలిచాడు? అనేది ఈ చిత్రకథ. సీక్వెల్ స్టోరీ ఎలా ఉంటుందో చూడాలి.

అయితే ఏంటంట?

కథానాయిక చాందినీ చౌదరి పోలీసాఫీసర్‌గా నటిస్తున్న చిత్రం 'యేవమ్'. వశిష్ఠ సింహా, జై భారత్, ఆషు రెడ్డి ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి చాందినీ చౌదరి పాత్ర లుక్‌ను విడుదల చేశారు. 'ఆడపిల్లనే... అయితే ఏంటంట?' అనే డైలాగ్ ఆ పోస్టర్ పై ఉంది. ''మహిళా సాధికారత, వారి ధైర్యాన్ని ప్రతిబింబించేలా ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో చాందినీ చౌదరి నటన హైలైట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



● చాందినీ చౌదరి

మేలో కృష్ణమ్మ



● సత్యదేవ్

ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్, అతీరా రాజ్ జంటగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వంలో అరుణాచల క్రియేషన్స్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం మే 10న విడుదల కానుంది. కాగా పలు విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించిన ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ 'కృష్ణమ్మ'ని విడుదల చేస్తున్నాయి. ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కిన చిత్రం 'కృష్ణమ్మ'. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. సత్యదేవ్‌ని సరికొత్త కోణంలో ఆవిష్కరించేలా ఈ మూవీ నిలుస్తుంది'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...

'ఐఐటీ కృష్ణమూర్తి' ఫేమ్ పృథ్వీ రూపాలి, అంబిక హీరో హీరోయిన్లుగా పాలిక్ శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఆమని, ఝాన్సీ లీడ్ రోల్స్‌లో ఈ సినిమాను దుర్గం రాజేష్, రావుల రమేశ్, టీఎస్ రాజు నిర్మిస్తున్నారు. ''లవ్, ఎమోషన్, ఫన్ అంశాలు మిళితమై, గ్రామీణ నేపథ్యంలో సాగే కథ ఇది. పాలిక్ చెప్పిన కథ నాకు నచ్చింది'' అన్నారు ఆమని. ''ఈ సినిమాను దీపావళికి రిలీజ్ చేస్తాం'' అన్నారు దర్శక-నిర్మాతలు.



● ఆమని

దీక్ష ఆరంభం



● రామకృష్ణ గౌడ్, భవ్యశ్రీ, కిరణ్

ప్రముఖ దర్శక-నిర్మాత ప్రతాని రామ కృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో 'దీక్ష' సినిమా ఆరంభమైంది. ఇందులో కిరణ్ కుమార్, భవ్యశ్రీ జంటగా నటిస్తున్నారు. ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. తొలి సన్నివేశానికి సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, రామ కృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. యోగానంద కృష్ణమాచార్య దర్శకత్వం వహించగా, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఉపాధ్యక్షులు ఎ. గురురాజ్, జేవీఆర్ స్క్రిప్టును యూనిట్‌కి అందించారు. ''మంచి కథాబలం ఉన్న సినిమా 'దీక్ష'. ఈ సినిమా తర్వాత క్రీడల నేపథ్యంలో మరో సినిమా చేయబోతున్నాను'' అన్నారు రామకృష్ణ గౌడ్.

ముక్కోణపు ప్రేమకథ

మూడు పాత్రల మధ్య ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో ఓ సినిమాకి శ్రీకారం జరిగింది. మురళీ అలకపల్లి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రాహుల్ శ్రీవాత్సవ్ అయ్యర్ .ఎన్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ రాంబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు క్లాప్ ఇచ్చారు. రాహుల్ శ్రీవాత్సవ్ అయ్యర్ .ఎన్ మాట్లాడుతూ- ''మానవీయ విలువలు, భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది'' అన్నారు మురళీ అలకపల్లి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	609	73,730
నిఫ్టీ ▽	150	22,420

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	15,972	▲ 362
డోజోన్స్	38,303	▲ 217
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,140	▲ 61
డాక్స్	18,616	▲ 244
షాంఘై	3,089	▲ 36
నికాయ్	37,935	▲ 306

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,448 ▲	354
బంగారం (99.5 స్వచ్ఛత)	72,158 ▲	353
వెండి (కేజీ)	81,374 ▲	476

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.19	85.17
£	బ్రిటన్ పౌండ్		101.81	106.76
€	యూరో		87.13	91.68
¥	జపాన్ ఎన్ (100)		41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.05	56.89
S$	సింగపూర్ డాలర్		58.96	63.67
SAR	సౌదీ రియాల్		21.32	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.80	23.58
¥	చైనా యువాన్		10.38	12.45

సాండూర్ మాంగనీస్ చేతికి ఆర్జాస్ స్టీల్

బెంగళూరు: స్పెషల్ స్టీల్ ఉత్పత్తులను తయారు చేసే ఆర్జాస్ స్టీల్‌లో (ఏఎస్‌పీఎల్) నియంత్రణాధికారాలు ఉండే వాటాలను కొనుగోలు చేయనున్నట్లు సాండూర్ మాంగనీస్ అండ్ ఐరన్ ఓర్స్ వెల్లడించింది. ఇందుకోసం పీఈ సంస్థ ఏడీవీ పార్ట్‌నర్స్‌తో షేర్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది. ఈ డీల్ కోసం సంస్థ విలువను రూ. 3,000 కోట్లుగా లెక్కగట్టారు. ఆర్జాస్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రిలో, పంజాబ్‌లోని మండీ గోబింద్‌గఢ్‌లో మొత్తం రెండు ప్లాంట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్లాంట్లను విస్తరిస్తున్నారు. ఆటోమొబైల్స్‌తో పాటు ఎనర్జీ, రైల్వేస్, డిఫెన్స్, ఇంజినీరింగ్ తదితర విభాగాల సంస్థలకు ఉత్పత్తులు అందిస్తోంది.

ఎల్‌ఎస్‌పీలకు ఆర్‌బీఐ కొత్త నిబంధనలు

ముంబై: బ్యాంకులకు ఏజెంట్లుగా వ్యవహరించే లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్స్ (ఎల్‌ఎస్‌పీ)కు రిజర్వ్ బ్యాంక్ కొత్త నిబంధనలు ప్రతిపాదించింది. వీటి ప్రకారం భావి రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్న అన్ని ఆర్థిక సంస్థల ఆఫర్లను భావి రుణ గ్రహీతలకు డిజిటల్ రూపంలో ఎల్‌ఎస్‌పీలు తెలియజేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో, ఆఫర్ ఇస్తున్న ఆర్థిక సంస్థ (ఆర్‌ఈ) పేరు, రుణ మొత్తం, లోన్ కాల వ్యవధి, వార్షిక పర్సంటేజీ రేటు ఇతరత్రా కీలక నిబంధనలు, షరతులు మొదలైన వివరాలు ఉండాలి. రుణ గ్రహీత తనకు అందుబాటులో ఉన్న వివరాలను బట్టి సముచిత నిర్ణయం తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400-00
చిత్తూరు	453-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380-00
విజయవాడ	380-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

భారత్ వృద్ధి 6.6 శాతం: డెలాయిట్ ఇండియా



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) 6.6 శాతం వృద్ధిని నమోదుచేసుకుంటుందని డెలాయిట్ ఇండియా పేర్కొంది. వినియోగ వ్యయం, ఎగుమతులు తిరిగి పుంజుకోవడం, పెట్టుబడుల పునరుత్తేజం వృద్ధికి దోహదపడే అంశాలుగా తాజా ఎకనమిక్ అవుట్‌లుక్‌లో వివరించింది. మధ్య-ఆదాయ తరగతి వేగవంతమైన వృద్ధి కొనుగోలు శక్తి పెరుగుదలకు దారితీస్తోందని తెలిపింది. దీనితో ప్రీమియం లగ్జరీ ఉత్పత్తులు, సేవలకు డిమాండ్ కూడా మెరుగుపడుతున్నట్లు తెలిపింది. 2030-31 నాటికి మధ్యస్థ-అధిక-ఆదాయ విభాగాల సంఖ్య రెండు కుటుంబాలలో ఒకటిగా ఉంటుందని అంచనావేసింది. ఈ ధోరణి ప్రైవేట్ వినియోగదారుల వ్యయ వృద్ధికి దారితీస్తుందని విశ్వసిస్తున్నట్లు విశ్లేషించింది. ప్రస్తుతం ఈ సంఖ్య నాలుగు కుటుంబాల్లో ఒకటిగా ఉందని తెలిపింది. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు అంచనాలను మెరుగుపరుస్తూ ఇది 7.6 శాతం నుంచి 7.8% శ్రేణిలో ఉంటుందని తెలిపింది. జనవరిలో వేసిన 6.9%-7.2% రేటు అంచనాలను గణనీయ స్థాయిలో పెంచడం గమనార్హం.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

వారాంతాన లాభాల స్వీకరణ ● బ్యాంకులు, ఫైనాన్స్, కన్జూమర్ షేర్లు డీలా



ముంబై: ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో స్టాక్ సూచీలు శుక్రవారం దాదాపు ఒక శాతం కుదేలయ్యాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్, కన్జూమర్ డ్యూరబుల్ షేర్లు డీలా పడ్డాయి. మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు తోడయ్యాయి. సెన్సెక్స్ 609 పాయింట్లు పతనమై 73,730 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 150 పాయింట్లు నష్టపోయి 22,420 వద్ద నిలిచింది. దీంతో సూచీల అయిదు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్థమంతా లాభ నష్టాల మధ్య ట్రేడయ్యాయి. మిడ్ సెషన్ నుంచి అమ్మకాల తీవ్రత పెరగడంతో పూర్తిగా నష్టాల్లోకి జారుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 723 పాయింట్లు నష్టపోయి 73,617 వద్ద నిలిచింది. నిఫ్టీ 185 పాయింట్లు క్షీణించి 22,385 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి.

వొడాఫోన్ ఐడియాలో తనకున్న మొత్తం వాటా 2.87%(144 కోట్ల షేర్లు)ను ఏటీసీ టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఓపెన్ మార్కెట్ ద్వారా విక్రయించింది. ఈ లావాదేవీ విలువ రూ.1,840 కోట్లు.

అపోలో 24/7లో అడ్వెంట్‌కు వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన అపోలో హెల్త్‌కో (అపోలో 24/7) తాజాగా ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి రూ.2,475 కోట్ల వాటా మూలధనం సమకూర్చుకుంటోంది. ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు శుక్రవారం ప్రకటించింది. లావాదేవీలో భాగంగా అపోలో గ్రూప్‌లో భాగమైన హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆన్‌లైన్ హెల్త్‌కేర్ కంపెనీ అపోలో 24/7 విలీనం కానున్నాయి. విలీనం తర్వాత ఏర్పడే అపోలో హెల్త్‌కో కంపెనీలో 12.1 శాతం వాటాకై కంపల్సరీ కన్వర్టబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ రూపంలో రెండు విడతల్లో అడ్వెంట్ పెట్టుబడి చేస్తుంది. అపోలో హెల్త్‌కోను రూ.22,481 కోట్లుగా విలువ కట్టారు. ఇందులో అపోలో 24/7ను రూ.14,478 కోట్లు, కీమెడ్‌ను రూ.8,003 కోట్లుగా విలువ కట్టారు. అపోలో హెల్త్‌కో కంపెనీలో అపోలో హాస్పిటల్స్‌కు 59.2 శాతం, కీమెడ్‌కు 25.7 శాతం వాటా ఉంటుంది.

మారుతీ రికార్డుల స్పీడ్

- షేరుకి రూ. 125 డివిడెండ్
- 21 లక్షల వాహన విక్రయాలు
- క్యూ4 లాభం రూ. 3,878 కోట్లు

ఈ ఏడాది ఎలక్ట్రిక్ వాహనాలు



"ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఎలక్ట్రిక్ వాహనాన్ని ఉత్పత్తి చేస్తున్నాం. తొలిగా వీటిని యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేయనున్నాం."
-ఆర్‌సీ భార్గవ, మారుతీ చైర్మన్



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం (2023-24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 48 శాతం జంప్‌చేసి రూ. 3,878 కోట్లను తాకింది. ఇది రికార్డుకాగా.. ఇందుకు జోరందుకున్న ఎస్‌యూవీ అమ్మకాలు, తగ్గిన కమోడిటీ ధరలు, వ్యయ నియంత్రణలు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2022-23) క్యూ4లో కేవలం రూ. 2,624 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా షేరుకి రూ. 125 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 30,822 కోట్ల నుంచి రూ. 36,697 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 13 శాతం అధికంగా 5,84,031 వాహనాలు విక్రయించింది. వీటిలో దేశీయంగా 5,05,291 యూనిట్లు విక్రయిస్తే.. 22% అధికంగా 78,740 వాహనాలు ఎగుమతి చేసింది.

టాప్ ఎక్స్‌పోర్టర్

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మారుతీ వాహన విక్రయాలు సరికొత్త రికార్డును నెలకొల్పుతూ 20 లక్షల యూనిట్లను అధిగమించాయి. దాదాపు 9 శాతం వృద్ధితో 21,35,323 యూనిట్లు అమ్ముడయ్యాయి. వీటిలో దేశీ విక్రయాలు 18,52,256కాగా.. 2,83,067 వాహనాలను ఎగుమతి చేసింది. తద్వారా మొత్తం ప్యాసింజర్ వాహన దేశీ ఎగుమతుల్లో 42 శాతం వాటాను ఆక్రమించింది. వెరసి వరుసగా మూడో ఏడాదిలోనూ టాప్ ఎక్స్‌పోర్టర్‌గా నిలిచింది. ఇక 2023-24లో నికర లాభం 64 శాతం దూసుకెళ్లి రూ. 13,209 కోట్లను అధిగమించింది. నికర అమ్మకాలు 20 శాతం వృద్ధితో రూ. 1,34,938 కోట్లకు చేరగా.. 2022-23లో ఇవి రూ. 1,12,501 కోట్లుగా నమోదయ్యాయి. క్యూ4 సహా పూర్తిఏడాదికి లాభాలు, అమ్మకాలలో సరికొత్త రికార్డులు సాధించినట్లు కంపెనీ పేర్కొంది.

లాభాల స్వీకరణతో మారుతీ షేరు బీఎస్‌ఈలో 1.7 శాతం నీరసించి రూ. 12,687 వద్ద ముగిసింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ఫ్లాట్

క్యూ4లో రూ. 3,986 కోట్లు ● షేరుకి రూ. 18 డివిడెండ్



ఐటీ సేవల దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ (2023-24) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం దాదాపు యథాతథంగా రూ. 3,986 కోట్లకు చేరింది. అయితే గతేడాది క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో సాధించిన రూ. 4,350 కోట్లతో త్రైమాసికవారీగా పోలిస్తే 8.4 శాతం క్షీణించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 18 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మే 15కల్లా చెల్లించనుంది. మొత్తం ఆదాయం 7 శాతంపైగా బలపడి రూ. 28,499 కోట్లకు చేరింది.

3-5 శాతం వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మొత్తం ఆదాయంలో 3-5 శాతం స్థాయిలో వృద్ధి అందుకోగలమని హెచ్‌సీఎల్ టెక్ తాజా అంచనాలు(గైడెన్స్) ప్రకటించింది. 18-19 శాతం ఇబిట్ మార్జిన్లు సాధించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. గతేడాది క్యూ4లో 17.6 శాతం ఇబిట్ మార్జిన్లు ప్రకటించింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 19.4 శాతం నుంచి 12.4 శాతానికి దిగివచ్చింది.

10,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గతేడాది తరహాలోనే ఈ ఏడాది(2024-25) 10,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. త్రైమాసికవారీగా క్యూ4లో 1,537 మంది ఉద్యోగులు జత కలిశారు. దీంతో సిబ్బంది సంఖ్య 2,27,481కు చేరింది. 2023-24లో హెచ్‌సీఎల్ టెక్ నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 15,702 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 8 శాతంపైగా ఎగసి రూ. 1,09,913 కోట్లకు చేరింది.

హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్‌ఈలో 2% నష్టంతో రూ. 1,472 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ కార్డ్ లాభం ప్లస్



ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాదికి పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 11 శాతం ఎగసి రూ. 662 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం వృద్ధితో రూ. 4,475 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 28 శాతం పుంజుకుని రూ. 2,139 కోట్లను తాకింది. ఫీజు, కమిషన్ ఆదాయం 6 శాతం అధికమై రూ. 2,209 కోట్లయ్యింది. పూర్తి ఏడాదికి నికర లాభం 7 శాతం బలపడి రూ. 2,408 కోట్లకు చేరింది.

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ × ముంబై (మ. 3:30 నుంచి)
లక్నో × రాజస్తాన్ (రాత్రి 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పరుగుల పంజా...

- పంజాబ్ కింగ్స్ సంచలనం
- 262 లక్ష్యాన్ని ఛేదించి ఘనవిజయం
- టి20 చరిత్రలోనే ఇదే అత్యధికం
- 8 వికెట్లతో ఓడిన కోల్‌కతా
- బెయిర్‌స్టో అజేయ సెంచరీ
- శశాంక్ మెరుపు ఇన్నింగ్స్



బెయిర్‌స్టో

శశాంక్ సింగ్

37 ఫోర్లు... 42 సిక్సర్లు... ఇరు జట్లు కలిపి ఏకంగా 523 పరుగులు... ఈడెన్ గార్డెన్స్ పరుగుల వరదతో తడిసి ముద్దయింది. ఈ సీజన్ ఐపీఎల్‌లో భారీ స్కోర్ల సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరో మ్యాచ్‌లో 'రన్'రంగం కొనసాగింది ... అయితే ఈసారి తొలుత బ్యాటింగ్ చేసిన జట్టే కాకుండా రెండో టీమ్ కూడా అంతే బదులుగా జవాబిచ్చింది. ఫలితంగా టి20 చరిత్రలోనే రికార్డు ఛేదనతో మ్యాచ్ ముగిసింది... పేలవ ఆటతో వెనుకబడి ఒక్క విజయం కోసం తపిస్తున్న పంజాబ్ కింగ్స్ అసాధారణ బ్యాటింగ్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించడమే పెద్ద విశేషం. సొంతగడ్డపై 261 పరుగులు చేసి కోల్‌కతా నిశ్చింతగా నిలబడగా... తామూ తగ్గమంటూ రెచ్చిపోయిన కింగ్స్ మరో 8 బంతులు ఉండగానే 262 పరుగులతో ఘన విజయాన్నందుకుంది. వరుస వైఫల్యాల తర్వాత మెరుపు సెంచరీతో చెలరేగిన బెయిర్‌స్టో, యువ ఆటగాడు శశాంక్ ఈ మ్యాచ్‌లో పంజాబ్ హీరోలుగా నిలిచారు.

కోల్‌కతా: పంజాబ్ కింగ్స్ ఎట్టకేలకు జూలు విదిల్చింది. వరుసగా నాలుగు ఓటముల తర్వాత అత్యద్భుత ప్రదర్శనతో ఆ జట్టు కీలక విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన పోరులో పంజాబ్ 8 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 261 పరుగులు చేసింది. ఫిల్ సాల్ట్ (37 బంతుల్లో 75; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), సునీల్ నరైన్ (32 బంతుల్లో 71; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా, వెంకటేశ్ అయ్యర్ (23 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం పంజాబ్ 18.4 ఓవర్లలో 2 వికెట్లకు 262 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జానీ బెయిర్‌స్టో (48 బంతుల్లో 108 నాటౌట్; 8 ఫోర్లు, 9 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (28 బంతుల్లో 68 నాటౌట్; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు), ప్రభ్ సిమ్రన్ సింగ్ (20 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అసాధ్యంగా అనిపించిన లక్ష్యాన్ని ఛేదించి చూపించారు.

శతక భాగస్వామ్యం...

సొంత మైదానంలో కోల్‌కతా ఇన్నింగ్స్ జోరుగా సాగింది. టోర్నీలో తమ ఫామ్‌ను కొనసాగిస్తూ ఓపెనర్లు సాల్ట్, నరైన్ మరోసారి మెరుపు వేగంతో జట్టుకు శుభారంభం అందించారు. వీరిద్దరి ధాటికి పవర్‌ప్లే ముగిసేసరికి జట్టు 76 పరుగులు చేసింది. 7 ఓవర్లలోపే 3 క్యాచ్‌లు వదిలేసిన పంజాబ్ ప్రత్యర్థికి సహకరించింది. ఈ క్రమంలో నరైన్ 23 బంతుల్లో, సాల్ట్ 25 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 137/0 కాగా... ఎట్టకేలకు 11వ ఓవర్లో పంజాబ్ తొలి వికెట్ పడగొట్టగలిగింది. ఓపెనర్లు వెనుదిరిగిన తర్వాత కూడా నైట్‌రైడర్స్ జోరు తగ్గలేదు. వెంకటేశ్ దూకుడుగా ఆడగా... రసెల్ (12 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ (10 బంతుల్లో 28; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కూడా ధాటిని ప్రదర్శించారు. దాంతో 15.2 ఓవర్లలో స్కోరు 200 పరుగులకు చేరింది. చివరి 5 ఓవర్లలో కేకేఆర్ 71 పరుగులు సాధించింది.

వీర విధ్వంసం...

ఛేదనలో పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, బెయిర్‌స్టో కూడా చెలరేగారు. ప్రభ్‌సిమ్రన్ ఒకదశలో 10 బంతుల వ్యవధిలో 4 సిక్స్‌లు, 2 ఫోర్లు బాదాడు. 18 బంతుల్లోనే అతని హాఫ్ సెంచరీ పూర్తయింది. అనుకూల్ వేసిన ఓవర్లో బెయిర్‌స్టో వరుసగా 4, 6, 4, 4, 6తో చెలరేగాడు. వీరిద్దరు 36 బంతుల్లో 93 పరుగులు జోడించిన తర్వాత తొలి వికెట్ తీసి కోల్‌కతా కాస్త ఊరట చెందింది. అయితే 23 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న తర్వాత బెయిర్‌స్టో మరింత ధాటిగా ఆడాడు. కొద్దిసేపు రోసో (16 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అతనికి సహకరించాడు. ఆరు వరుస ఇన్నింగ్స్‌లలో వైఫల్యాల తర్వాత ఎట్టకేలకు ఈ మ్యాచ్‌లో 45 బంతుల్లో శతకాన్ని చేరుకున్నాడు. మరోవైపు శశాంక్ ఎక్కడా తగ్గకుండా సిక్సర్లతో విరుచుకు పడ్డాడు. చమీరా ఓవర్లో అతను కొట్టిన 3 సిక్సర్లతో పంజాబ్ విజయానికి చేరువైంది. ఆఖరి 3 ఓవర్లలో 34 పరుగులు కావాల్సి ఉండగా... హర్షిత్ వేసిన 18వ ఓవర్లోనే శశాంక్ 3 సిక్స్‌లు, ఫోర్ బాదగా 25 పరుగులు రావడంతో పంజాబ్ గెలుపు లాంఛనమే అయింది. బెయిర్‌స్టో, శశాంక్ మూడో వికెట్‌కు 37 బంతుల్లోనే అభేద్యంగా 84 పరుగులు జత చేశారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (బి) స్యామ్ కరన్ 75; నరైన్ (సి) బెయిర్‌స్టో (బి) చహర్ 71; వెంకటేశ్ అయ్యర్ (రనౌట్) 39; రసెల్ (సి) హర్షల్ (బి) అర్‌్షదీప్ 24; శ్రేయస్ (సి) రబడ (బి) అర్‌్షదీప్ 28; రింకూ సింగ్ (సి) అశుతోష్ (బి) హర్షల్ 5; రమణ్‌దీప్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 261.** వికెట్ల పతనం: 1-138, 2-163, 3-203, 4-246, 5-253, 6-261. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-60-1, అర్‌్షదీప్ 4-0-45-2, హర్షల్ 3-0-48-1, రబడ 3-0-52-0, రాహుల్ చహర్ 4-0-33-1, హర్‌ప్రీత్ 2-0-21-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (రనౌట్) 54; బెయిర్‌స్టో (నాటౌట్) 108; రోసో (సి) శ్రేయస్ (బి) నరైన్ 26; శశాంక్ (నాటౌట్) 68; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.4 ఓవర్లలో 2 వికెట్లకు) 262.** వికెట్ల పతనం: 1-93, 2-178. **బౌలింగ్:** చమీరా 3-0-48-0, హర్షిత్ 4-0-61-0, అనుకూల్ 2-0-36-0, నరైన్ 4-0-24-1, వరుణ్ 3-0-46-0, రసెల్ 2-0-36-0, రమణ్‌దీప్ 0.4-0-9-0.

262 టి20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా పంజాబ్ కింగ్స్ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు దక్షిణాఫ్రికా (259/4 ; వెస్టిండీస్‌పై మార్చి 26న, 2023లో) జట్టు పేరిట ఉంది.

42 ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక సిక్స్‌లు నమోదైన మ్యాచ్‌గా పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మ్యాచ్ గుర్తింపు పొందింది. ఈ సీజన్‌లోనే సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో 38 సిక్స్‌లు వచ్చాయి.

24 ఐపీఎల్ టోర్నీలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా పంజాబ్ కింగ్స్ గుర్తింపు పొందింది. ఈ సీజన్‌లోనే ఢిల్లీ క్యాపిటల్స్‌తో, బెంగళూరు జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ 22 సిక్స్‌లు చొప్పున కొట్టింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	8	5	3	10	0.972
హైదరాబాద్	8	5	3	10	0.577
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
ఢిల్లీ	9	4	5	8	-0.386
గుజరాత్	9	4	5	8	-0.974
పంజాబ్	9	3	6	6	-0.187
ముంబై	8	3	5	6	-0.227
బెంగళూరు	9	2	7	4	-0.721

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

'మిక్స్‌డ్' ఫైనల్లో సురేఖ-అభిషేక్ జోడీ

కాంస్యం కోసం ధీరజ్-అంకిత ద్వయం పోరు



షాంఘై (చైనా): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో భారత ఆర్చర్ల జోరు కొనసాగుతోంది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ-అభిషేక్ వర్మ (భారత్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో జ్యోతి సురేఖ-అభిషేక్ ద్వయం 155-151తో బెసెరా-మెండెజ్ (మెక్సికో) జంటను ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్-అంకిత (భారత్) జోడీ కాంస్య పతకం కోసం పోటీ పడనుంది. సెమీఫైనల్లో ధీరజ్ -అంకిత 0-6తో లిమ్ సిహైన్-కిమ్ వూజిన్ (కొరియా) చేతిలో ఓడిపోయారు. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ధీరజ్ మూడో రౌండ్‌లో 4-6 తో కెన్ సాంచెజ్ (స్పెయిన్) చేతిలో ఓటమి చవిచూశాడు. భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్ క్వార్టర్ ఫైనల్లో 3-7తో టిమినో (స్పెయిన్) చేతిలో పరాజయం పాలయ్యాడు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ దీపిక కుమారి క్వార్టర్ ఫైనల్లో 6-4తో జెన్ హస్ యంగ్ (కొరియా)పై నెగ్గి సెమీఫైనల్ చేరింది.

పరుగు ఇవ్వకుండానే 7 వికెట్లు

మహిళల టి20ల్లో ఇండోనేసియా బౌలర్ రొమాలియా రికార్డు




బాలి: ఇండోనేసియా టీనేజ్ బౌలర్ రొమాలియా మహిళల అంతర్జాతీయ టి20ల్లో అసాధారణ రికార్డును లిఖించింది. మంగోలియాతో జరిగిన ఐదో టి20 మ్యాచ్‌లో 17 ఏళ్ల స్పిన్నర్ రొమాలియా (7/0) అసలు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 7 వికెట్లు పడగొట్టి... అనామక జట్ల మధ్య జరిగిన అంతర్జాతీయ మ్యాచ్‌లో చరిత్ర పుటలకెక్కింది. తద్వారా 2021లో నెదర్లాండ్స్ బౌలర్ ఫ్రెడరిక్ ఓవర్‌డిక్ (7/3) ఫ్రాన్స్‌పై నెలకొల్పిన రికార్డును చెరిపేసింది. మొదట ఇండోనేసియా మహిళల జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 151 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన మంగోలియా 16.2 ఓవర్లలో 24 పరుగులకే కుప్పకూలింది. రొమాలియా (3.2-3-0-7) వేసిన 3.2 ఓవర్లలో 3 మెయిడిన్లు కావడం విశేషం. ఆమె స్పిన్ ఉచ్చులో పడి ఏకంగా ఐదుగురు బ్యాటర్లు ఎర్డెనెసుడ్ (0), అనుజిన్ (0), నమూంజుల్ (0), నరంజెరెల్ (0), ఎన్‌క్జుల్ (0) ఖాతానే తెరవలేకపోయారు.

టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో...

థామస్ కప్ బరిలో భారత పురుషుల జట్టు
● తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో 'ఢీ'



చెంగ్డూ (చైనా): రెండేళ్ల క్రితం థామస్ కప్ టోర్నమెంట్‌లో తొలిసారి విజేతగా నిలిచి పెను సంచలనం సృష్టించిన భారత పురుషుల జట్టు అదే ఫలితాన్ని ఈసారీ పునరావృతం చేయాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్‌లతో కలిసి భారత్ పోటీపడనుంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో భారత్ 'ఢీ' కొంటుంది. మహిళల టీమ్ ఈవెంట్ అయిన ఉబెర్ కప్‌లో భారత జట్టు ద్వితీయ శ్రేణి క్రీడాకారిణులతో బరిలోకి దిగనుంది. సింధు, అశ్విని పొన్నప్ప, తనీషా, గాయత్రి, ట్రిసా ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు. గ్రూప్ 'ఎ'లో కెనడా, చైనా, సింగపూర్‌లతో కలిసి భారత్ ఉంది. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కెనడాతో భారత్ ఆడుతుంది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.